శుక్రవారం
26-04-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 304
పేజీలు : 10, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

అర్జెంటీనాలో ప్రజాగ్రహం

బ్యూనస్ ఎయిర్స్ : అర్జెంటీనాలోని యూనివర్సిటీలలో అధ్యక్షుడు జేవియర్ మిల్లే అమలు చేసిన పొదుపు చర్యలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థులు, యూనివర్సిటీ ప్రొఫెసర్లతో పాటు లక్షలాది మంది కార్మిక సంఘాల కార్యకర్తలు, ప్రతిపక్ష రాజకీయ పార్టీల కార్యకర్తలు వీటిలో పాల్గొంటున్నారు. గత ఏడాది డిసెంబరులో జేవియర్ మిల్లే అధికారాన్ని చేపట్టిన తర్వాత అర్జెంటీనాలో జరిగిన అతిపెద్ద నిరసనలు ఇవే. నిరసనల కారణంగా బ్యూనస్ ఎయిర్స్‌లో కొన్ని గంటలపాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది. యూనివర్సిటీలను మూసివేసే స్థితికి తీసుకొచ్చిన విధానపరమైన విధానాలను విరమించుకోవాలని నిరసనకారులు డిమాండ్ చేశారు.

ఎన్నికల ప్రచారానికి సునీతాకేజ్రీవాల్

న్యూదిల్లీ: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ భార్య సునీత ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థుల తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. దిల్లీ తూర్పు లోక్‌సభ స్థానం నుంచి ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ అభ్యర్థిగా కులదీప్ కుమార్ బరిలో దిగారు. ఆయనకు మద్దతుగా ఆ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని కొండ్లి అసెంబ్లీ స్థానం నుంచి ఈ వారాంతంలో ఎన్నికల ప్రచారానికి సునీత కేజ్రీవాల్ శ్రీకారం చుట్టనున్నారు. ఈ ఎన్నికల్లో దిల్లీలో కాంగ్రెస్ పార్టీతో ఆప్ జత కట్టింది. దాంతో పశ్చిమ దిల్లీ, దక్షిణ దిల్లీ, న్యూదిల్లీ లోక్‌సభ స్థానాల్లో ఆప్ తన అభ్యర్థులను బరిలో దింపింది. ఈశాన్య దిల్లీ, వాయువ్య దిల్లీ, చాందినీ చౌక్ లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థులను రంగంలోకి దింపింది. దీంతో దిల్లీలోని లోక్‌సభ అభ్యర్థుల తరపున సునీత ఎన్నికల ప్రచారంలో పాల్గొనున్నారు. అలాగే సునీత గుజరాత్, పంజాబ్‌ల్లో సైతం ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. గుజరాత్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ స్టార్ క్యాంపెయినర్‌గా సునీత పేరును ఇప్పటికే ఆ పార్టీ ప్రకటించిన విషయం విదితమే. మార్చి 21వ

- మిగతా 2 లో

మోదీ, రాహుల్‌కు ఈడీ నోటీసులు

న్యూదిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో పోటాపోటీగా ప్రచారం చేస్తున్న పార్టీలు ఒకడుగు ముందుకేసి ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నాయి. ఎన్నికల నియమావళి ఉల్లంఘించినందుకుగాను కేంద్ర ఎన్నికల సంఘం రెండు ప్రధాన జాతీయ పార్టీలకు షాక్ ఇచ్చింది. వివాదాస్పద వ్యాఖ్యలు చేసి నిబంధనలు అతిక్రమించినందుకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఈసీ గురువారం నోటీసులు జారీ చేసింది. ప్రధాని నరేంద్రమోదీ చేసిన వివాదాస్పద, విద్వేష ప్రసంగాలపై కాంగ్రెస్ ఫిర్యాదు చేయగా...రాహుల్‌గాంధీ ప్రసంగాలపై బీజేపీ ఫిర్యాదు చేసింది. ఆయా పార్టీల నేతలు చేసిన వ్యాఖ్యలపై బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఏప్రిల్ 29 ఉదయం 11 గంటలలోపు వివరణ

- మిగతా 2 లో

రెండో విడతకు రంగం సిద్ధం

- నేడు 13 రాష్ట్రాల్లో 89 లోక్‌సభ స్థానాలకు పోలింగ్
- కేరళలో 20 స్థానాల్లో ఒకేసారి
- బరిలో 1206 మంది అభ్యర్థులు

న్యూదిల్లీ: రెండో విడత లోక్‌సభ ఎన్నికల సంగ్రామానికి రంగం సిద్ధమైంది. 13 రాష్ట్రాల్లోని మొత్తం 88 లోక్‌సభ స్థానాల్లో ఓట్ల పండుగకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సార్వత్రిక ఎన్నికలను దేశవ్యాప్తంగా మొత్తం 7 విడతల్లో నిర్వహించనుండగా శుక్రవారం (ఏప్రిల్ 26) రెండోదశ

- మిగతా 2 లో

ముగిసిన నామినేషన్ల ఘట్టం

- లోక్‌సభకు 721, అసెంబ్లీకి 4,210 దాఖలు
- పులివెందులలో సీఎం నామినేషన్
- నేడు పరిశీలన

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి : ఆంధ్ర ప్రదేశ్‌లోని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు నామినేషన్ల ఘట్టం గురువారంతో ముగిసింది. చివరి రోజు భారీ సంఖ్యలో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల వద్ద హడావుడి నెలకొంది. నామినేషన్లకు ముందు అభ్యర్థులు భారీ ర్యాలీగా ఆర్వో కార్యాలయానికి సమీపం వద్దకు తరలివచ్చారు. తమ ప్రత్యర్థులకు దీటుగా బల ప్రదర్శనలు చూపారు. అక్కడక్కడా స్వల్ప సంఘటనలు మినహా నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా పూర్తయింది. తిరుపతి ఆర్డీఓ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. నామినేషన్ వేసేందుకు చంద్రగిరి అసెంబ్లీకి చెందిన టీడీపీ, వైసీపీ అభ్యర్థులు పులివర్తి నాని, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఒకేసారి కార్యాలయానికి తరలివరావడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి అదుపు చేశారు. ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూలు విధించింది. 26వ తేదీ శుక్రవారం నామినేషన్లను అధికారులు పరిశీలిస్తారు. అసంపూర్తిగా ఉన్న అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరిస్తారు. 175 అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను దాదాపు 4,210 మంది, 25 లోక్‌సభ స్థానాలకుగాను 721 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ప్రాథమిక సమాచారం. 'ఇండియా' కూటమికి చెందిన కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం అభ్యర్థులు లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు నామినేషన్లు వేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 అసెంబ్లీ స్థానాలు, 25 లోక్‌సభ స్థానాల్లో వైసీపీ ఒంటరిగా బరిలోకి దిగింది. చివరి రోజు పులివెందుల అసెంబ్లీ అభ్యర్థిగా సీఎం వైఎస్ జగన్ నామినేషన్ వేశారు. ఇప్పటికే పులివెందులకు జగన్ తరపున ఒక సెట్ నామినేషన్‌ను అక్కడి వైసీపీ నేతలు వేశారు. అలాగే వైసీపీ అభ్యర్థులుగా పెనమలూరులో జోగి రమేశ్, గుడివాడలో కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని), గన్నవరంలో వల్లభనేని వంశీ, తునిలో

- మిగతా 2 లో

విశాఖ ఉక్కు జోలికి వెళ్లొద్దు

- భూములు, ఆస్తుల విషయంలో యథాతథ స్థితి పాటించండి
- కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి : విశాఖ ఉక్కు కర్మాగారానికి సంబంధించి రాష్ట్ర హైకోర్టు గురువారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఉక్కు పరిశ్రమకు చెందిన భూములు, ఆస్తుల విషయంలో యథాతథ స్థితి పాటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ అంశంలో కేంద్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ప్రజాశాంతి పార్టీ

- మిగతా 2 లో

బీజేపీకి హోదా తాకట్టు

- బాబు, జగన్ వల్లే రాష్ట్రాభివృద్ధి, బిడ్డల భవిష్యత్తు నాశనం
- ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలి
- గుంటూరు ఎన్నికల ప్రచారంలో వైఎస్ షర్మిల

విశాలాంధ్ర–గుంటూరు: రాష్ట్రాభివృద్ధికి, బిడ్డల భవిష్యత్తుకు కీలకమైన ప్రత్యేక హోదాను గత పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన చంద్రబాబు, జగన్‌మోహన్ రెడ్డి బీజేపీకి తాకట్టు పెట్టారని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పదేళ్లలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ వచ్చిందా... యువతకు ఉద్యోగాలు వచ్చాయా... రాష్ట్రం ఒక్క అడుగైనా అభివృద్ధిలో ముందుకు వెళ్లిందా అని ప్రశ్నించారు. వైఎస్ షర్మిల గురువారం రాత్రి గుంటూరుకు వచ్చారు. శారదాకాలనీ, సంజీవయ్య నగర్‌లో ఎన్నికల ప్రచారం చేశారు. అనంతరం సంజీవయ్య నగర్‌లో జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ ఇండియా కూటమి బలపర్చిన గుంటూరు పార్లమెంట్ సీపీఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్, గుంటూరు తూర్పు కాంగ్రెస్ అభ్యర్థి షేక్ మస్తాన్‌వలీని అఖండ మెజారిటీతో గెలిపించాల్సిందిగా కోరారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రత్యేక హోదా అంటూ అధికారం

- మిగతా 2 లో

శత్రువులతో చేతులు కలిపినోళ్లు

వైఎస్సార్ వారసులా?

- చిన్నాన్నను ఎవరు చంపించారో ప్రజలకు తెలుసు
- అవినాశ్ చాలా మంచోడు.. అందుకే ఎంపీ టికెట్
- పులివెందుల ప్రజల రుణం తీర్చుకుంటా
- సీఎం వైఎస్ జగన్

విశాలాంధ్ర–పులివెందుల: పులివెందుల అంటే నాకు ప్రాణానికి ప్రాణమని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల నేపథ్యంలో పులివెందుల అసెంబ్లీ నుంచి నామినేషన్ వేసేందుకు గురువారం ఆయన పట్టణానికి వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక సీఎస్ఐ చర్చి మైదానంలో

- మిగతా 2 లో

అట్టహాసంగా జగన్ నామినేషన్ 2లో

రాజంపేట సీపీఐ అభ్యర్థి బుక్కే విశ్వనాథ్ నామినేషన్

భారీ మెజారిటీతో గెలిపించాలని ఈశ్వరయ్య పిలుపు

విశాలాంధ్ర–రాజంపేట: ఇండియా కూటమి బలపరిచిన రాజంపేట అసెంబ్లీ సీపీఐ అభ్యర్థి బుక్కే విశ్వనాథ నాయక్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో బుక్కేతో పాటు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సహాయ కార్యదర్శి మహేష్ సీపీఎం జిల్లా నాయకులు సీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ ఇండియా కూటమి అధికారం చేపడితేనే దేశంలో రాజ్యాంగం రక్షించబడుతుందన్నారు. రాష్ట్రంలో విధ్వంసకర వైసీపీని, మతోన్మాదులతో చేతులు కలిపిన టీడీపీని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బీజేపీతో ఏం ఆశించి పొత్తుపెట్టుకున్నారో చంద్రబాబు చెప్పాలని నిలదీశారు. సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉన్న వ్యక్తిగా మతోన్మాద, మనువాద శక్తుల నుంచి భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, దేశాన్ని కాపాడుకొనే అంశంపై ఆయన వైఖరి ఏంటో

- మిగతా 2 లో

ప్రలోభాల పర్వం

- రూ.165.91 కోట్ల నగదు, మద్యం స్వాధీనం
- అనంతపురంలో అత్యధికంగా రూ.30.66 కోట్లు
- 24 గంటల్లోనే రూ.8.65 కోట్ల వస్తువుల సీజ్
- ముకేశ్ కుమార్ మీనా వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఎన్నికల షెడ్యూలు ప్రకటించినప్పటి నుంచి ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా రూ. 165.91 కోట్లకుపైగా నగదు, లిక్కర్, డ్రగ్స్, ప్రెషస్‌మెటల్స్, ఫ్రీ బీస్ (ఉచితాలు), ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్రంలో మే 13న జరుగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రలోభపర్చే వీటి అక్రమ రవాణాపై పటిష్టమైన నిఘా ఉంచామన్నారు. అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులతో పాటు రాష్ట్రంలోని వివిధ చెక్ పోస్టుల ద్వారా, పోలీస్, ఎక్సైజ్, ఇన్‌కంట్యాక్సు, అటవీ, ఈడీ, ఎస్సీబీ, ఆర్పీఎఫ్, కస్టమ్స్ తదితర 20కుపైగా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజన్సీలతో ఓటర్లను ప్రభావితం చేసే వస్తువుల అక్రమ రవాణాపై నిరంతరం నిఘా ఉంచామని

- మిగతా 2 లో

జగన్ ఇంటికి పోవడం ఖాయం

రాజంపేట సభలో చంద్రబాబు

వైసీపీని పాతాళానికి తొక్కేయాలి: పవన్

విశాలాంధ్ర–రాజంపేట: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వంపై తిరుగుబాటు మొదలైందని.. జగన్ ఇంటికి పోవడం ఖాయమని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. అన్నమయ్య జిల్లా రాజంపేటలో గురువారం నిర్వహించిన టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ... రాజంపేట ప్రజల జీవితాలు బాగుపడాలంటే మిథున్‌రెడ్డి ఓడిపోవాలన్నారు. వైసీపీకి ఓటు వేస్తే ఏం జరుగుతుందో ప్రజలంతా ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్డీఏ కూటమి రాజంపేట ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి అనుభవజ్ఞుడు, సమర్థవంత నాయకుడని, ఆయన ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి సమర్థ పాలన అందించారని తెలిపారు. కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు రాజంపేట అసెంబ్లీకి పోటీ చేస్తున్న మాజీ ఎంపీ పాలకొండ్రాయుడు

- మిగతా 2 లో

ఇదీ లోకం!



బాగుంది డియర్ నీ పని, ఇవాళ ఏ పార్టీలో చేరావు? వాళ్లెంతిచ్చారు.

కొత్త అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో

ఇండోనేసియా ఎన్నికల సంఘం ప్రకటన

జకార్తా: ఇండోనేసియా నూతన అధ్యక్షుడిగా ప్రబోవో సుబియాంతో ఎన్నికైనట్లు ఆ దేశ ఎన్నికల సంఘం ప్రకటించింది. ఆయన ఈ ఏడాది అక్టోబరులో బాధ్యతలు చేపట్టనున్నారు. సుబియాంతో ప్రస్తుతం ఇండొనేసియా రక్షణ మంత్రిగా ఉన్నారు. నిజానికి అధ్యక్షుడిగా ఆయన ఎన్నికను గత నెల 20నే ఎన్నికల సంఘం ప్రాథమికంగా ప్రకటించింది. అధ్యక్ష ఎన్నికల్లో ఆయనకు 58.6% ఓట్లు వచ్చినట్లు తెలిపింది. అయితే అధ్యక్ష పదవికి పోటీ పడిన మరో ఇద్దరు నేతలు- అనీస్ బస్వెదన్, గంజర్ ప్రనోవో ఆ ప్రకటనను ఆక్షేపించారు. ఎన్నికల్లో తీవ్రస్థాయి అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకుందని, సుబియాంతో ఎన్నికను న్యాయస్థానంలో సవాలు చేశారు. వారి పిటిషన్లను కోర్టు సోమవారం కొట్టివేయడంతో ప్రబోవో సుబియాంతో అడ్డంకులు తొలగిపోయాయి.

మోదీ, రాహుల్‌కు ఈడీ నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వాలని ఆదేశించింది. 'సాధారణంగా పార్టీలు తమ అభ్యర్థుల పట్ల బాధ్యత కలిగి ఉండాలి. వారి ఆదేశాలు లేకుండా ఎలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేయొద్దు. కానీ పార్టీల అధినేతలే ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నారు. ఉన్నత స్థాయిలో ఉన్నవారి ప్రసంగాలు ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. బీజేపీ, కాంగ్రెస్ నేతలు ఈసీ నిబంధనలు అతిక్రమించినందుకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత నడ్డా, ఖర్గేలపై ఉంది. తమ అభ్యర్థులు, ముఖ్యంగా స్టార్ క్యాంపెయినర్ల ప్రవర్తనకు రాజకీయ పార్టీలు ప్రాథమిక బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తుల ప్రచార ప్రసంగాలు మరింత తీవ్రమైన పరిణామాలను కలిగి ఉంటాయి' అని ఈసీ తన నోటీసులో పేర్కొంది. మతం, కులం, వర్గం, భాష ప్రాతిపదికన విద్వేషం, విభజన సృష్టిస్తున్నారని బీజేపీ, కాంగ్రెస్‌లు పరస్పరం ఆరోపించుకున్నాయి. ఇటీవల రాజస్థాన్‌లోని ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోదీ ప్రసంగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చొరబాటుదారులకు, ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారికి దేశ సంపదను పంచుతుందన్నారు. ఈ వ్యాఖ్యలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. ప్రధాని హిందువులు, ముస్లింలను విభజించాలని చూస్తోందని ఆరోపించింది. ప్రధాని వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని ఈసీని కాంగ్రెస్ కోరింది. మరోవైపు రాహుల్ గాంధీ తన ర్యాలీలలో అనుచిత భాష ఉపయోగించారని బీజేపీ ఎన్నికల కమిషన్‌కి ఫిర్యాదు చేసింది. రాహుల్ గాంధీ తమిళనాడులో భాషా ప్రాతిపదికన ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నించారని బీజేపీ ఆరోపించింది. దీంతో అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ పార్టీలకు ఈసీ నోటీసులు పంపింది. నోటీసుపై రెండు పార్టీలు ఇంకా స్పందించలేదు.

ఎన్నికల ప్రచారానికి సునీతాకేజ్రీవాల్

(మొదటిపేజీ తరువాయి)

తేదీన ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేసింది. ఆ క్రమంలో ఆయన తీహార్ జైల్లో ఉన్నారు. కేజ్రీవాల్ అరెస్ట్‌కు నిరసనగా ఇండియా కూటమి ర్యాలీల్లో సైతం సునీత పాల్గొంటున్నారు. కేజ్రీవాల్, హేమంత్ సోరెన్ అరెస్ట్‌కు నిరసనగా గత ఆదివారం.. జార్ఖండ్ రాజధాని రాంచీలో ఇండియా కూటమి ర్యాలీ నిర్వహించింది. ఈ ర్యాలీలో పాల్గొన్న సునీత...మోదీ ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో వెళ్తుందని ఆరోపించారు. కేజ్రీవాల్‌ను జైల్లోనే అంతమొందించేందుకు కుట్ర జరుగుతుందని సందేహం వ్యక్తం చేశారు. మే 7వ తేదీ వరకు అరవింద్ కేజ్రీవాల్‌కు కోర్టు జ్యుడిషియల్ రిమాండ్ విధించిన సంగతి తెలిసిందే.

ముగిసిన నామినేషన్ల ఘట్టం

(మొదటిపేజీ తరువాయి)

దాడిశెట్టి రాజా తదితరులు నామినేషన్లు వేశారు. ప్రతి అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గంలోనూ ప్రధాన పార్టీలతో పాటు అధిక శాతం స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు ఉన్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం ద్వారా నమోదయిన వివిధ పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. జై భారత్ నేషనల్ పార్టీ, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ సమాజ్‌వాది పార్టీ, రెఫార్మ్స్ పార్టీ ఆఫ్ ఇండియా, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా, భారతీయ రాష్ట్రీయ దళ్, ప్రజాప్రస్థానం పార్టీ, భారత చైతన్య యువజన కాంగ్రెస్ పార్టీ, దళిత్ బహుజన్ పార్టీ, జై భీమ్‌రావు భారత్ పార్టీ, తెలుగు నవరంగ్ పార్టీ, జాతీయ జనసేన పార్టీ, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఏ), నవరంగ్ కాంగ్రెస్ పార్టీ, తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ, ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి తదితర పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.

విశాఖ ఉక్కు జోలికి వెళ్లొద్దు

(మొదటిపేజీ తరువాయి)

అధ్యక్షుడు కేఏ పాల్, సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ తదితరులు దాఖలు చేసిన వ్యాజ్యాలపై హైకోర్టు గురువారం విచారణ చేపట్టింది. స్టీల్ ప్లాంట్‌కు చెందిన భూములు, యంత్రాలు, ఇతర ఆస్తులను విక్రయించబోమంటూ అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) నరసింహాశర్మ చెప్పిన వివరాలను కోర్టు నమోదు చేసుకుంది. కర్మాగారంలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన 100 శాతం పెట్టుబడులను మాత్రమే ఉపసంహరిస్తున్నామని ఏఎస్‌జీ కోర్టుకు తెలిపారు. కౌంటర్ వేసేందుకు సమయం కోరారు. తదుపరి విచారణను ఉన్నత న్యాయస్థానం జూన్ 19వ తేదీకి వాయిదా వేసింది.

ఫిలిప్పీన్స్‌లో డీప్‌ఫేక్ వీడియో కలకలం

చైనాపై దాడికి అధ్యక్షుడు ఆదేశించినట్లు ప్రచారం

మనీలా: సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధిచెందుతున్న కొద్దీ అంతేస్థాయిలో సరికొత్త చిక్కులు వెంటాడుతున్నాయి. ఇటీవల కాలంలో ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యంలోకి వచ్చిన కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ)ను కొందరు దుర్వినియోగం చేస్తున్నారు. తాజాగా చైనాపై దాడి చేయాలంటూ స్వయంగా ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఆదేశాలు జారీచేసినట్లున్న రూపొందించిన డీప్‌ఫేక్ వీడియో క్లిప్ ఫిలిప్పీన్స్‌లో కలకలం రేపుతోంది. దేశానికి చైనా నుంచి ఏదైనా ముప్పు పొంచి ఉంటే... తక్షణమే ప్రతిస్పందించాలని తన సైన్యానికి ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్ సూచనలు చేసినట్లు ఓ వీడియో క్లిప్ వైరల్ అవుతోంది. దేశానికి హాని జరగడాన్ని తాను సహించలేనని..హక్కుల్ని రక్షించుకునే విషయంలో రాజీ లేదని ఈ సందర్భంగా వ్యాఖ్యానించినట్లుంది. ఒక యూట్యూబ్ ఛానెల్‌లో ఈ క్లిప్ విడుదలైంది. దానిలో దక్షిణ చైనా సముద్రంలో మోహరించిన డ్రాగన్ నౌకలకు చెందిన దృశ్యాలు కనిపించాయి. ఈ వీడియో వెలుగులోకి రావడంతో ఫిలిప్పీన్స్ ప్రభుత్వం తక్షణమే స్పందించింది. ఇది నకిలీదని ప్రజలను హెచ్చరించింది. 'ప్రెసిడెంట్ ఫెర్డినాండ్ ఆర్. మార్కోస్ జూనియర్‌లాగా మాట్లాడిన వీడియో కంటెంట్ ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లో పోస్ట్ చేయడం ప్రెసిడెన్షియల్ కమ్యూనికేషన్స్ ఆఫీస్ దృష్టికి వచ్చింది.. ఆ ఆడియో డీప్‌ఫేక్.. ఫిలిప్పీన్స్‌లోని మన సాయుధ దళాలను ఒక నిర్దిష్ట దేశానికి వ్యతిరేకంగా చర్య తీసుకోవాలని అధ్యక్షుడు ఆదేశించినట్లుగా కనిపించేలా చేయడానికి ప్రయత్నిస్తుంది. అలాంటి ఆదేశం జారీచేయలేదు' అని ప్రకటనలో స్పష్టత ఇచ్చింది. అలాగే తప్పుడు సమాచార వ్యాప్తి కట్టడికి కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. దక్షిణ చైనా సముద్రం లో ఈ రెండు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ క్రమంలోనే ఈ వీడియో వెలుగులోకి రావడం తీవ్ర ఆందోళనకు దారితీసింది.

బ్లీచ్ తలకెక్కినట్లుంది...

ట్రంప్‌పై బైడెన్ వ్యంగ్యాస్త్రాలు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారం ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్(డెమొక్రటిక్ పార్టీ), డొనాల్డ్ ట్రంప్ (రిపబ్లికన్ పార్టీ) మధ్య పోటాపోటీగా సాగుతోంది. వీరిద్దరూ విధానపరమైన విమర్శలతో పాటు పరస్పరం వ్యక్తిగత విమర్శలు చేయడానికి కూడా వెనుకాడటంలేదు. తాజాగా ట్రంప్ జుట్టును ఉద్దేశించి బైడెన్ వ్యంగ్యంగా మాట్లాడారు. 'కరోనాతో పోరాడుతోన్న సమయంలో శరీరంలోకి బ్లీచ్ ఎక్కించుకోమని ట్రంప్ మీకు సలహా ఇచ్చేవారు. అయితే, అది కాస్తా మిస్ అయ్యి ఆయన జుట్టుకే చేరింది' అంటూ ఎద్దేవా చేశారు. కొద్దిరోజుల క్రితం కూడా బైడెన్ ఇదే విషయంపై మాట్లాడారు. 'మీరు బ్లీచ్ తీసుకోకండి. అలా తీసుకోమని చెప్పే వ్యక్తికి ఓటు వేయకండి' అని కోరారు. మరోపక్క స్లీపీ జో అంటూ బైడెన్‌ను ట్రంప్ విమర్శిస్తున్న సంగతి విదితమే. కాగా, కరోనాను ఎదుర్కోవడానికి క్రిమిసంహారక ఇంజెక్షన్ తీసుకోవాలని, అది ఊపిరితిత్తుల్ని శుభ్రం చేస్తుందని అప్పట్లో ట్రంప్ తరచూ వ్యాఖ్యలు చేశారు. అలాగే హైడ్రాక్సీ క్లోరోక్విన్‌ను గేమ్ ఛేంజర్ ఆయన అని చెప్పారు. నిరూపితం కానీ చికిత్సలను ప్రచారం చేశారు. అయితే, వీటికి వ్యతిరేకంగా వైద్యనిపుణులు తీవ్ర హెచ్చరికలు చేశారు కూడా.

వైఎస్సార్ వారసులా?

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన ప్రజలను ఉద్దేశించి ఉద్వేగభరితంగా మాట్లాడారు. దివంగత నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కీర్తి ప్రతిష్ఠలు దెబ్బ తీసేందుకు ప్రత్యర్థులు కుట్రలు పన్నుతున్నారన్నారు. చిన్నాన్న వివేకానందరెడ్డిని ఎవరు చంపించారో జిల్లా ప్రజలకు తెలుసునని...ఈ హత్యా నేరాన్ని అవినాశ్‌రెడ్డిపై వేసేందుకు తోడేళ్లన్నీ ఏకమయ్యాయన్నారు. కుట్రదారులతో చేతులు కలిపిన వాళ్లు వైఎస్సార్ వారసులా? పసుపు చీర కట్టి...శత్రువుల వద్ద మోకరిల్లిన వారు వైఎస్సార్ వారసులా అని జగన్ సూటిగా ప్రశ్నించారు. అవినాశ్ రెడ్డి జీవితాన్ని నాశనం చేసేందుకు ప్రత్యర్థులు కంకణం కట్టుకున్నారని మండిపడ్డారు. అవినాశ్ రెడ్డి చాలా మంచోడని, అందుకే కడప ఎంపీ టికెట్ ఇచ్చానని స్పష్టం చేశారు.
పులివెందుల ప్రాంతం అభివృద్ధిలో పరుగులు తీస్తుంటే పచ్చదొరలకు ఇవేమీ కనబడనట్లు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యంగా చంద్రబాబు, ఒక ఈనాడు, ఒక ఆంధ్రజ్యోతి, ఒక టీవీ5, దత్తపుత్రుడు, ఒక వదినమ్మ పనిగట్టుకుని తమ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. పులివెందుల కల్చర్, కడప కల్చర్, రాయలసీమ కల్చర్ అంటూ మనపై వేలెత్తి చూపిస్తున్నారని... పులివెందుల ఒక విజయగాథ అని చెప్పారు.
మంచి చేయడం, మాట తప్పకపోవడం మన కల్చర్ అన్నారు. టీడీపీ మాఫియా నాలుగు దశాబ్దాల దుర్మార్గాల్ని ఎదురించింది పులివెందుల బిడ్డలేనని చెప్పారు. కరువు ప్రాంతంగా ఉన్న పులివెందులకు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కృషి వల్ల కృష్ణానది నీళ్లు వస్తున్నాయని తెలిపారు. కరువు సీమలో అభివృద్ధికి కారణం వైఎస్సార్ అన్నారు. వైఎస్సార్, జగన్‌లపై లేనిపోని ముద్రలు వేసి దెబ్బతీయడానికి చంద్రబాబు, దత్తపుత్రుడు, వదినమ్మ ప్రయత్నిస్తున్నారని... ఈ మధ్య కాలంలో కొత్తగా వైఎస్సార్ వారసులమంటూ...వారి కుట్రలో భాగంగా ప్రజల మధ్యకు వస్తున్నారన్నారు. వైఎస్సార్ కుటుంబాన్ని టార్గెట్ చేసింది ఎవరు? నాన్నగారిపై కక్షతో, కుట్రతో ఆయనపై కేసులు పెట్టింది ఎవరు? ఆ కుట్రలు చేసిన పార్టీలో చేరిన వాళ్లు... వైఎస్సార్ వారసులా అని ప్రశ్నించారు. ఆ మహానేతకు వారసులు ఎవరో చెప్పాల్సింది ప్రజలే అన్నారు.
వైఎస్సార్ లెగసీని లేకుండా చేయాలని చూసింది ఎవరు? వైఎస్సార్ పేరును సీబీఐ ఛార్జిషీట్‌లో చేర్చింది ఎవరు? అంటూ ప్రశ్నించారు. మీ బిడ్డను ఎదుర్కోలేక... ఒక్కడి మీదకు ఇంతమంది ఏకమై వస్తున్నారు కానీ సంక్షేమం, అభివృద్ధిలో వైఎస్సార్ బాటలో మరో రెండు అడుగులు ముందుకు వేసింది మన ప్రభుత్వమే అన్నారు. వైఎస్సార్‌పై కుట్రలు చేసిన వాళ్లు ఇస్తున్న స్క్రిప్టులు చదువుతున్న వాళ్లు... వైఎస్సార్ వారసులా? అని మరోమారు ప్రశ్నించారు. అవినాశ్ ఏ తప్పు చేయలేదని నమ్మాను కాబట్టే... టికెట్ ఇచ్చానని తెలిపారు. వివేకాను చంపిన నిందితుడికి మద్దతిస్తుంది ఎవరు? వివేకాకు రెండో భార్య ఉన్నది వాస్తవం కాదా? అవినాశ్ రెడ్డి లేవనెత్తిన ప్రశ్నలు సహేతుకమే కదా అని జగన్ అన్నారు. వైఎస్ఆర్ పేరు కనపడకుండా ప్రయత్నిస్తున్న వారికి ఓటువేస్తే... మన ఓట్లు చీలిస్తే వచ్చే లాభం బాబుకు, బీజేపీ కూటమికి కాదా అంటూ జగన్ ప్రశ్నించారు. కడప గడ్డమీద ఎవరికి ప్రేమ ఉందనేది మీరంతా గమనించాలి... వైఎస్ఆర్ పేరు చిరస్థాయిగా నిలిచిపోవాలని ఆరాటపడుతున్నదెవరో ఆలోచన చెయ్యండి... వైఎస్ఆర్ పేరు లేకుండా చేయాలని కుట్రలు చేస్తున్నది ఎవరో గమనించండని కోరారు.
రాబోవు ఎన్నికల్లో కుట్రదారులకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తనకు ముఖ్యమంత్రి పదవి ఇచ్చింది తాను, తన కుటుంబ సభ్యులు కోట్లు సంపాదించుకోవడానికి కాదని, పేదలను ఆదుకోవడానికని జగన్ చెప్పారు.

28 నుంచి జగన్ ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ అధినేత, సీఎం జగన్ ఈనెల 28వ తేదీ నుంచి మరో విడత ఎన్నికల ప్రచారానికి సిద్ధమయ్యారు. తాడిపత్రి నుంచి సీఎం ప్రచార సభలు ప్రారంభం కానున్నాయి. 15 రోజుల్లో 45 నియోజకవర్గాలు లక్ష్యంగా సీఎం ప్రచారానికి షెడ్యూలు రూపొందిస్తున్నారు. ప్రతిరోజూ ఆంధ్రా, కోస్తాంధ్ర, రాయలసీమలో మూడు సభలు నిర్వహిస్తారు. 28న తాడిపత్రి, వెంకటగిరి, కందుకూరులోను, 29న చోడవరం, పి.గన్నవరం, పొన్నూరులో సభలకు సీం హాజరవుతారు. 30న కొండెపి, మైదుకూరు, పీలేరులో జగన్ ప్రచారం చేయనున్నారు. మే 1న బొబ్బిలి, పాయకారావుపేట, ఏలూరులో జరిగే సభల్లో పాల్గొంటారు. ఇప్పటికే సిద్ధం పేరుతో నాలుగు ప్రాంతాల్లో సభలు నిర్వహించారు. అనంతరం మేమంతా సిద్ధం పేరుతో 22 రోజులపాటు 86 నియోజకవర్గాల్లో బస్సుయాత్ర చేపట్టారు. ఈనెల 24వ తేదీతో బస్సుయాత్ర ముగిసింది. అనంతరం గురువారం పులివెందులలో నామినేషన్ వేశారు.

జగన్ ఇంటికి పోవడం ఖాయం

(మొదటిపేజీ తరువాయి)

తనయుడు సుగవాసి బాలసుబ్రమణ్యంను అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాజంపేట వాసులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఆకేపాటి అమర్నాథ్ రెడ్డిలను డిపాజిట్లు కూడా రాకుండా చిత్తుగా ఓడించాలన్నారు. రాజంపేట వాసులు జీర్ణించుకోలేని అంశం జిల్లా కేంద్రం, వైద్య కళాశాలలు తరలిపోవడమేనని... ఇందుకు పెద్దిరెడ్డి కుటుంబమే ముఖ్య కారణమని ఆరోపించారు. ఇసుక దోపిడీ కారణంగా అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి సుమారు 40 మంది మృత్యు వాత పడితే వైసీపీ ప్రభుత్వం నేటికీ వారిని ఆదుకున్న పాపాన పోలేదన్నారు. వరదలు సంభవించిన వెంటనే మొట్టమొదటగా తెలుగుదేశం, జనసేన పార్టీలు స్పందించాయని...ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా బాధితులకు తెలుగుదేశం పార్టీ అండగా నిలిచిందని గుర్తు చేశారు. తాము అధికారంలోకి వస్తే పింఛ, అన్నమయ్య డ్యాములు పునర్నిర్మించి మాచుపల్లి బ్రిడ్జి నిర్మిస్తామని, గాలేరు నగరి కాలువ పూర్తి చేసి కృష్ణ జలాలు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఒంటిమిట్ట కోదండ రామాలయాన్ని టీటీడీకి అనుసంధానించి అన్ని విధాల అభివృద్ధి చేసింది తెలుగుదేశం ప్రభుత్వమేనని గుర్తు చేశారు. నందలూరు ఆల్విన్ ఫ్యాక్టరీ తో పాటు పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. రాజంపేటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్రంలో సంక్షేమం తీసుకొస్తామని తెలిపారు. పేదలకు రెండు..మూడు సెంట్లు ఇంటి జాగా ఇచ్చి, ఇళ్లు కట్టించి ఇస్తామన్నారు. ఏప్రిల్ నుంచే పింఛను రూ.4వేలు ఇంటి వద్దే ఇస్తామని చెప్పారు. 3 నెలల బకాయిలు జులైలో ఇస్తామన్నారు. ఐదేళ్లలో యువతకు 20లక్షల ఉద్యోగాలు ఇస్తామని, ఉద్యోగం వచ్చే వరకు రూ.3వేల నిరుద్యోగ భృతి చెల్లిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు.

వైసీపీని పాతాళానికి తొక్కేయాలి: పవన్

జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాట్లాడుతూ సైకో వైసీపీ ప్రభుత్వాన్ని పాతాళానికి తొక్కేయాలని పిలుపునిచ్చారు. జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో రౌడీయిజం, ఫ్యాక్షనిజం తీసుకొచ్చారని... ఇసుక టిప్పర్లపై వారి పేరు ఉంటే ఏ అధికారి ఆపడానికి వీలు లేకుండా దౌర్జన్య పాలన సాగించారని ఆరోపించారు. హెరిటేజ్ ను దెబ్బ కొట్టి అమూల్ ను తీసుకొచ్చారని, శ్రీజ డైరీ ని సమూలంగా నాశనం చేశారన్నారు. అమర్ రాజా ఫ్యాక్టరీని తరిమేశారని, సైకో జగన్ రెడ్డి పాలనలో ఆడబిడ్డలకు రక్షణ కరువైందని ధ్వజమెత్తారు. ఇసుక దోచుకోవడం కోసం ముందస్తు హెచ్చరికలను బేఖాతరు చేసి అన్నమయ్య డ్యామ్ కొట్టుకు పోవడానికి స్థానిక నేతలు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఆకేపాటి అమర్నాథ్ రెడ్డిలే కారణమని ఆరోపించారు. లస్కర్ గా విధులు నిర్వహిస్తున్న రామయ్య ప్రాణాలు తెగించి ప్రజలను అప్రమత్తం చేయడం వలన కొంత ప్రాణ నష్టం తప్పిందని, లస్కర్ రామయ్యకు జనసేన పార్టీ రూ.2 లక్షలు ఆర్థిక సాయం చేసి సత్కరించిందని గుర్తు చేశారు. యువత, ప్రజలు ధైర్యంగా ముందుకు వచ్చి ఓటు ఆయుధంతో వైసీపీ నాయకులను తరిమికొట్టాలని...ప్రజల ప్రాణాలకు తన ప్రాణాలు అడ్డువేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటు అధ్యక్షులు చమ్మర్తి జగన్మోహన్ రాజు, నియోజకవర్గ నేత పోలి సుబ్బారెడ్డి, బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అట్టహాసంగా జగన్ నామినేషన్

విశాలాంధ్ర-పులివెందుల: వైయస్సార్ జిల్లా పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గానికి వైసీపీ అభ్యర్థిగా సీఎం జగన్ గురువారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ఆయన నామినేషన్ పత్రాలను స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఎన్నికల అధికారి వెంకటేషులుకు సమర్పించారు. అంతకు ముందు ఆయన సర్వమత ప్రార్థనలు చేశారు. జగన్ వెంట కడప లోక్‌సభ అభ్యర్థి వైఎస్ అవినాశ్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గోటూరు చిన్నప్ప, వైసీపీ మున్సిపల్ ఇన్‌ఛార్జి మనోహర్ రెడ్డి ఉన్నారు.

బుక్కే విశ్వనాథ్ నామినేషన్

(మొదటిపేజీ తరువాయి)

చెప్పాలన్నారు. మరోవైపు ఈ ఐదేళ్ల పాటు రాష్ట్రంలో బటన్ నొక్కడం తప్ప ఎటువంటి అభివృద్ధి గానీ, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం గానీ చేయని సీఎం వైఎస్ జగన్ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం, రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకురావడంలో, మహిళలకు రక్షణ కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం దారుణంగా విఫలమైందన్నారు. ఐదేళ్లలో రాష్ట్రానికి ఏమి చేయకపోగా మరలా ఒకసారి అధికారం ఇవ్వాలని ఏవిధంగా అడుగుతున్నారని ఈశ్వరయ్య ధ్వజమెత్తారు. రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గంలో ఇండియా కూటమి అభ్యర్థిగా సీపీఐ నుంచి పోటీచేస్తున్న బుక్కే విశ్వనాథనాయక్‌ను కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సీపీఐ పేదల పక్షాన పోరాడే పార్టీ అని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండే విశ్వనాథనాయక్‌ను గెలిపించుకోవడం ద్వారా ఈ ప్రాంత ప్రజల సమస్యలపై అసెంబ్లీలో లేవనెత్తి పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు.

ప్రలోభాల పర్వం

(మొదటిపేజీ తరువాయి)

వివరించారు. కేవలం 24 గంటల్లోనే రూ.8.65 కోట్ల విలువైన అక్రమ రవాణాకు పాల్పడుతున్న వివిధ రకాల వస్తువులను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఇప్పటివరకు అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గంలో రూ.30.66 కోట్లు అత్యధిక మొత్తంలో ను, అత్యల్పంగా రూ.1.15 కోట్లు నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గంలో స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మొత్తం సొమ్ములో రూ.36.89 కోట్లు నగదు, రూ.20.32 కోట్ల విలువైన 6,62,402.65 లీటర్ల లిక్కరు, రూ.2.78 కోట్ల విలువైన 52,28,218.94 గ్రాముల డ్రగ్స్, రూ.91.26కోట్ల విలువైన 14,73,734.46 గ్రాముల ప్రెషస్ మెటల్, రూ.2.90 కోట్ల విలువైన 4,88,557 ఫ్రీ బీస్, రూ.11.74 కోట్ల విలువైన 11,27,451.07 ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. తిరుపతి (ఎస్సీ)లో రూ.19.37 కోట్లు, కాకినాడలో రూ.18.18 కోట్లు, ఏలూరులో రూ.13.77 కోట్లు, విశాఖపట్నంలో రూ.12.50 కోట్లు, రాజంపేటలో రూ.6.96 కోట్లు, విజయవాడలో రూ.6.75 కోట్లు, నంద్యాలలో రూ.5.63 కోట్లు, కడపలో రూ.5.62 కోట్లు, నర్సరావుపేటలో రూ.4.61 కోట్లు, విజయనగరంలో రూ.4.18 కోట్లు, బాపట్ల (ఎస్సీ)లో రూ.3.99 కోట్లు, అనకాపల్లిలో రూ.3.72 కోట్లు, రాజమండ్రిలో రూ.3.62 కోట్లు, శ్రీకాకుళంలో రూ.3.61 కోట్లు, అరకు (ఎస్టీ)లో రూ.3.37 కోట్లు, నెల్లూరులో రూ.3.00 కోట్లు, మచిలీపట్నంలో రూ.2.87 కోట్లు, గుంటూరులో రూ.2.75 కోట్లు, కర్నూలులో రూ.2.45 కోట్లు, చిత్తూరు (ఎస్సీ)లో రూ.1.94 కోట్లు, ఒంగోలులో రూ.1.93 కోట్లు, హిందూపురంలో రూ.1.63 కోట్లు, అమలాపురం (ఎస్సీ)లో రూ.1.52, నర్సాపురం పార్లమెంట్ పరిధిలో రూ.1.15 కోట్ల విలువైన అక్రమ ఆస్తులను స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

బీజేపీకి హోదా తాకట్టు

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టిన తరువాత హోదా ఊసే చంద్రబాబు, జగన్‌లకు పట్టలేదని మండిపడ్డారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెచ్చి ఉంటే రాష్ట్రంలో అభివృద్ధి జరిగి ఉండేదని, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వచ్చి ఉండేవని అన్నారు. రాష్ట్రంలో ట్రయాంగిల్ లవ్ స్టోరీ నడుస్తోందని... మోదీతో పొత్తుగా ఒకరు, తొత్తుగా మరొకరు ఉన్నారని ఎద్దేవా చేశారు. మోదీ ప్రత్యేక హోదా ఇచ్చారా? పోలవరం పూర్తి చేశారా? రాజధానిని నిర్మించారా మరి ఎందుకు వీరు గులాంగిరి చేస్తున్నారని నిలదీశారు. రాజధాని విషయంలో చంద్రబాబు సింగపూర్ అంటూ త్రీడి సినిమా చూపించారని, ఇక జగన్ మూడు రాజధానులంటూ ఒక్కదానికే దిక్కు లేకుండా చేశారని విమర్శించారు. ఉన్నత చదువులు చదువుకున్న యువత నేడు కేవలం రూ.10 వేలకు చిన్న ఉద్యోగాలు చేస్తున్నారని, ఇతర రాష్ట్రాలకు వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ ప్రతి సంక్రాంతికి జాబ్ క్యాలెండర్ ఇస్తానన్నారని, ఐదు సంక్రాంతులు వెళ్లినా ఒక్క క్యాలెండర్ ఇవ్వలేదన్నారు. ఎన్నికల ముందు కేవలం 6 వేల ఉద్యోగాలతో దగా డీఎస్సీ ఇచ్చారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఇసుక, డ్రగ్స్, ల్యాండ్, మద్యం మాఫియా రాజ్యమేలుతోందని షర్మిల ధ్వజమెత్తారు. అవినాశ్‌రెడ్డి భవిష్యత్తును తాము నాశనం చేస్తున్నామంటూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తమపై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. వివేకానంద రెడ్డి కేసులో అవినాశ్ అమాయకుడని నమ్ముతున్నానని అందుకే ఎంపీ టికెట్ ఇచ్చానని చెప్పిన జగన్... సీబీఐ సాక్ష్యాలు చూపుతున్నా ఎందుకు నమ్మడం లేదని ప్రశ్నించారు. అన్ని తెలిసికూడా అవినాశ్‌ను కాపాడాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. వీటన్నింటికి జగన్‌మోహన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రతి ఓటరు రాష్ట్ర భవిష్యత్తు, తమ బిడ్డల భవిష్యత్తును ఆలోచించి ఓటు వేయాలని కోరారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ అప్పు రూ.208 లక్షల కోట్లకు చేరిందని ఆందోళన వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను రెట్టింపు చేసి ప్రజలపై భారాలు మోపారని మండిపడ్డారు. రైతులను నట్టేటముంచారన్నారు. దేశంలో మోదీతో పాటు రాష్ట్రంలో మోదీ తొత్తులను ఓడించాలని కోరారు. సీపీఐ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ మరోసారి మోదీ అధికారంలోకి వస్తే దేశ లౌకిక, ప్రజాస్వామ్య వ్యవస్థ, అంబేద్కర్ రాజ్యాంగం ప్రమాదంలో పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, గుంటూరు తూర్పు కాంగ్రెస్ అభ్యర్థి షేక్ మస్తాన్‌వలి, లింగంశెట్టి ఈశ్వరరావు మాట్లాడారు. ఇండియా కూటమి అభ్యర్థులు డాక్టర్ జాన్‌బాబు, కుశిల్ రాజు, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి పాల్గొన్నారు.

రెండో విడతకు రంగం సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

పోలింగ్ జరగనుంది. ఈ విడతలో వాస్తవానికి 89 స్థానాలకు పోలింగ్ నిర్వహించాలని తొలుత భావించారు. అయితే మధ్యప్రదేశ్‌లోని బేతుల్ స్థానం నుంచి బరిలోకి దిగిన బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అభ్యర్థి అశోక్ భలవి ఏప్రిల్ 9న మరణించారు. దీంతో అక్కడ జరగాల్సిన ఎన్నికను కేంద్ర ఎన్నికల సంఘం మూడో దశకు (మే 7వ తేదీకి) వాయిదా వేసింది. ఎలక్షన్ కమిషన్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం లోక్‌సభ ఎన్నికలు ఏడు దశల్లో (ఏప్రిల్ 19 నుంచి జూన్ 1 వరకు) జరగనుండగా... జూన్ 4న లెక్కింపు జరుగుతుంది. శుక్రవారం జరగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, శశి థరూర్, కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సోదరుడు డీకే సురేష్, రాజకీయవేత్తగా మారిన నటుడు అరుణ్ గోవిల్, కర్నాటక మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి (జేడీఎస్), కేంద్ర మంత్రులు రాజీవ్ చంద్రశేఖర్, గజేంద్ర సింగ్ షెకావత్, బెంగాల్ బీజేపీ అధ్యక్షుడు సుకాంత మజుందార్, చత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ ప్రధాన అభ్యర్థులుగా ఉన్నారు. కాగా బీజేపీకి చెందిన హేమమాలిని , లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, గజేంద్ర సింగ్ షెకావత్ తమ తమ నియోజకవర్గాల నుండి హ్యాట్రిక్ విజయాలను కోరుకుంటున్నారు. రాష్ట్రాల వారీగా 88స్థానాలకు సంబంధించి కర్నాటకలోని 28 సీట్లలో 14 సీట్లు, రాజస్థాన్-13, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లో ఎనిమిది సీట్ల చొప్పున, మధ్యప్రదేశ్‌లో ఏడు, అసోం, బీహార్‌లో 5 సీట్ల చొప్పున, చత్తీసగఢ్, పశ్చిమబెంగాల్‌లో 3 సీట్లు చొప్పున, కేరళలోని మొత్తం 20 సీట్లకు, మణిపూర్, త్రిపుర, జమ్మూ కశ్మీర్‌లలో ఒక్కో సీటు చొప్పున ఎన్నికలు జరగనున్నాయి. ఔటర్ మణిపూర్ నియోజకవర్గం నుండి నలుగురు అభ్యర్థులతో సహా మొత్తం 1206 మంది అభ్యర్థులు రెండోదశ ఎన్నికల బరిలో నిలిచారు. ఈ స్థానాల్లో బుధవారం సాయంత్రంతో ప్రచార గడువు ముగిసింది. 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో 102 స్థానాలకు గాను గత శుక్రవారం జరిగిన మొదటి దశ ఎన్నికల్లో 65.5 శాతం ఓటింగ్ నమోదైన సంగతి తెలిసిందే. కాగా శుక్రవారం జరిగే పోలింగ్‌తో కేరళ, రాజస్థాన్, త్రిపురలలో లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ముగియనుంది. ఏప్రిల్ 19న మొదటి దశలో తమిళనాడులోని మొత్తం 39 స్థానాలతో పాటు ఉత్తరాఖండ్ (5), అరుణాచల్ ప్రదేశ్ (2), మేఘాలయ (2), అండమాన్ నికోబార్ దీవులు, మిజోరం, నాగాలాండ్, పుదుచ్చేరి, సిక్కిం, లక్షద్వీప్‌లో ఒక్కొక్క స్థానం చొప్పున ఆరు స్థానాల్లో పోలింగ్ పూర్తయింది. కాగా రెండో దశ 89స్థానాల్లో 2019లో ఎన్డీఏ-56, యూపీఏ 24 స్థానాలను గెలుచుకున్నాయి. వీటిలో ఆరు స్థానాలను నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలో భాగంగా పునర్నిర్మాణం గావించారు. కేరళలోని 20స్థానాలకు ఒకేసారి పోలింగ్ జరగనుండగా... 2,77,49,159 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వారిలో ఐదు లక్షల మందికి పైగా తొలిసారిగా ఓటు వేయనున్నారు. వయనాడ్‌లో అనీరాజా (సీపీఐ), రాహుల్ గాంధీ (కాంగ్రెస్), కే సురేంద్రన్ (బీజేపీ) మధ్య ఆసక్తికర పోరు జరగనుంది. ఇక తిరువనంతపురం సీటును నాలుగోసారి కైవసం చేసుకోవాలని శశిథరూర్ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ స్థానంలో ఆయన సీపీఐ అభ్యర్థి పన్నియన్ రవీంద్రన్, బీజేపీ అభ్యర్థి చంద్రశేఖరన్‌ను ఎదుర్కొంటున్నారు. ఇక 2014 నుంచి మథుర నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న హేమమాలినిపై ముఖేష్ ధన్‌గర్ (కాంగ్రెస్), కోటా నుంచి రెండుసార్లు ఎంపీగా ఎన్నికైన స్పీకర్ ఓం బిర్లాపై ప్రహ్లాద్ గుంజాల్ (కాంగ్రెస్) జోధ్‌పూర్‌లో కేంద్రమంత్రి షెకావత్‌పై కరణ్ సింగ్ (కాంగ్రెస్), బెంగళూరు సౌత్ స్థానంలో ప్రస్తుత ఎంపీ, భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) జాతీయ అధ్యక్షుడు తేజస్వి సూర్యపై సౌమ్యారెడ్డి (కాంగ్రెస్) పోటీపడుతున్నారు. ఇక చత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత భూపేశ్ బఘెల్ గత 30 ఏళ్లుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న రాజ్‌నంద్‌గావ్ నుంచి పోటీ చేస్తున్నారు. రామాయణం సీరియల్ రాముడి పాత్రను పోషించడం ద్వారా ప్రసిద్ధి చెందిన అరుణ్ గోవిల్ మీరట్‌లో తొలిసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఈ స్థానంలో సునీత్ వర్మ(ఎస్పీ), దేవవ్రత్ కుమార్ త్యాగి (బీఎస్పీ)ని ఎదుర్కొంటున్నారు. ఇక 2014 తర్వాత ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తిరిగి లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచారు. ఈయన కేరళలోని అలప్పుజ నుంచి పోటీ చేస్తున్నారు. 2019 ఎన్నికల్లో కేరళలో సీపీఐ(ఎం) నేతృత్వంలోని లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) 20 స్థానాలకు 19 స్థానాల్లో విజయభేరి మోగించింది. ఇక వేణుగోపాల్ 1996, 2001 మరియు 2006లో వరుసగా మూడుసార్లు అలప్పుజ అసెంబ్లీ స్థానం నుంచి ఎన్నికయ్యారు. 2009, 2014లో అలప్పుజ నుండి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2019లో పార్టీ ఆయనను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమించడంతో ఆయన పోటీ చేయలేదు.

బీజేపీతో జతకట్టిన పార్టీలు ఇంటికే

ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-మంగళగిరి: సార్వత్రిక ఎన్నికల్లో 'ఇండియా' కూటమి విజయం ఖాయమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. గురువారం మంగళగిరి సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల పక్షాన పోరాడే ఎర్రజెండా పార్టీలను గెలిపించుకొని చట్ట సభలకు పంపించాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. బీజేపీ మోసపూరిత ప్రకటనల బండారం తొలి దశ పోలింగ్‌లోనే తేలిపోయిందన్నారు. దేశంలో 370 నుంచి 400 స్థానాలు ఎన్‌డీఏ కూటమి గెలుస్తుందనేది కేవలం ఒక కల మాత్రమేనని, ఆంధ్ర ప్రదేశ్‌కు పట్టిన దుర్గతికి ప్రధానంగా వైసీపీ, టీడీపీ, జనసేన కూటమి ప్రత్యక్షంగా, పరోక్షంగా బీజేపీకి లొంగిపోవడమే కారణమని తెలిపారు. ఓట్లు లేని బీజేపీకి 6 పార్లమెంట్ సీట్లు, 10 అసెంబ్లీ సీట్లు ఇవ్వడం దురదృష్టకరమని, జగన్‌మోహన్ రెడ్డి మరల గెలిస్తే చంద్రబాబు, పవన్ కల్యాణ్ నాయకత్వ వైఫల్యం తప్ప ప్రజా వైఫల్యం కాదని స్పష్టం చేశారు. విశాఖ స్టీల్ అమ్ముతుంటే దానికి సానుకూలంగా రహస్యంగా బీజేపీతో సీఎం జగన్ ఒప్పందం చేసుకున్నారని విమర్శించారు. దేశంలో బీజేపీకి ఎదురుగాలి వీస్తుండటంతో ప్రధాని మోదీ నిరంకుశంగా వ్యవహరిస్తూ ప్రజలను మతాలు, ప్రాంతాలవారీగా చీల్చి ప్రయోజనం పొందాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అయితే 'ఇండియా' కూటమి అభ్యర్థులు విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీతో జతకట్టడం దురదృష్టకరమన్నారు. ఓట్లు చీలకూడదని అంటే బీజేపీతో కలవటమా అని ముప్పాళ్ల ప్రశ్నించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టే బిల్లులను బలపరుస్తున్న వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజలపై భారాలు మోపుతోందని విమర్శించారు. ప్రజల కోసం పనిచేసే కమ్యూనిస్టు పార్టీలు ఓట్లు చీలకుండా ఐక్యంగా 'ఇండియా' కూటమికి వేస్తారన్నారు. వైసీపీ ప్రభుత్వం 99 శాతం మేనిఫెస్టోలో ఉన్న వాటిని పరిష్కరించిందని జగన్ చెబుతున్నారని, ఏమి పరిష్కరించారని ముప్పాళ్ల ప్రశ్నించారు. అమరావతి రాజధాని నిర్వీర్యం చేయటం, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయలేకపోవటం, అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయకపోవడం, సీపీఎస్ రద్దు తదితర ఏ హామీని నెరవేర్చారని నిలదీశారు. ప్రభుత్వం ఏర్పాటయిన వెంటనే మద్య నిషేధం చేస్తామని చెప్పి చేయలేదని ధ్వజమెత్తారు. మంగళగిరి అసెంబ్లీకి సీపీఎం తరపున పోటీ చేస్తున్న జొన్నా శివశంకర్‌ను, గుంటూరు పార్లమెంట్‌కు సీపీఐ తరపున పోటీ చేస్తున్న జంగాల అజయ్ కుమార్‌ను గెలిపించాలని, వామపక్ష పార్టీ అభ్యర్థులు లేని చోట్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను బలపరచాలని ప్రజలకు ముప్పాళ్ల విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని వినతి

విశాలాంధ్ర-విజయవాడ: అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్‌కు వేసవి సెలవులు ఇవ్వాలని ఏఐటీయూసీ, సీఐటీయూ యూనియన్‌ల నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం ప్రిన్సిపల్ సెక్రటరీని వారి కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం నాయకులు మీడియాతో మాట్లాడుతూ ఇటీవల అంగన్‌వాడీల సమ్మె సందర్భంగా ప్రభుత్వం అంగీకరించిన అంశాలకు జీవోలు ఇవ్వాలని, బయోమెట్రిక్,అన్ని యాప్‌లు కలిపి ఒకే సింగల్ యాప్‌గా చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరినట్లు చెప్పారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఏమి చేయలేమని ఎన్నికల అనంతరం అన్ని అమలు చేస్తామని ప్రిన్సిపల్ సెక్రటరీ హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.సుబ్బారావమ్మ, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, ఉపప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు యు. ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

చంద్రబాబుతో కేంద్ర మంత్రి పీయూష్ భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబుతో ఉండవల్లిలోని ఆయన నివాసంలో బీజేపీ జాతీయ నేతలు గురువారం భేటీ అయ్యారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తోపాటు అరుణ్‌సింగ్, మధుకర్, శివప్రకాశ్ తదితరులు ఎన్నికల్లో ప్రచారంపై వ్యూహరచన, కూటమి పార్టీల మధ్య సమన్వయం తదితర అంశాలపై చంద్రబాబుతో చర్చించారు. ఇప్పటికే కూటమి తరపున మోదీతో ఒక బహిరంగ సభను నిర్వహించారు. ఈ తరహా రాష్ట్రంలో మూడు ప్రాంతాల్లో సభల నిర్వహణకు ప్రణాళిక రూపొందిస్తున్నారు.

'ఏపీని వెనక్కి నెట్టిన వైసీపీ'

ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను వెనక్కి తీసుకెళ్లిందని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ విమర్శించారు. భేటీ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మద్యం, ఇసుక మాఫియాతో రాష్ట్రాన్ని దోచుకున్నారన్నారు. కేంద్ర నిధులను వృథా చేశారని ఆరోపించారు. రాష్ట్రాభివృద్ధికి చాలా సహజ వనరులున్నాయని, వైసీపీ ప్రభుత్వం వాటిని పెడచెవిన పెట్టిందన్నారు. రూ.వేల కోట్ల కేంద్ర నిధులను దారిమళ్లించారని చెప్పారు. పంచాయతీలకు కేటాయించిన నిధులను దుర్వినియోగం చేసిందని అన్నారు. గ్రామాలను అభివృద్ధి చేయకుండా జగన్ తన సొంత అవసరాలకు డబ్బులు వాడారని మండిపడ్డారు. తాము ముస్లిం రిజర్వేషన్లకు వ్యతిరేకమని ఆయన చెప్పారు.

'ఉపాధి' కూలీలకు రూ.200 వేసవి అలవెన్సు ఇవ్వాలి

– సీహెచ్ కోటేశ్వరరావు డిమాండ్

విశాలాంధ్ర-మైలవరం: భగ భగ మండుతున్న ఎండల నడుమ శ్రమిస్తున్న గ్రామీణ నిరుపేదలైన 'ఉపాధి' కూలీలకు వేసవి అలవెన్సు కింద రూ.200 అదనంగా ఇచ్చి వారిని ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ కోటేశ్వరరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న పోరాటనగర్, వెలగలగూడెం, తాడిగూడెం తదితర ప్రదేశాల్లో పర్యటించి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో ఉదయం ఆరు గంటల నుంచే ఎండ వేడిమి అత్యధికంగా నమోదవుతున్నందున ప్రజలు అత్యంత జాగ్రత్తలు పాటించాలని, అత్యవసర పనులు ఉంటే మినహా ఇళ్లల్లో నుంచి బయటకు రావడం మంచిది కాదని విపత్తుల శాఖ హెచ్చరికలు చేస్తోందని, అయితే పొట్టకూటి కోసం ఉపాధి పనులు చేస్తున్న పేదలకు ఇది అనివార్య పరిస్థితి అని తెలిపారు. ఇందుకు తగిన కూలి రోజుకు కనీసం రూ.600 గిట్టుబాటు అయ్యేలా చూడవలసిన బాధ్యత పాలకులపై ఉందని, ఇది పేదలకు రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కు అని కోటేశ్వరరావు పేర్కొన్నారు. జాబ్ కార్డులో పేరున్న ప్రతిఒక్కరికి సంవత్సరానికి 200 రోజుల పనిదినాలు, నేడున్న నిత్యావసర సరకుల ధరలకు అనుగుణంగా రోజుకు రూ.600 కూలి ఇచ్చేలా చర్యలు చేపడితేనే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం లక్ష్యం నెరవేరుతుందని స్పష్టం చేశారు. ఉపాధి కూలీలకు పనిముట్లు, ఫస్ట్ ఎయిడ్, మజ్జిగ, నిమ్మరసం, మంచినీరు, ఎండకు సేద తీర్చుకొనేందుకు గుడారాలు వసతులు కల్పించకపోవడం దారుణమని విమర్శించారు. రెండు సార్లు ఫొటోలు తీయటం, హాజరువేసే పద్ధతి మానుకోవాలని, ఒక్కసారే హాజరు, ఫొటో తీసే విధానాన్ని అమలు చేయాలని కోటేశ్వరరావు డిమాండ్ చేశారు.

న్యాయం, ధర్మం, నిజం వైపు నిలబడు

నిందితుడిపై నిమ్మకు నీరెత్తినట్టు ఉండడం తగునా?

వివేకా హత్యోదంతంపై జగన్‌కు చిన్నమ్మ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వివేకానందరెడ్డి హత్యకు కారకులైన వారిపై నీవు నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం ఏంటి... హత్యకు కారణమైన వాళ్లకు నువ్వు రక్షణగా ఉండటం తగదంటూ సీఎం వైఎస్ జగన్‌కు ఆయన చిన్నమ్మ సౌభాగ్యమ్మ (దివంగత వివేకానందరెడ్డి సతీమణి) గురువారం ఓ బహిరంగ లేఖ రాశారు. 2009లో నువ్వు మీ తండ్రిని కోల్పోయినప్పుడు ఎంత మనోవేదన అనుభవించావో, 2019లో నీ చెల్లి సునీత కూడా అంతే మనోవేదన అనుభవించిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన పరిణామాలు మమ్మల్ని ఎక్కువగా బాధపెట్టాయని, మన కుటుంబంలోని వారే హత్యకు కారణం కావడం మరింత బాధించాయని పేర్కొన్నారు. నిన్ను సీఎంగా చూడాలని ఎంతో తపించిన చిన్నాన్నను ఈవిధంగా నీ పత్రిక, నీ టీవీ చానల్, నీ సోషల్ మీడియా, నీ పార్టీ వర్గాలు తీవ్రంగా మాట్లాడటం, చెప్పలేనంత హననం చేయించడం నీకు తగునా అని ప్రశ్నించారు. న్యాయం కోసం పోరాటం చేస్తున్న నీ చెల్లెళ్లను హేళన చేస్తూ, నిందలు మోపుతూ, దాడులకు కూడా తెగబడే స్థాయికి కొంతమంది దిగజారుతుంటే, నీకు మాత్రం పట్టడం లేదా అని నిలదీశారు.

సునీతకు మద్దతుగా నిలిచి పోరాటం చేస్తున్న షర్మిలనూ టార్గెట్ చేస్తుంటే, నీవు నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం ఏమిటి? కుటుంబ సభ్యునిగా కాకపోయినా రాష్ట్ర ముఖ్యమంత్రిగా అయినా ఇదేనా నీ కర్తవ్యమని నిలదీశారు. హత్యకు కారకులైన వారికి మరలా ఎంపీగా అవకాశాన్ని నీవు కల్పించడం సమంజసమా, ఇలాంటి దుశ్చర్యలు నీకు ఏ మాత్రం మంచిది కాదని విన్నవించుకుంటున్నానని తెలిపారు. హత్యకు కారకుడైన నిందితుడు నామినేషన్ దాఖలు చేసినందున చివరి ప్రయత్నంగా, న్యాయం, ధర్మం ఆలోచన చేయమని ప్రార్థిస్తున్నానని కోరారు. రాగద్వేషాలకు అతీతంగా పరిపాలన చేస్తామని ప్రమాణం చేసిన నీవు... ముఖ్యమంత్రిగా న్యాయం, ధర్మం, నిజం వైపు నిలబడమని ఆమె వేడుకున్నారు.

కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్లు వీరే

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికిగాను వివిధ రాష్ట్రాల నుంచి 40 మంది స్టార్ క్యాంపెయినర్లను అధిష్ఠానం నియమించింది. అందులో కాంగ్రెస్ అగ్రనేతల నుంచి తెలంగాణ సీఎం, డిప్యూటీ సీఎంలు, మంత్రులు ఉన్నారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ముకుల్ వాస్నిక్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. స్టార్ క్యాంపెయినర్లలో కాంగ్రెస్ నేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, మాణిక్యం ఠాకూర్, కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, డీప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రేణుకా చౌదరి తదితరులు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వైఎస్ షర్మిలతోపాటు కాంగ్రెస్ సీనియర్ నేతలు ఎన్.రఘువీరారెడ్డి, ఎంఎం పల్లంరాజు, కొప్పుల రాజు, గిడుగు రుద్రరాజు, శైలజానాథ్ తదితరులకు చోటు కల్పించారు. వారంతా షెడ్యూలు వారీగా ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి... కాంగ్రెస్ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం చేస్తారు.

మేడేకు ఈసీ అనుమతి: సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మేడే నాడు పార్టీ కార్యాలయాల వద్ద, ఇతరచోట్ల జెండా ఆవిష్కరణలు, కార్మికుల ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతిచ్చినట్లు సీపీఎం తెలిపింది. మేడే నిర్వహణకు అనుమతించాలని కోరుతూ ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్‌కుమార్ మీనాకు ఈనెల 22వ తేదీన సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు జె.జయరామ్ వినతిపత్రం ఇచ్చారు. దీంతో మేడేకు అనుమతిస్తూ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకు ఆయన సమాచారం పంపారు. దీనికి సంబంధించిన కాపీని జిల్లా కలెక్టర్లకు, జిల్లా ఎన్నికల అధికారులకు, ఎస్పీలకు ఎంకే మీనా పంపారు. ఎన్నికల ప్రచారం, ఎన్నికల ఉపన్యాసాలు లేకుండా మేడే ఉత్సవాలు జరపవచ్చని, ప్రదర్శనలకు, బహిరంగసభలకు ముందస్తు అనుమతి తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో సూచించారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫలితాలు విడుదల

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్ సొసైటీ) పదో తరగతి, ఇంటర్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్ గురువారం విడుదల చేశారు. మార్చి 18 నుంచి 26 వరకు పరీక్షలు జరగగా... ఏప్రిల్ 12 నుంచి 16 వరకు స్పాట్ వాల్యుయేషన్ నిర్వహించి తాజాగా ఫలితాలు ప్రకటించారు. పదో తరగతి పరీక్షలకు 32,581 మంది, ఇంటర్ పరీక్షలకు 73,550 మంది విద్యార్థులు హాజరయ్యారు. పదో తరగతిలో 18,185 మంది (55.81శాతం), ఇంటర్‌లో 48,377 మంది (65.77శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఏప్రిల్ 29 నుంచి మే 7 వరకు రీ వాల్యుయేషన్ /రీకౌంటింగ్ అవకాశం కల్పిస్తున్నట్లు ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఏపీటీ ఆన్‌లైన్ సెంటర్ల ద్వారా ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 1 నుంచి 8వ తేదీ వరకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయని ఆయన వెల్లడించారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు జూన్ 10 నుంచి 12 వరకు నిర్వహిస్తామన్నారు. పరీక్ష ఫీజు ఏప్రిల్ 29 నుంచి మే 10 వరకు చెల్లించవచ్చని తెలిపారు.

ప్రశాంతంగా ఆదర్శ ప్రవేశపరీక్ష

రాష్ట్రవ్యాప్తంగా 164 ఏపీ ఆదర్శ (మోడల్) పాఠశాలల్లో నిర్వహించిన ఆరో తరగతి ప్రవేశ పరీక్షలకు 31,376 మంది విద్యార్థులు హాజరయ్యారని మోడల్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి తెలిపారు. రాష్ట్రమంతా 16,400 సీట్లు ఉండగా, 36,079 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారిలో 31,376 మంది (87%) హాజరైనట్లు పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలోని సిరివెళ్ల ఆదర్శ పాఠశాలను కృష్ణారెడ్డి రాష్ట్ర పరిశీలికులిగా, పర్యవేక్షకులుగా సందర్శిం చారు. విద్యార్థులకు ఏర్పాటు చేసిన తాగునీటి సౌకర్యం, బందోబస్తు, వైద్య సదుపాయం వంటి వసతులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

నిరంకుశ బీజేపీని గద్దె దించండి

'నయవంచన' పుస్తకావిష్కరణ సభలో వక్తలు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): ప్రజా స్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న నిరంకుశ బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని వక్తలు పిలుపునిచ్చారు. గురువారం గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో ఆంధ్ర ప్రదేశ్ పౌరసంఘాలు ప్రచురించిన 'నయవంచన-పది సంవత్సరాల నిరంకుశపాలన-పది దారుణ మోసాలు' పుస్తకాన్ని పార్లమెంటు మాజీ సభ్యులు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీజేపీని ఈ ఎన్నికలలో ఓడించడానికి అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న పది ప్రధానమైన ద్రోహాలను 'నయవంచన' పుస్తకం సూటిగా వెల్లడించిందన్నారు. ఈ పుస్తకంలోని సమాచారాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ప్రజాస్వామికవాదులు, బాధ్యతగల పౌరులంతా కృషి చేయాలని కోరారు. మేధావులు, రచయితలు, ప్రజాస్వామికవాదులు కర్నాటక రాష్ట్రంలో బీజేపీని మట్టికరిపించారని, అందుకోసం ఉపయోగించిన అనేక అంశాలలో ఈ పుస్తకం కూడా ఒకటని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను హరిస్తోందని, మరీ ముఖ్యంగా ఆంధ్ర ప్రదేశ్‌కు విభజన హామీలు ఒక్కటి కూడా నెరవేర్చకుండా చరిత్రలో ఎన్నడూ లేనంతగా ద్రోహం చేసిందని విమర్శించారు. అటువంటి బీజేపీతో అధికార, ప్రతిపక్ష పార్టీలు కుమ్మక్కవ్వడం మరింత సిగ్గుచేటని అన్నారు. శాసనమండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ ఎన్నికలలో బీజేపీని ఓడించాల్సిన అవసరం ఈ పుస్తకం చదివిన వారికి మరింతగా అర్థమవుతుందని తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ పౌర సంఘాల బాధ్యులు వారప్రసాద్ మాట్లాడుతూ కర్నాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో రూపొందిన ఈ పుస్తకం అక్కడ ఎంతో సంచలనం కలిగించిందని తెలిపారు. ఈ ఎన్నికలలో బీజేపీని నిలువరించడానికి ఈ పుస్తకంలోని సమాచారం ఉపయోగపడుతుందని, అందుకే ఈ పుస్తకాన్ని తెలుగులో మన రాష్ట్ర సమాచారాన్ని కూడా చేర్చి ప్రచురించామని వివరించారు. ఈ కార్యక్రమంలో రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక నాయకులు కె.విజయరావు, ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, భారత్ బచావో ఆందోళన్ నాయకులు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటిలోగా పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేయాలి: ఏపీటీఎఫ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్నికల విధులకు హాజరయ్యే ఉపాధ్యాయ, ఉద్యోగులందరూ విధిగా తమ పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుకు ఫాం-12ను జత శుక్రవారం సాయంత్రంలోగా విధులకు నిర్దేశింపబడిన రిటర్నింగ్ అధికారులు (ఆర్ఓ)కు సమర్పించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ నియోజకవర్గంలో ఓటు ఉన్నా పనిచేస్తున్న నియోజకవర్గ ఫెసిలిటేషన్ సెంటర్లోనే మే 5న ఓటు వేసుకోవడానికి అవకాశముందన్నారు.

గడువు పొడిగించాలి: ఏపీ జేఏసీ అమరావతి

పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుకు గడువు పెంచాలని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు ఎన్నికల అధికారికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఏపీ సచివాలయంలో ఎన్నికల అడిషనల్ కమిషనర్ ఎం.ఎన్.హరీంద్ర ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రెవిన్యూ సర్వీసెస్ అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రమేశ్ కుమార్ ఉన్నారు.

జగన్ అవినీతి పాలనపై ఎన్‌డీఏ ఛార్జ్‌షీట్ విడుదల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జగన్ ఐదేళ్ల పాలన అవినీతి, అక్రమాలపై గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎన్‌డీఏ కూటమి నేతలు ఛార్జ్‌షీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, జనసేన ప్రధాన కార్యదర్శి శివశంకర్, బీజేపీ రాష్ట్ర ఎన్నికల సమన్వయకర్త పేరాల శేఖర్ రావు, టీడీపీ కార్యాలయ ప్రధాన కార్యదర్శి అశోక్ బాబు, బీజేపీ అధికార ప్రతినిధి లంకా దినకర్, జనసేన అధికార ప్రతినిధి పి.గౌతమ్ తదితరులు వైసీపీ ప్రభుత్వ అవినీతి, అరాచకాలను వివరించారు. జగన్ రెడ్డి ఒక్కఛాన్స్ అంటూ అబద్ధాలు చెప్పి, అసాధ్యపు వాగ్దానాలతో ఎలా అధికారంలోకి వచ్చాడో, మరలా రేపు మరో అబద్ధపు మేనిఫెస్టోను విడుదల చేయడానికి సిద్ధం అయ్యాడని ఆరోపించారు. మద్య నిషేధం చేసిన తరువాతే ఓటు అడుగుతానన్న జగన్, మద్యాన్ని ఏరులై పారిస్తూ ఇప్పుడు ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. వారంలో సీపీఎస్ రద్దు చేస్తామని, ఏటా ఐదు లక్షల ఇళ్లు కడతానని, ఇవేమీ అమలు చేయకుండా మేనిఫెస్టో 99 శాతం అమలు చేశానని అబద్ధాలు చెబుతూ ప్రజలను వంచిస్తున్నారని వారు మండిపడ్డారు. అరాచక పాలన అంతం తమ కూటమి పంతమని, జగనాసుర రక్త చరిత్ర పాలన ఇక ఒక్క రోజు కూడా ఉండటానికి లేదని తెలిపారు. జగన్ పాదయాత్ర మొదలు పెట్టినప్పటి నుంచి అధికారంలోకి వచ్చే వరకు 750 వాగ్దానాలు చేశాడని, కనీసం 20 శాతం కూడా పూర్తి చేయలేదని ఆరోపించారు. ఈ విషయం సాక్ష్యాధారాలతో ప్రజా కోర్టులో ఎన్‌డీఏ ఛార్జిషీట్‌ను ప్రజలకు ముందుకు తీసుకువస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు జరిగిన అన్యాయాలను గుర్తు పెట్టుకోవాలని, సబ్ ప్లాన్ నిధులు లక్ష కోట్లను ముఖ్యమంత్రి దారి మళ్లించారని తెలిపారు. నా ఎస్సీలు, నా బీసీలు, నా మైనార్టీలు అని చెప్పి నమ్మబలుకుతున్నారని, అందరూ కలిసి జగన్ చెంప ఛెళ్లుమనిపించి ఇంటికి పంపడం ఖాయమని వారు హెచ్చరించారు.

పాత పెన్షన్ పునరుద్ధరించాలి

సూర్యనారాయణ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ చైర్మన్ కేఆర్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్యవేదిక కౌన్సిల్ సమావేశం గురు వారం విజయవాడ బందర్‌రోడ్‌లోని మాకినేని బసవపున్నయ్య ఆడిటోరియంలో జరిగింది. అనంతరం సూర్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ 12వ పీఆర్సీ సత్వరం అమలు చేయాలని, సకాలంలో డీఏలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మిక, పెన్షనర్ల సంఘాల ఐక్యవేదిక ఏర్పాటు చేసిన అంశాన్ని ఆయన తెలియజేస్తూ... పరిష్కారమే లక్ష్యంగా భజనతో కాదు, బాధ్యతతోను, పార్టీలతో కాదు, ప్రభుత్వంతోను అనే నినాదంతో తమ ఐక్యవేదిక పనిచేస్తుందన్నారు. ఈ ఐక్యవేదికను మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు కృషిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగులకు చెందిన రూ.25 వేల కోట్లకు పైగా ఉన్న పెండింగ్ పీఆర్సీ, డీఏ, ఏపీజీఎల్ఐ తదితర బకాయిలు చెల్లించాలని కోరారు. మెరుగైన ఉద్యోగ ఆరోగ్య పథకం అమలు చేయాలని, ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలన్న డిమాండ్లతో ఐక్యవేదిక పనిచేస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల ఐక్యవేదిక సెక్రటరీ జనరల్ బాజీ పఠాన్, చైర్మన్ కె.హరికృష్ణ, స్టీరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

1న ఇంటి వద్దే పింఛన్లు పంపిణీ చేయాలి: సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వృద్ధులు, దివ్యాంగులు, వితంతు, ఒంటరి మహిళ, చేనేత కార్మిక, మత్స్యకార, డప్పు కళాకారుల పింఛన్లు సచివాలయాల వద్ద కాకుండా మే 1వ తేదీన లబ్ధిదారుల ఇంటి వద్దే పంపిణీకి ఏర్పాట్లు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రోజురోజుకూ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న తరుణంలో దివ్యాంగులు, వృద్ధులు బయటకు రాలేని పరిస్థితి నెలకొందన్నారు. మార్చిలో ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో పింఛన్లు సచివాలయాల వద్ద పంపిణీ చేయడంతో వృద్ధులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. చాలా చోట్ల మరణాలు కూడా సంభవించాయన్నారు. గంటల తరబడి సచివాలయాల వద్ద పడిగాపులు కాసినా, నగదు లేదని సిబ్బంది సమాధానం చెప్పడం, ఒకటో తేదీనే ఇవ్వాల్సిన పింఛన్ సకాలంలో ఇవ్వకపోవడంతో పింఛన్‌దారులు నానా అవస్థలకు గురవుతున్నారని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నివాసాలకు సచివాలయాలు దూరంగా ఉండడంతో, రవాణా సదుపాయాలు లేక, కొండలుదిగి రాలేక మరిన్ని ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. సిబ్బందికి ఇతర విధులు అప్పగించకుండా సరిపడా నగదు ముందుగానే అందేలా అధికారులు ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు.

సంపాదకీయం

రెండో విడతా బీజేపీకి ఎదురీతే

ఏడు విడతలుగా జరుగుతున్న 2024 సార్వత్రిక ఎన్నికలలో శుక్రవారం రెండవ విడత పోలింగ్ జరగనుంది. ఎన్నికల విశ్లేషకుల అంచనాల ప్రకారం గత 19వ తేదీన జరిగిన 102 నియోజకవర్గాలకు జరిగిన పోలింగ్ సరళి "ఇండియా" ఐక్య సంఘటనకు అనుకూలంగా ఉంది. రెండవ విడతలో మొత్తం 89 నియోజకవర్గాలకు పోలింగ్ జరగవలసి ఉంది. కానీ ఒక నియోజకవర్గంలో అభ్యర్థి మృతివల్ల 88 చోట్లే పోలింగ్ జరుగుతుంది. ఈ 89 నియోజకవర్గాలు 13 రాష్ట్రాలలో విస్తరించి ఉన్నాయి. ఇందులో 9 సీట్లు ఎస్.సి.లకు, 6 స్థానాలు ఎస్.టి.లకు ప్రత్యేకించారు. రెండవ విడత పోలింగ్ లో విశేషం ఏమిటంటే కేరళలో ఉన్న మొత్తం 20 సీట్లకు శుక్రవారమే పోలింగ్ పూర్తి అవుతుంది. కేరళలో వామపక్ష ఫ్రంట్ అధికారంలో ఉంది. అక్కడ మరో ప్రత్యేకత ఏమిటంటే "ఇండియా" ఐక్య సంఘటనలో భాగస్వామ్య పక్షాలైన కాంగ్రెస్, వామపక్ష ఫ్రంట్ పరస్పరం పోటీ పడుతున్నాయి. 2019 బలాబలాలనుబట్టి చూస్తే రెండవ విడతలో పోలింగ్ జరుగుతున్న చోట బీజేపీ బలంగా ఉన్నట్టు కనిపిస్తుంది. ఒక్క కేరళలో మాత్రమే మినహాయింపు. కేరళలో బీజేపీకి 2019లోనూ ఒక్క సీటు కూడా రాలేదు. కేరళలో కాలు మోపడానికి దశాబ్దాలుగా బీజేపీ పడుతున్న పాట్లవల్ల పెద్దగా ఫలితం ఉండడం లేదు. ఆ పరిస్థితిలో ఈ సారీ మార్పు ఉండకపోవచ్చు. 2019 ఎన్నికలలో శుక్రవారం పోలింగ్ జరగనున్న 89స్థానాలలో 60 చోట్ల ఎన్.డి.ఎ. విజయం సాధించింది. అందులో బీజేపీకి 52 సీట్లు దక్కాయి. జె.డి.యు. కు నాలుగు సీట్లు, అప్పుడు ఉమ్మడిగా ఉన్న శివసేనకు 4 స్థానాలు ఉన్నాయి. అప్పుడు కాంగ్రెస్ నాయకత్వంలోని యు.పి.ఎ.కు 23 సీట్లు వచ్చాయి. 2019లో కర్నాటక లోని 28 స్థానాలలో బీజేపీ 25 సీట్లు సంపాదించింది. కానీ అప్పటికీ ఇప్పటికీ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యతను క్రమంగా జనం గ్రహిస్తున్నారు. దేశ జనాభాలో అత్యధిక సంఖ్యాక ప్రజలు లేమికి, వివక్షకు, అన్యాయానికి బలై పోతున్నారు. ఎవరూ పట్టించుకోని వారిగా మిగిలిపోతున్నారు. 1991 నుంచి అనుసరిస్తున్న ఉదారవాద ఆర్థిక విధానాలు ప్రజలను అనేక కష్టాలకు గురిచేస్తే మోదీ పదేళ్ల పాలన జనాన్ని జీవచ్ఛవాల్లా మార్చేసింది. మోదీ ఎక్కించిన మతం మత్తువల్ల తమకు తిండిపెట్టదని, కనీస ప్రజాస్వామ్య హక్కులులేని జీవితం వ్యర్థం అని ప్రజలు అనుభవం ద్వారా తెలుసుకున్నారు. పేదరిక సూచికల్లో మన దేశం నానాటికి దిగజారిపోతోంది. పార్లమెంటరీ రాజకీయాలలో వామపక్షాలు బలహీనపడడంవల్ల పీడితులు, దోపిడీకి గురవుతున్నవారు, అణగారిన వర్గాల వారి గురించి మాట్లాడే గొంతులు పీలగా మారిపోయాయి. ఈ లోటును కమ్యూనిస్టు వ్యతిరేకులు కూడా గుర్తిస్తున్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో కమ్యూనిస్టు పార్టీలు గతంలో ఎంతో నిర్ణయాత్మక పాత్ర పోషించాయి. అనేక ప్రగతిశీల పథకాలను వివిధ ప్రభుత్వాలు అమలు చేయక తప్పని పరిస్థితిని కల్పించింది వామపక్షాలవారే. చట్టసభల్లో వామపక్షాల గొంతు బలహీనం కావడంవల్ల సామాన్యజనం గోడు వినిపించే అవకాశమూ తగ్గింది. ఈ వెలితి పూడ్చవలసిన అవసరం చాలా ఉంది.

బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలు ఎన్నికల వేళ ప్రస్తావనకు రాకుండా ఉండడం కోసం ప్రధానమంత్రి మోదీ అనేక ఎత్తులు ఎత్తుతున్నారు. దశాబ్దాలుగా బీజేపీ పెంచి పోషించిన మతతత్వం ఈ ఎన్నికల్లో ఉపకరించదని మోదీకి తెలుసు. అందుకే ప్రతిపక్షాలను దూషించడం మొదలు పెట్టారు. పదేళ్లలో తాను సాధించిందేమిటో చెప్పుకోవడానికి ఆయనకు ఏమీ లేదు కనక చరిత్ర పుటలు తిరగేసి ఇదివరకు అధికారంలో ఉన్న వారు చేసిన తప్పులు ఎన్నడం మీద దృష్టి కేంద్రీకరించారు. 2014 లో తాను అధికారం చేపట్టేదాకా అసలు ఈ దేశమే అస్తిత్వంలో లేనట్టు మాట్లాడే మోదీ సాధించిందేమిటో చెప్పుకోగల స్థితిలో లేకపోవడంతో అసత్య ప్రచారానికి పాల్పడుతున్నారు. తాను చెప్పే అబద్ధాలను జనం నమ్మే పరిస్థితి లేదని తెలిసినా చెప్పిన అబద్ధమే అదే పనిగా చెప్తుంటారు. చాలాసార్లు కొత్త అసత్యాలను సృష్టించి ప్రచారంలో పెట్టారు. తన వాక్చాతుర్యాన్ని, వక్తృత్వ పటిమను అబద్ధాల ప్రచారానికి వినియోగించుకుంటున్నారు. ఒక దశలో ఇవన్నీ బీజేపీ విజయ పరంపరకు ఉపకరించి ఉండవచ్చు. అయోధ్యలో రామ మందిర నిర్మాణం ఆసరాగా ఓట్లు దండుకోవాలన్న మోదీ ప్రయత్నం బెడిసికొట్టింది. రామ మందిరాన్ని చూసి ఓట్లు వేసేవారు కనిపించడం లేదు. శ్రీరాముడిని మోదీకి గుత్తకు తీసుకోవడం ప్రజలకు, ముఖ్యంగా రామ భక్తులకు ఏమాత్రం నచ్చడం లేదు. రెండవ విడత పోలింగ్ జరుగుతున్న చోట 2019లో బీజేపీ ఎక్కువ స్థానాలు సంపాదించి ఉండవచ్చు కానీ ఈ సారి పరిస్థితి తిరగబడడం ఖాయంగా కనిపిస్తోంది. జనం ఎదుర్కుంటున్న నిత్య సమస్యలను జనమే చర్చకు పెడుతున్నారు. ఈ ఎన్నికలు బీజేపీకి, "ఇండియా" ఐక్య సంఘటనకు మధ్య ప్రధాన పోటీగా కనిపిస్తున్నా మోదీని ఈ సారి ఓడించాలన్న సంకల్పం సాధారణ ప్రజల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. జన నిర్ణయాన్ని మార్చే శక్తి మోదీ అసత్య ప్రచారానికి ఉండదు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో వామపక్షాలు నిర్వర్తించవలసిన బృహత్తర బాధ్యతను విస్మరించలేం. వామపక్షాల ఈ కర్తవ్య నిర్వహణలో వామపక్షాల గెలుపోటములు, సీట్ల సంఖ్య అంత ప్రధానం కాదు. జనం సమస్యలను, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ ఆవశ్యకతను చాటి చెప్పడంలో వామపక్ష పార్టీలు ఎన్నదగిన పాత్ర పోషిస్తున్నాయి. వామపక్షాల పోరాటం చట్ట సభల్లో సీట్లకు పరిమితమైంది కాదు. వామపక్షాలది ప్రజోద్యమం. ఈ ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి ప్రజల సహకారం, భాగస్వామ్యం అత్యవసరం. దీన్ని జనం గుర్తించేలా చేయడమే వామపక్షాల విజయ పథం. మోదీ హయాంలో పెట్టుబడిదారి విధానం పదిహేను ఇరవైమంది పెట్టుబడులకు, వ్యాపార సంస్థలకు పరిమితం అయిపోయింది. అందువల్ల మనుగడకోసం ప్రయాస పడుతున్న ఇతర పెట్టుబడిదారీ వర్గాలకు కూడా మోదీ విధానాలు మింగుడు పడడం లేదు. మోదీ హయాంలో ప్రజాస్వామ్య మూలకందాన్నే ఛిద్రం చేసిన వైనం సకల ప్రజాస్వామ్య శక్తులను ఆలోచింప చేస్తోంది. రెండవ విడత పోలింగ్ జరుగుతున్న నియోజకవర్గాలు గతంలో బీజేపీకి అనుకూలంగా ఉండిఉండవచ్చు. కానీ అప్పుడు మోదీని గెలిపించిన వర్గాల వారే ఇప్పుడు పునరాలోచనలో పడ్డారు. ఈ ధోరణి చాలా స్పష్టంగా కనిపిస్తోంది. శుక్రవారం రెండో విడత పూర్తిఅయితే మిగతా అయిదు విడతల్లో కూడా బీజేపీ గుండె మీద చేయివేసుకుని ఉండే పరిస్థితి ఏ విడతలోనూ కనిపించడం లేదు. బీజేపీ అంతర్గత సర్వేతో పాటు వివిధ సర్వేలు మోదీకి పరాజయం తప్పదని ఘోషిస్తున్నాయి. గోదీ మీడియా స్వరం క్రమంగా మారుతుండడాన్ని గమనిస్తే జనం నిర్ణయం ఎలా ఉండబోతోందో అంచనా వేయడం కష్టం కాదు.

విలువలు కోల్పోతున్న రాజకీయాలు

అబ్బబ్బ ఇవేమి రాజకీయాలు. చూడటానికి చెప్పటానికి సిగ్గుపడాల్సి వస్తోంది. మళ్లీ ఏమైంది బావ ఈ మధ్య నీకు విసుగు, కోపం పెరిగినట్లుంది. కోపం పెరగడమేంటయ్యా అసలు నువ్వు ఎలా ఓర్చుకుంటున్నావయ్యా. రౌడీలు కూడా అలాంటి బూతులు తిట్టుకోరు. వీళ్ల ప్రజాప్రతినిధులా. యువతకు ఆదర్శనీయులా. ఛ ఛ అసలు సిగ్గు, లజ్జ అనే పదాలు వీళ్లకు తెలియవా లేక అవన్నీ వదిలేశారా. అబ్బ అసలేమైందయ్యా అంత ఫైర్ అవుతున్నావ్. ఏమవ్వాలి భార్యలను, తల్లిదండ్రులను కూడా రోడ్డు మీదకు ఈడుస్తున్నారుగ. నీకు నలుగురు పెళ్లాలని ఒకరంటే నీ భార్య సంగతేంటని మరొకడు. ఒక తల్లి తండ్రికి పుడితే నా ప్రశ్నకు సమాధానం చెప్పమని ఒకడు సవాల్ విసురుతాడు.

వివేచన

- బండారు రాధాకృష్ణ

నిజమేనయ్యా పూర్తిగా విలువలు పడిపోయాయి. ఎవరేమి మాట్లాడుతున్నారో వారికే తెలియదన్నట్లుగ ఉంది. చూడు బావ నేను మొదటి ఎలక్షను 1952 లో కూడ చూశాను. ఆ రోజుల్లో రెండే పార్టీలు కమ్యూనిస్టులు, కాంగ్రెసు. పోలింగ్‌లో రెండు చెక్క పెట్టెలుండేవి. ఒకటి ఎర్రపెట్టె మరొకటి పసుపుపెట్టె. ఎర్రపెట్టె కమ్యూనిస్టులది. పసుపుపెట్టె కాంగ్రెసుది. కమ్యూనిస్టు ఏజంటుగ ఉన్న మా నాన్నకు మధ్యాహ్నం భోజనం పట్టుకెళ్లాను. ఎవరి భోజనం వారిదే. అంతెందుకు 1967 లో జలగం వెంగళరావు, కాళోజి నారాయణరావు నిలబడితే డిపాజిట్ సహా మొత్తం ఖర్చు ఏడువేల అయిదువందలు. కమ్యూనిస్టు పార్టీకి రూపాయి నుండి అయిదు రూపాయల వరకు ఎన్నికల ఖర్చుకోసం ప్రజలు చందాలివ్వడం నాకు తెలుసు. అభ్యర్థులిరువురు ఎదురుపడితే నవ్వుకుంటూ పలకరించుకొనేవారు. ఇప్పుడేంటి బావ ఇది వందల కోట్లు ఖర్చు ఎదుటి అభ్యర్థులను హతమార్చడానికి కోట్లరూపాయల డీల్ కుదుర్చుకోవడం, తిట్టుకోవడం, తన్నుకోవడం, ప్రాణాలకు కూడ విలువలేకుండా పోయింది. ఇదంతా సంపాదన కోసమే కదా. ఆ రోజుల్లో చెరొక పార్టీలోఉన్న అన్నదమ్ములు కూడా మాట్లాడుకునే వారు. ఇప్పుడు పగలొక పార్టీ, రాత్రి ఒక పార్టీ. అంతెందుకు ఒక కార్లో రెండు జెండాలు. 1983లో యన్‌టిఆర్ గుడివాడలో నిలబడినప్పుడు గుడివాడలో తెలుగుదేశం జెండా కట్టి గుడివాడ దాటగానే దాన్ని డిక్కీలోవేసి కాంగ్రెసు జెండా కట్టేవారు. ఇదంతా చూచి పాతరోజులు గుర్తుకొచ్చి ఆశ్చర్యపోయేవాడిని. అది సరే ప్రస్తుతం పవన్, వైసీపీ, అలాగే కూటమి వాళ్ల పరిస్థితి అలాగే ఉందిగా...జనసేన, తెలుగుదేశం, బీజేపీ కూటమిగ ఏర్పడినా ఒకరినొకరు నమ్మరు. ఒకర్ని ఒకరు తిట్టుకోవడం, కొట్టుకోవడం పార్టీల మార్పిడి ఇదంతా నామినేషన్లు మొదలైనా జరుగుతూనే ఉందిగ. నిజమే మన తరం చూడలేక ఎందుకు బతికున్నామా అనిపిస్తోంది. ప్రస్తుతం పార్టీ కన్నా కులం ముందుకొస్తోంది. అసలు ప్రతి కులంలోను అన్ని పార్టీల వారు ఉంటారని తెలిసినా నాయకులు కుల సమావేశాలు జరిపి సంతోషపడటంలో అర్థంలేదు. తన కులం ఎక్కువగ ఉన్నచోట పోటీచేద్దామనుకోవడం అక్కడ ఇతర పార్టీలవారు అదే కులంలో అభ్యర్థిని నిలబెట్టడం ఇదంతా చూస్తుంటే సమాజం ఎటుపోతోంది. వ్యవస్థ ఇలా మారుతోందేమిటని బాధగా ఉంది బావ. నిజమే బాధపడి మనం బీపీ పెంచుకోవడం తప్ప ఇంకేమి చేయలేం. కాకపోతే సమాజం కోసం జాతి అభ్యున్నతికోసం ప్రాణాలర్పించిన మహనీయులు గుర్తుకొచ్చి బాధపడటంతప్ప. అదికాదు బావ సంపాదన కోసం భార్యలను వదిలేసినవారు ఉన్నారు. అప్పుడంటే సత్యం కోసం భార్యను అమ్మేసిన హరిశ్చంద్రుడు ఆనాడున్నాడు. అది సరే రాజకీయాల్లో కోట్లు సంపాదించి ఏం చేసుకుంటారో నా కర్థకాదు. ఏనాడు కాలు బైటపెట్టని వారు భర్తల విజయం కోసం ప్రచారం చేస్తున్నారు. ఛీ ఛీ వ్యవస్థ సర్వనాశనం అయిపోతోంది. ప్రస్తుత నాయకులను చూచి అతి త్వరగా కోట్లు సంపాదించడానికి యువత రాజకీయాల్లోకి వస్తున్నారు. సమాజాన్ని తీర్చిదిద్దవలసిన యువత కూడా ఈ నాయకుల్ని చూసి పాడైపోతున్నారు. అసలు సమాజ గమనం ముందుకా వెనకకో అని తలగోక్కోవలసిన పరిస్థితి చూస్తున్నాం. మేధావులు సైతం ఏమీ తోచని స్థితిలో మిన్నకుండిపోయారు.

సెల్ 98855 69394

నేటికీ నెరవేరని కార్మికుల హక్కులు

కృష్ణ ఝా

తమకూ హక్కులున్నాయని, తమది ఒక వర్గమని ప్రపంచవ్యాప్తంగా కార్మికులు గుర్తించి మేడే జరుపుకుంటున్నారు. మే 1వ తేదీన ప్రపంచవ్యాప్తంగా కార్మికులు మేడే జరుపుకుంటున్నారు. మనదేశంలోనూ 1920లో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్(ఏఐటీయూసీ) ఏర్పడింది. యూనియన్ అధ్యక్షుడిగా లాలా లజపతిరాయ్‌ని ఎన్నుకున్నారు. అప్పుడప్పుడే పెట్టుబడీదారీ వ్యవస్థ రూపొందింది. వ్యవసాయరంగంలో రైతులు వ్యవసాయ కార్మికుల మాదిరిగానే పోరాటాలు చేయవలసివచ్చింది. రైతులు మౌలిక సదుపాయాలు కూడా లేక పోరాటం చేస్తున్నారు. ముంబైలో పరిశ్రమలు, కలకత్తాలో పత్తి మిల్లులు, జూట్ మిల్లులు నెలకొల్పారు. పట్టణప్రాంతాల్లో పరిశ్రమలు రావడంతో కార్మికులు అవసరమయ్యారు. వారు తమ హక్కులకోసం పోరాటాలను ప్రారంభించారు. ఈ పరిశ్రమల్లో కార్మికులు 16గంటలు, కొన్నిసార్లు 20 గంటలు కూడా పనిచేసేవారు. ఏ హక్కులు ఆనాడు కార్మికులకు లేవు. అంతేకాదు, ప్రారంభదశలో కార్మికులు ఏ స్వేచ్ఛ లేకుండా నిరంతరం ఫ్యాక్టరీలో పనిచేయవలసి వచ్చేది. ప్రాథమిక దశలో గుడ్డిగా కార్మికులను హింసించేవారు. ఎంత హింసించినా కార్మికులు మాట్లాడలేని చట్టాలను ఎదుర్కొన్నారు. అయితే తమకు హక్కులున్నాయని గుర్తించిన తరువాత క్రమంగా వాటికోసం పోరాటాలను ప్రారంభించారు. ఫ్యాక్టరీల్లో మొత్తం ఉత్పత్తికి తామే మూలకారణమని కూడా గుర్తించారు. భూములులేని రైతులు ఆకలి తీర్చుకోలేని కార్మికులు క్రమంగా తమ పరిస్థితిని గ్రహించారు. 1881లో కార్మికులపైన అనేక ఆంక్షలు ఏర్పడ్డాయి. 1891నాటికి మహిళ, బాలకార్మికులు పనుల్లోకి వచ్చారు. అయితే యాజమాన్యం వీరిని గురించి పెద్దగా పట్టించుకునేవారుకాదు.

అమెరికా ఫెడరేషన్ ఆఫ్ లేబర్, ఇతర ట్రేడ్ యూనియన్లు ఆ దేశమంతటా 1886, మే 1వ తేదీన పరిశ్రమల్లో పనిచేసే కార్మికులంతా సమ్మె చేశారు. ఎనిమిది గంటల పనిదినం కావాలని డిమాండ్ చేశారు. 8గంటలు శ్రమ, మరో 8గంటలు వినోదానికి, మరో 8గంటలు విశ్రాంతి ఉండాలని డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్ల కోసం చికాగో నగరంలో 1886, మే 4వతేదీన వేలాదిమంది కార్మికులు భారీ సమావేశాన్ని నిర్వహించి డిమాండ్లను నినదించారు. హే మార్కెట్ స్క్వేర్‌లో కార్మికుల ర్యాలీపైన బాంబు పేల్చారు. పోలీసులు కార్మికులపై కాల్పులుజరిపారు. ఈ సందర్భంగా ఏడుగురు పోలీసులు, కార్మికులు మృతి చెందారు. అలాగే మరో నలుగురు ఆ దారిలో నడుస్తున్నవారు కూడా చనిపోయారు. అమెరికా అంతటా కార్మికులు, పోలీసులు జరిపిన కాల్పులకు వ్యతిరేకంగా, తమ హక్కులకోసం డిమాండ్‌చేస్తూ పనిప్రదేశాలలో పరిస్థితులను మెరుగు పరచాలని ప్రదర్శనలుజరిపి డిమాండ్ చేశారు. ఈ పరిణామాలనంతరం పరిస్థితులు హింసాత్మకంగా మారిపోయాయి. ఆ

రోజు జరిగిన హింసాయుత సంఘటనలకు తగిన సాక్ష్యాలు లేకపోయినప్పటికీ న్యాయమూర్తి ఏడుగురికి మరణశిక్ష విధించారు. చివరికి15ఏళ్లపాటు జైలుశిక్ష విధించారు. 1893 నవంబరు 11న నలుగురికి మరణశిక్ష అమలు చేశారు. ఇల్లినాయిస్ గవర్నర్ జాన్‌పీటర్ తక్కిన కార్మిక నాయకులకు క్షమాబిక్ష పెట్టారు. సమ్మె చేస్తున్నకార్మికులను బలిచేసేందుకు పన్నిన కుట్రే ఇదని చివరకి సాక్ష్యాలు కూడా లభించాయి. ఈ సమ్మె అనంతరం ప్రపంచవ్యాప్తంగా అన్నిదేశాలలో 8గంటల పనికోసం సమ్మెలు జరిగాయి. 1889లో రెండవ ఇంటర్నేషనల్ ఒక ప్రకటనను జారీ చేసింది. కార్మికులంతా మే 1వ తేదీన మేడేను జరుపుకోవాలని ఆప్రకటనలో కోరారు.

రెండు శతాబ్దాలలోపు శాస్త్రీయ, సాంకేతిక విప్లవ ప్రభావంతో ఆధునిక ప్రపంచంలో ఇవన్నీ క్రమంగా తెరమరుగవుతున్నాయి. 8గంటల పనిదినానికి సంబంధించి కార్పొరేట్ రంగం దృఢనిశ్చయంతో ఉన్నది. ఎన్నో పోరాటాలు నిర్వహించి సాధించుకున్న హక్కులు క్రమంగా హరించుకు పోతున్నాయి. హక్కులకోసం అనేక వేలమంది తమ ప్రాణాలను త్యాగం చేశారు. కార్మికులను దోపిడీచేసే చర్యలు చేపడుతున్నారు. నెమ్మదిగా కార్మికులు 12గంటలు, ఇంకా ఎక్కువ గంటలు పనిచేయాలని పారిశ్రామికవేత్తలు కోరుతున్నారు. పోరాడి సాధించిన హక్కులను గతంలోఉన్న కార్మిక చట్టాలలో పొందుపరచారు. అయితే తాజాగా అప్రజాస్వామికంగా, రాజ్యాంగ విరుద్ధంగా హక్కులను క్షీణింపచేయడం లేదా తొలగించడం జరుగుతోంది. సరళతర వ్యాపారం పేరుతో వీటిని అమలు చేయడానికి పూనుకొన్నారు. ఏఐటీయూసీ, ఇతర ట్రేడ్ యూనియన్లు కలిసి దేశవ్యాప్తంగా కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను, చర్యలను నిరసిస్తూ సమ్మెలు చేశారు. అయినప్పటికీ ఏ ఫలితం లేకుండా పోయింది. గతంలోఉన్న కార్మిక చట్టాలను కుదించి నాలుగు కార్మిక కోడ్స్‌ను రూపొందించారు. కొత్త లేబర్‌కోడ్ కింద 20 మంది కార్మికులు ఉన్న యాజమాన్యం ఎటువంటి నియమ నిబంధనలను పాటించవలసిన అవసరంలేదు. రోజువారీ పనిగంటలు 8నుంచి 12గంటలకు పెంచి అనేక రాష్ట్రాలలో అమలు చేస్తున్నారు. 300 మంది కార్మికులకు తక్కువగా ఉన్న ఫ్యాక్టరీల యాజమాన్యాలు లే ఆఫ్ లేదా మూసివేతకోసం ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి తీసుకోవలసిన అవసరంలేదు. కాంట్రాక్టు ఉద్యోగులకు కొత్త చట్టం కింద మరింత దుర్మార్గమైన పనిపరిస్థితులను కల్పించవచ్చునని యూనియన్లు ఆందోళన చెందుతున్నాయి. కార్మికులందరికీ ఎలాంటి సామాజిక భద్రతలేకుండా చట్టాన్ని మార్పు చేశారు. ఐఎల్‌ఓ నియమ నిబంధనలను పాటించేందుకు భారతదేశం అంగీకరించింది. అంతర్జాతీయ కార్మిక ప్రమాణాలను పాటించేందుకు కూడా అంగీకరించారు. అయితే వాస్తవంగా ప్రభుత్వం ఇందుకు విరుద్ధమైన విధానాలను అనుసరిస్తున్నది. సాంకేతికత అభివృద్ధిచెందిన నేపథ్యంలో ఉత్పాదకత పెరిగింది. ఈ స్థితిలో కార్మికుల పనిగంటలను గణనీయంగా తగ్గించాలి.

ప్రపంచ ట్రేడ్ యూనియన్ల సమాఖ్య (డబ్ల్యుఎఫ్‌టీయూ) వారానికి 35 పని గంటలను మాత్రమే అమలు చేయాలని డిమాండ్ చేస్తోంది. అంతేకాదు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి జాబితాలో కార్మిక చట్టాలను, నియమనిబంధనలను చేర్చాలి. ప్రభుత్వం జాతీయస్థాయిలో కోడ్‌ను అమలు జరిపేందుకు సిద్ధంగా ఉంది. అనేక రాష్ట్రాలు, ట్రేడ్ యూనియన్లు వ్యతిరేకిస్తున్నప్పటికీ కార్మిక చట్టాలలో సవరణలు చేయడానికి పూనుకున్నాయి. గుజరాత్, మధ్యప్రదేశ్, హర్యానా, తమిళనాడు తదితర రాష్ట్రాలలో కార్మికచట్టాలను సవరించాయి. కార్మికుల, వలస కార్మికుల, స్కీమ్ వర్కర్ల పరిస్థితులను మరింతగా దిగజార్చాలని ప్రభుత్వం విధివిధానాలలో మార్పులు చేసింది. అయితే ట్రేడ్‌యూనియన్లు కనీస వేతనాన్ని 26వేలు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. అయితే కనీస వేతనం ప్రమాణాలను ఉమ్మడి జాబితాలో నెలకు 9వేలుగా నిర్ణయించింది. 80లక్షలమందికిపైగా వివిధ శాఖలలో స్కీం వర్కర్లు ఉన్నారు. మధ్యాహ్న భోజనపథకం అమలు చేసేవారు ఆశాకార్మికులు, అంగన్‌వాడీలు మొదలైనవారిని కార్మికులుగా గుర్తించేందుకు ప్రభుత్వం తిరస్కరించింది. వారికి ఎలాంటి హక్కులు, సౌకర్యాలు లేవు. ఎక్కువమంది మహిళలు ఈ పనులు నిర్వహిస్తున్నారు. 96శాతం మంది మహిళా కార్మికులు అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారు. అయితే సుప్రీంకోర్టు ఈ మహిళలకు సామాజిక సంక్షేమ ప్రయోజనాలు కల్పించాలని యాజమాన్యానికి సూచించింది. పేదరికం స్థాయికి దిగువనున్న మహిళలకు మాత్రమే ఈ ప్రయోజనాలు కల్పిస్తారు.

అజ్ఞానాన్ని ప్రోది చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

డా. ముచ్చుకోట సురేష్ బాబు

కొవ్వొత్తులు వెలిగించండి, చప్పట్లు కొట్టండి, ప్లేట్లు, స్పూన్లు గెరిటలతో గట్టిగా శబ్దాలు చేయండి కరోనా వైరస్‌ను పారదోలండి. కషాయాలు తాగండి, పూజలు చేయండి పౌష్టికాహార లోపాన్ని పారదోలండి. భవ్య రామమందిరం సూర్య తిలకం దర్శించండి. పునీతులవ్వండి అంటూ అశాస్త్రీయమైన భావజాలాన్ని ప్రసార మాధ్యమాలు పుంఖానుపుంఖాలుగా ప్రచారం చేస్తూ శాస్త్రీయ స్పృహ లేని, నైపుణ్యం లేని సమాజాన్ని తయారు చేస్తున్నారు. దేశ పురోగతికి ప్రతిబంధకాలైన అవిద్య, అజ్ఞానం మూఢనమ్మకాలు పెంచి పోషిస్తున్నారు. మోదీ, అయన సైద్ధాంతిక గురువు, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, రాజ్యాంగపరంగా లౌకిక భారతదేశాన్ని హిందూ రాజ్యంగా మార్పుచేయాలని సిద్ధమయ్యారు. భర్తీ చేయాలని వారి రాజకీయ లక్ష్యంతో సరిపోయే భారతదేశ పాఠ్యపుస్తకాలను సవరించాలని చాలా కాలంగా ప్రచారం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం హిందూ ఆధిపత్య ఎజెండాను అనుసరిస్తూ పాఠ్యపుస్తకాల నుండి ముఖ్యమైన చారిత్రక, శాస్త్రీయ వాస్తవాలను తొలగిస్తుంది. రెండవసారి అధికారంలోకి రావడానికి ఒక సంవత్సరం ముందు, అప్పటి విద్యామంత్రి భారతీయులు హిందూ "ఋషుల" (ఋషుల) వారసులని, కోతులు కాదని తాను నమ్ముతున్నానని చెప్పారు. 2021-2022 విద్యా సంవత్సరానికి, 9, 10వ తరగతుల విద్యార్థులకు సిలబస్ నుంచి డార్విన్ సిద్ధాంతం తొలగించారు. 2022-2023 నాటికి, పాఠశాల పాఠ్యపుస్తకాల నుండి పరిణామం అంశం పూర్తిగా తొలగించారు. ఇప్పుడు, లక్షలాది మంది పాఠశాల విద్యార్థులకు డార్విన్ ఎవరో అతని సిద్ధాంతం ఏమి చెబుతుందో తెలియదు - వారు 11వ తరగతి, 12వ తరగతిలో జీవశాస్త్రాన్ని



ఎంచుకుంటే తప్ప డార్విన్ సిద్ధాంతం తెలియదు.

ప్రస్తుత ప్రభుత్వం పాఠశాల పాఠ్యాంశాల విషపూరితం చేయడం ద్వారా భారతదేశం నైతికత పై దాడి చేస్తోంది. పాఠ్యపుస్తకాల్లో మార్పులు ఫెడరల్ ఎడ్యుకేషన్ మినిస్ట్రీ ఆధ్వర్యంలోని స్టేట్-రన్ బాడీ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సూచించింది. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ పాఠ్యపుస్తకాలు పదిలక్షల మంది విద్యార్థులు భారతదేశ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్‌కు అనుబంధంగా ఉన్న 24,000 పాఠశాలలు అనుసరిస్తున్నాయి. సిబిఎస్సి ప్రపంచవ్యాప్తంగా 26 దేశాల్లో దాదాపు 240 అనుబంధ పాఠశాలలను కలిగి ఉంది. అంతే కాకుండా, భారతదేశంలో 14 రాష్ట్రాలలో కనీసం 19 పాఠశాల బోర్డులు తరగతి గదులలో ఎన్సీఈఆర్టీ పుస్తకాలను ఉపయోగిస్తాయి. ఎన్సీఆర్టీ చర్యను సైన్స్ కమ్యూనిటీ తీవ్రంగా వ్యతిరేకించింది 'ట్రావెస్టీ ఆఫ్ ఎడ్యుకేషన్' శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు సంతకం చేసిన బహిరంగ లేఖలో ఈ ప్రాథమిక ఆవిష్కరణకు గురికాకుండా ఉంటే విద్యార్థుల ఆలోచనా విధానం 'తీవ్రమైన వైకల్యానికి గురవుతుంది' అని పేర్కొంది. సైన్స్ పాఠ్యపుస్తకాల నుండి ముఖ్యమైన అధ్యాయాన్ని తొలగించడం "విద్యకు హాని" అని పేర్కొంటూ, దేశవ్యాప్తంగా 1,800 మంది శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సైన్స్ ప్రముఖులు బహిరంగ లేఖ రాశారు. శాస్త్రీయ, హేతుబద్ధమైన ప్రపంచ దృక్పథాన్ని నిర్మించడంలో పరిణామ ప్రక్రియపై అవగాహన కీలకం. డార్విన్ శ్రమతో కూడిన పరిశీలనలు అలాగే అతని నిశితమైన అంతర్దృష్టి సహజ ఎంపిక సిద్ధాంతానికి దారితీసింది, సైన్స్ ప్రక్రియ విమర్శనాత్మక ఆలోచన ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తుంది.

బీజేపీ, ఇతర ఆర్ఎస్ఎస్ అనుబంధ హిందూ గ్రూపులు భారతదేశంలోని 14 శాతం జనాభా కలిగిన 200 మిలియన్ల ముస్లింలను అట్టడుగున ఉంచే ప్రచారాన్ని నిర్వహిస్తున్నాయి. భారత ఉపఖండానికి శతాబ్దాలుగా ముస్లింలు పరిపాలించారనే చారిత్రక వాస్తవాన్ని తిరస్కరించడం, హిందూ పీడన ప్రత్యామ్నాయ చరిత్ర సృష్టించడం ద్వారా ఆనాటి ముస్లిం పాలకులను రాక్షసులను చేయడం - ఆ ప్రచారంలో ప్రధాన అంశాలు. అదే ప్రచారంలో భాగంగా, 16, 19వ శతాబ్దాల మధ్య ఉపఖండాన్ని పాలించిన మొఘలుల ప్రస్తావనలు కూడా చరిత్ర పాఠ్యపుస్తకాల నుండి తొలగించారు. ఎన్సీఆర్టీ పాఠ్యపుస్తకాలను హేతుబద్ధీకరణ పేరుతో 7వ తరగతి చరిత్ర పాఠ్యపుస్తకం నుండి తుగ్లక్‌లు, ఖిల్జీలు వంటి ఢిల్లీ సుల్తానేట్ పాలకులను సూచించే అనేక పేజీలను తొలగించింది. ఇది మొఘల్ చక్రవర్తుల మైలురాళ్ళు, విజయాలను వివరించే రెండు పేజీల పట్టికను కూడా తొలగించింది. ఇదే తరహాలో ఢిల్లీ సుల్తానేట్ విస్తరణ గురించి మాట్లాడే మూడు పేజీలు "మసీదు" (మసీదు) గురించి వివరంగా వివరించే విభాగం కూడా తొలగించారు. కింగ్స్ అండ్ క్రానికల్స్, ది మొఘల్ కోర్ట్స్ అనే అధ్యాయం, అక్బర్ నామా, బాద్షా నామాతో సహా మొఘల్‌యుగం అంశాలు గురించి 12వ తరగతి చరిత్ర పాఠ్యపుస్తకం నుండి తొలగించారు.

అయోధ్యలో రామనవమి సందర్భంగా 'సూర్య తిలకం' సూర్యకాంతి కిరణంతో రామ్‌లల్లా విగ్రహం నుదుటిపై అభిషేకం చేయడంతో ఒక విశిష్ట ఘట్టాన్ని శాస్త్రజ్ఞులు ఏర్పాటు చేశారు. అత్యాధునిక శాస్త్రీయ నైపుణ్యాన్ని ఉపయోగించి, 5.8 సెంటీమీటర్ల కాంతి పుంజం రాముడి నుదిటిపై తాకింది. రామ మందిరంలో ఉన్న పది మంది భారతీయ శాస్త్రవేత్తల బృందం రామనవమి నాడు కార్యక్రమాన్ని విజయవంతం చేసింది. మధ్యాహ్నం 12 గంటల నుండి దాదాపు 3 నుండి 3.5 నిమిషాల వరకు, అద్దాలు, లెన్స్‌ల కలయికను ఉపయోగించి సూర్యకాంతి ఖచ్చితంగా విగ్రహం నుదుటిపైకి మళ్లించారు. బలరామునిపై 'సూర్య తిలకం' అంటూ బ్రాహ్మణవాద శక్తులు సైన్సును దైవ మహత్తుగా అబద్ధపు కథలకు తెరలేపగా, మత రాజకీయం ఆధారంగా పనిచేసే బీజేపీ ఎన్నికలకోసం వాడుకోవడం సిగ్గు చేటైన విషయం. విగ్రహాలపైన సూర్యకాంతి ప్రసరింపచేయడం దేశంలో కొత్త ఏమి కాదు ఎల్లోరా గుహల్లోని 10వ గుహలో ధర్మచక్రముద్రలో వున్న బుద్ధుడి ముఖంపై కాంతి ప్రసరించే ఏర్పాటు 7వ శతాబ్దంలో ఏర్పాటు చేశారు. సైన్స్‌ను ఉపయోగించుకొని రాతి విగ్రహాలను అద్భుత మహత్తులుగా ప్రచారం చేస్తున్నారు. గుడి నిర్మాణానికి అవసరమైన సైన్స్ అండ్ టెక్నాలజీని మనుషులు సృష్టించిందే. ఆ గుడి మీద వచ్చే ప్రత్యక్ష, పరోక్ష ఆర్థిక లాభం పొందేది మాత్రం పురోహితులు, వ్యాపారులు. గుడిపేరుతో రాజకీయ వ్యాపారం చేసేది బీజేపీ. గుడి పేరుతో ఆర్థిక రాజకీయ, సాంస్కృతిక దోపిడికి గురయ్యేది మాత్రం శ్రామిక ప్రజలు. మత బోధనలన్నీ శాస్త్ర, సాంకేతిక విజ్ఞానానికి వ్యతిరేకమైనవే. శ్రామిక ప్రజలను మతం అనే మత్తులో ముంచుతున్నారు. దోపిడీని ప్రశ్నించకుండా ప్రజలు ఐక్యం కాకుండా చేయడం అనే లక్ష్యం దాగి ఉన్నది.

ప్రజాసైన్స్ వేదిక రాష్ట్ర అధ్యక్షులు

భారీ వర్షాలు...

కొట్టుకుపోయిన చైనా సరిహద్దు హైవే

ఈటానగర్: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో అరుణాచల్‌ప్రదేశ్‌లో భారీ కొండచరియాలు విరిగిపడ్డాయి. భారీ వర్షాలతో బుధవారం దిబాంగ్ వ్యాలీ జిల్లాలోని జాతీయ రహదారి-33పై ముస్లీ, అనిని ప్రాంతాల మధ్య భారీగా కొండచరియాలు విరిగిపడినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో జాతీయ రహదారిపై కొంత భాగం కొట్టుకుపోయి పెద్ద గుంత ఏర్పడింది. చైనా సరిహద్దులోని దిబాంగ్ వ్యాలీ జిల్లాకు భారత్‌లోని ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయాయి. దేశంలో ఇతర ప్రాంతాల నుంచి దిబాంగ్ వ్యాలీ వెళ్లేందుకు ఇదొక్కటే మార్గం కావడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే రంగంలోకి దిగిన నేషనల్ హైవేస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ సిబ్బంది జాతీయ రహదారి మరమ్మతులకు చర్యలు చేపట్టారు. ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. అత్యవసర సేవలు, వస్తువులకు ఎటువంటి అంతరాయం లేదని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ట్రావెల్ అడ్వైజరీని విడుదల చేసింది. హైవే పునరుద్ధరణ పనుల కోసం మూడు రోజుల సమయం పడుతుందని పేర్కొంది. నేషనల్ హైవే-33 దిబాంగ్ వ్యాలీ జిల్లా ప్రజలకు, ఆర్మీకి చాలా కీలకం.

వక్రీకరణ ఆపండి

- 'న్యాయ పత్ర' వివరిస్తా... సమయం ఇవ్వండి
- ప్రధాని మోదీకి ఖర్గే లేఖ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. తమ పార్టీ 'న్యాయ పత్ర' గురించి వ్యక్తిగతంగా వివరించడానికి సమయం కోరారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన కాంగ్రెస్ మేనిఫెస్టోలో కూడా రాయని విషయాల గురించి మీ సలహాదారులు మీకు తప్పుడు సమాచారం ఇస్తున్నారని ఆయన తన రెండు పేజీల లేఖలో ప్రధానికి తెలిపారు. యువకులు, మహిళలు, రైతులు, కార్మికులు, అన్ని కులాలు, వర్గాలలో అట్టడుగున ఉన్న ప్రజలకు న్యాయం అందించడమే కాంగ్రెస్ 'న్యాయ్ పత్ర' లక్ష్యమని ఆయన వివరించారు. 'సందర్భోచితంగా వ్యక్తీకరించిన కొన్ని పదాలు తీసుకుని మతపరమైన విభజనను సృష్టించడం మీ అలవాటుగా మారింది. ఈ విధంగా మాట్లాడి కుర్చీ పరువు దిగజార్చుతున్నారు' అని కాంగ్రెస్ అధ్యక్షుడు ఆ లేఖలో పేర్కొన్నారు. 'మా మేనిఫెస్టోలో కూడా రాయని విషయాల గురించి మీ సలహాదారులు మీకు తప్పుడు సమాచారం ఇస్తున్నారు. మా 'న్యాయ్ పత్ర' గురించి వివరించడానికి మిమ్మల్ని వ్యక్తిగతంగా కలవడం ఎక్కువ సంతోషాన్నిస్తుంది. తద్వారా దేశ ప్రధాన మంత్రిగా మీరు తప్పుడు ప్రకటనలు చేయలేరు' అని ఖర్గే తెలిపారు. ప్రధాని మోదీ ఇటీవలి ప్రసంగాలలో ఉపయోగించిన భాష చూసి తాను ఆశ్చర్యపోవడం లేదా దిగ్భ్రాంతికి గురికాలేదని కాంగ్రెస్ అధ్యక్షుడు అన్నారు. 'మొదటి దశ ఎన్నికల్లో బీజేపీ దీనావస్థను చూసిన తర్వాత మీరు, మీ పార్టీకి చెందిన ఇతర నేతలు ఈ విధంగా మాట్లాడతారని ఊహించాం. కాంగ్రెస్ అణగారిన పేదలు, వారి హక్కుల గురించి మాట్లాడుతోంది. మీకు, మీ ప్రభుత్వానికి పేదలు, నిర్వాసితుల పట్ల ఎటువంటి శ్రద్ధ లేదని మాకు తెలుసు' అని ఆయన అన్నారు. 'మీ 'సూట్-బూట్ కి సర్కార్' అనేది మీరు పన్నులు తగ్గించిన కార్పొరేట్ల కోసం పని చేస్తుంది. అయితే వేతన జీవులు ఎక్కువ పన్నులు చెల్లిస్తారు. పేదలు ఆహారం, ఉప్పు పై కూడా జీఎస్‌టీ చెల్లిస్తున్నారు. ధనవంతులు జీఎస్‌టీ వాపసులను పొందుతారు. అందుకే మేము ధనిక, పేదల మధ్య అసమానత గురించి మాట్లాడేటప్పుడు మీరు ఉద్దేశపూర్వకంగా హిందూ, ముస్లింలతో సమానం చేస్తున్నారు' అని ఖర్గే విమర్శించారు. 'మా మేనిఫెస్టో భారతదేశ ప్రజల కోసం వారు హిందూ, ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైను లేదా బౌద్ధులు అయినా. స్వాతంత్ర్యానికి ముందు మీ మిత్రులైన ముస్లిం లీగ్, వలస వాదులను మీరు ఇంకా మరచిపోలేదని నేను భావిస్తున్నాను' అని ఆయన ఆరోపించారు.



ఎన్నికలు మోదీ చేజారాయి: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : తమ పార్టీ హామీలు, 'మోదీ గ్యారంటీ' మధ్య స్పష్టమైన వ్యత్యాసం ఉందని, ఎన్నికలు తన చేతుల్లోంచి జారిపోయాయని ప్రధాని నరేంద్ర మోదీకి తెలుసునని కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ గురువారం అన్నారు. ఒక 'భారతీయుల ప్రభుత్వం' కు కాంగ్రెస్ హామీ ఇస్తుందని 'ఎక్స్' లో హిందీలో చేసిన ఒక పోస్ట్‌లో తెలిపారు. కాంగ్రెస్ చేసిన కొన్ని వాగ్దానాలను జాబితా చేస్తూ, మహిళలకు నెలకు రూ.8,500 చొప్పున, యువతకు సంవత్సరానికి రూ.లక్ష వేతనంతో కూడిన ఉద్యోగం, 30 లక్షల ఉద్యోగ ఖాళీలకు నియామకాలు, రైతులకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) అందిస్తామని చెప్పారు. 'మోదీ హామీ : అదానీల ప్రభుత్వం - కోటీశ్వరుల జేబుల్లో దేశ సంపద, విరాళాల వ్యాపార దోపిడీ ముఠా, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ముగింపు, ఆర్థిక కొరత ఎదుర్కొంటున్న రైతులు... తేడా స్పష్టంగా ఉంది!' అని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశంలో కోట్లాది మంది కోటీశ్వరులను సృష్టిస్తుందన్నారు. కాగా, బుధవారం అమరావతిలో ఒక ర్యాలీని ఉద్దేశించి రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ, పదేళ్ల మోదీ పాలనలో 16 లక్షల కోట్ల రూపాయల రుణమాఫీ నేపథ్యంలో 22 నుంచి 25 మంది మాత్రమే బిలియనీర్లు అయ్యారని, అయితే 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే కోట్లాది మంది ప్రజలు 'మిలియనీర్లు' అవుతారని తెలిపారు. ప్రపంచంలో ఏ శక్తి కూడా భారత రాజ్యాంగాన్ని మార్చలేదని స్పష్టం చేశారు. అయితే బీజేపీ రాజ్యాంగాన్ని మార్చాలనుకుంటోందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు.

కాంగ్రెస్ 'మత' రిజర్వేషన్లు

ఎన్నికల ప్రచారంలో మోదీ ఆరోపణలు

మొరేనా/ఆగ్రా: మత ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వడాన్ని బాబాసాహెబ్ అంబేద్కర్ కూడా వ్యతిరేకించారని, కానీ, కాంగ్రెస్ మాత్రం వక్రమార్గంలో వాటిని అమలుచేసి ఆయనకు వెన్నుపోటు పొడిచిందని ప్రధాని మోదీ ఎదురుదాడి చేశారు. తనను దుర్భాషలాడుతూ రాహుల్ గాంధీ ఆనందిస్తున్నారని, అయినప్పటికీ ఆయనపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేయకూడదన్నారు. మధ్యప్రదేశ్‌లోని మొరేనా, యూపీలోని ఆగ్రాలో జరిగిన వేర్వేరు ఎన్నికల ప్రచార సభల్లో గురువారం మాట్లాడిన మోదీ... కాంగ్రెస్‌పై మరోసారి అవే విమర్శలు చేశారు. రాహుల్, అఖిలేశ్‌పై మండిపడ్డారు. 'కర్ణాటకలో కాంగ్రెస్ అనేకమంది ముస్లింలను అక్రమంగా ఓబీసీ జాబితాలో చేర్చింది. దేశ వనరులు తొలుత ముస్లింలకే చెందుతాయని కాంగ్రెస్ ప్రకటిస్తుంటే... వాటిపై పేద ప్రజలకే మొదటి హక్కు ఉందని నేను చెబుతున్నా. మతపరంగా ఎటువంటి వివక్ష లేకుండా 80 కోట్ల మందికి బీజేపీ ప్రభుత్వం ఉచితంగా రేషన్ అందించింది. ప్రజల భవిష్యత్తుతో ఆడుకుంటూ... ఎలాగైనా అధికారం దక్కించుకోవాలని కాంగ్రెస్ ఆటలాడుతోంది. వాళ్లు అధికారంలోకి వస్తే 'వారసత్వ పన్ను' పేరుతో ప్రజల నుంచి సగానికి పైగా ఆస్తిని దోచుకుంటుంది' అని మధ్యప్రదేశ్‌లో జరిగిన సభలో మోదీ పేర్కొన్నారు. 'మహిళల ఆస్తులపై కాంగ్రెస్ కన్ను పడింది. వాళ్లు అధికారంలోకి వస్తే వారసత్వ పన్ను పేరుతో ప్రజల సంపదను దోచుకుంటుంది. కానీ, నేను వాటికి కాపలాగా ఉన్నా. యూపీలో ఇద్దరు అబ్బాయిలు (రాహుల్-అఖిలేశ్) బుజ్జగింపు రాజకీయాలు చేస్తున్నారు. మత ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇచ్చి ఓబీసీ కోటాను తస్కరించాలని కాంగ్రెస్ చూస్తోంది. కాంగ్రెస్ మేనిఫెస్టో ముస్లిం లీగ్ స్వభావాన్ని ప్రతిబింబిస్తోంది. అంతర్జాతీయస్థాయిలో భారత్ ఎదగడం కొన్ని శక్తులకు ఇష్టం లేదు. బీజేపీకి దేశం కంటే ఏదీ ముఖ్యం కాదు. కాంగ్రెస్‌కు మాత్రం వారి కుటుంబమే ప్రధానం' అని ఆగ్రా సభలో కాంగ్రెస్‌పై మోదీ విమర్శలు చేశారు.

హెల్త్ లేబుల్ తొలగించిన బూస్ట్, హార్లిక్స్

న్యూఢిల్లీ: తమ ఉత్పత్తులైన హార్లిక్స్, బూస్ట్‌లపై హెల్త్ లేబుల్‌ను తొలగించినట్లు హిందుస్థాన్ యునీలివర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్) గురువారం ప్రకటించింది. 'ఫంక్షనల్ అండ్ న్యూట్రిషనల్ డ్రింక్స్'ల స్థానానికి మార్చినట్లు తెలిపింది. అన్ని డ్రింకులు, రుచికరమైన పానీయాలను తమ వెబ్‌సైట్‌లలో హెల్త్ కేటగిరీ నుండి తొలగించాలని వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఇ-కామర్స్ వెబ్‌సైట్స్‌ను ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ డ్రింక్స్‌లో చక్కెర శాతం ఆమోదయోగ్యమైన పరిమితి కన్నా చాలా అధికంగా ఉన్నట్లు కేంద్రం తెలిపింది. నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (ఎన్‌సీపీసీఆర్) విచారణ అనంతరం క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ) చట్టం 2005 ప్రకారం.. హెల్త్ డ్రింక్స్ కేటగిరీలోకి రావని ఏప్రిల్ 10న జారీ చేసిన ఉత్తర్వుల్లో మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ నెల ప్రారంభంలో డైరీ ఉత్పత్తులు, మాల్ట్‌కి చెందిన పానీయాలను హెల్త్ కేటగిరీలో చేర్చకూడదని ఎఫ్ఎస్ఎస్ఏఐ ఇ-కామర్స్ సంస్థలను హెచ్చరించింది. గతేడాది బోర్న్‌విటాలో అధికస్థాయి చక్కెర వినియోగిస్తున్నారని ఎన్‌సీపీసీఆర్ హెచ్చరించిన సంగతి తెలిసిందే.

మోదీ సర్కార్ నిర్వాకంతో నిరుద్యోగం తీవ్రతరం: మిసా భారతి

పాట్నా: ప్రధానిగా రెండుసార్లు అవకాశం వచ్చినా నరేంద్ర మోదీ దేశ ప్రజలకు ఎలాంటి మేలు చేయలేదని ఆర్జేడీ నేత, పాటలీపుత్ర నుంచి ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచిన మిసా భారతి ఆరోపించారు. నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉన్నా ఉపాధి కల్పన కోసం ప్రధాని మోదీ ఎలాంటి చర్యలూ చేపట్టలేదని అన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న మోదీ ఆ పనిచేయలేదని మండిపడ్డారు. బీహార్‌లో ఎలాంటి కొత్త పరిశ్రమలు రాలేదని, ఉపాధి లేక ఇక్కడి యువత వలస బాట పట్టారని అన్నారు. ఆర్మీలో నియామకాల కోసం చేపట్టిన అగ్నివీర్ పథకంఎలా ఉందో అందరూ చూస్తున్నారని చెప్పారు. బీజేపీ పాలనపై విసిగి వేసారిన ప్రజలు ఇండియా కూటమి వైపు చూస్తున్నారని, బీహార్‌లో మహా కూటమి ఘనవిజయం సాధిస్తుందని ధీమా వ్యక్తంచేశారు. లోక్‌సభ ఎన్నికల్లో విపక్ష ఇండియా కూటమికి అనుకూల పవనాలు వీస్తున్నాయని చెప్పారు. మోదీ సర్కార్ అన్ని రంగాల్లో విఫలమైందని ఆమె విమర్శలు గుప్పించారు.

అమెరికా నివేదిక తప్పుల తడక: భారత్

న్యూఢిల్లీ: దేశంలో మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందన్న అమెరికా నివేదికను భారత్ గురువారం తిరస్కరించింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ వారంలో నిర్వహించే మీడియా సమావేశంలో ఈ నివేదికపై విలేకరులు ప్రశ్నించగా...ఇది తీవ్ర పక్షపాతంతో కూడుకున్నదని, దేశంపై సరైన అవగాహన లేదనడానికి నిదర్శనమని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. ఆ నివేదికకు ఎటువంటి విలువ లేదని, మీరు కూడా పట్టించుకోవద్దని మీడియాకు సూచించారు. గతేడాది మణిపూర్‌లో హింసాకాండ చెలరేగిన తర్వాత తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందని అమెరికా విదేశాంగశాఖ '2023 కంట్రీ రిపోర్ట్స్ ఆన్ హ్యూమన్ రైట్స్ ప్రాక్టీసెస్: ఇండియా' పేరిట ఇటీవల ఓ నివేదిక విడుదల చేసింది. మైతేయి, కుకీ కమ్యూనిటీల మధ్య చెలరేగిన ఘర్షణలో పెద్ద ఎత్తున మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందని ఆ నివేదికలో పేర్కొంది. ఈ ఘటనను ప్రధాని మోదీ సిగ్గుచేటని అభివర్ణించడంతో పాటు నివేదికపై విచారణకు ఆదేశించారని పేర్కొంది. జమ్మూకశ్మీర్‌లో జర్నలిస్టులు, మానవ హక్కుల కార్యకర్తలు విచారణను ఎదుర్కొన్నట్లు అనేక నివేదికలు స్పష్టం చేశాయని తెలిపింది.

కాలుష్య కోరల్లో షిప్రా నది

మురుగు నీటిలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి స్నానం



భోపాల్: ప్రజా సమస్యలపై ప్రతిపక్ష నేతలు నిరసన తెలపడం సర్వసాధారణమే అయినా...కొంతమంది వినూత్నంగా నిరసనలు చేస్తారు. తాజాగా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కూడా సమస్య పరిష్కారానికి డిమాండ్ చేస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. సంబంధిత వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. మధ్యప్రదేశ్‌లోని ప్రధాన నదుల్లో షిప్రా ఒకటి. ఈ నదితో లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. తాగునీటిని అందిస్తున్నారు. అయితే నదీ తీరంలో పరిశ్రమలు, పట్టణాలు పుట్టుకురావడం... అవి వెదజల్లే కలుషితాలను నదిలోకి వదిలేయడంతో నీరు దుర్గంధభరితంగా మారుతోంది. దీంతో ఆ నీరు ఎందుకు పనికి రాకుండా సముద్రంలో కలుస్తున్నాయి. ఈ సమస్యపై అధికార బీజేపీకి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవట్లేదని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. కాగా, ఉజ్జయిని లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉన్న మహేశ్ పర్మార్... ప్రభుత్వానికి వినూత్న రీతిలో నిరసన తెలిపాలని భావించారు. తొలుత కలుషిత నీరు వస్తున్న కాలువలో కూర్చున్నారు. అనంతరం నదిలోకి దిగి స్నానం చేసి... ప్రభుత్వానికి నిరసనను తెలియజేశారు. ఎన్నికలు వచ్చినప్పుడే బీజేపీ నదిని శుభ్రం చేయిస్తామని హామీ ఇస్తుందని, తరువాత పట్టించుకోదని మహేశ్ ఆరోపించారు. షిప్రా నదిలో కలుషితాలు కలవకుండా అరికట్టాలని, నది స్వచ్ఛతను కాపాడాలని ప్రభుత్వానికి విన్నవించారు. షిప్రా నది పరిశుభ్రత కోసం ఉజ్జయిని ప్రజలు పోరాడాలని మహేశ్ కోరారు. 'గత 10 ఏళ్లుగా కేంద్రంలో, మధ్యప్రదేశ్‌లో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉంది. పార్లమెంట్ సభ్యులు, మంత్రులు, ఎమ్మెల్యేలకు నది కాలుష్యంపై ఎన్నిసార్లు వివరించినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అభివృద్ధి గురించి మాట్లాడే బీజేపీ ఇంత జరుగుతున్నా పట్టించుకోకపోవడం ఏమిటి' అని మహేశ్ పర్మార్ ప్రశ్నించారు.

527 ఆహార ఉత్పత్తుల్లో క్యాన్సర్ కారకాలు

న్యూఢిల్లీ: భారత్‌లో తయారైన దాదాపు 527 ఆహార ఉత్పత్తుల్లో క్యాన్సర్‌కు దారితేసే కారకాలు ఉన్నట్లు రాపిడ్ అలర్ట్ సిస్టమ్ ఫర్ ఫుడ్ అండ్ ఫీడ్ (ఆర్‌ఏఎస్ఎఫ్ఎఫ్) డేటా ప్రకారం నిర్ధారణ అయినట్లు యూరోపియన్ ఫుడ్ సేఫ్టీ అథారిటీ (ఈఎఫ్ఎస్ఏ) అధికారులు తెలిపారు. భారత బ్రాండ్లైన ఎవరెస్ట్, ఎండీహెచ్ ఉత్పత్తుల్లో ఇథిలీన్ ఆక్సైడ్ అనే క్యాన్సర్ కారకం ఉందని ఈఎఫ్ఎస్ఏ గుర్తించింది. దాంతో హాంకాంగ్, సింగపూర్‌ల్లో వాటి ఉత్పత్తులపై నిషేధం విధించినట్లు వార్తలు వచ్చాయి. అయితే 2020 సెప్టెంబరు నుంచి 2024 ఏప్రిల్ మధ్యకాలంలో ఈ 527 ఉత్పత్తుల్లో 87 సరుకులను ఇతర దేశాలు తిరస్కరించినట్లు కొన్ని మీడియా కథనాల ద్వారా తెలిసింది. వీటిలో 332 ఉత్పత్తుల్లో భారత్‌లోనే తయారైన హానికర రసాయనాలను వినియోగించినట్టు తేలింది. మిగతావాటిలో వాడిన రసాయనాలు ఎక్కడివో తెలియాల్సి ఉంది. ఇథిలీన్ ఆక్సైడ్ వాస్తవానికి వైద్య పరికరాలపై క్రిములను చంపడానికి, వాటిని శుభ్రం చేయడానికి వాడుతారు. పురుగుమందు, స్టెరిలైజింగ్ ఏజెంట్‌గా వినియోగిస్తారు. దీన్ని ఆహార ఉత్పత్తుల్లో వాడడంతో లింఫోమా, లుకేమియా క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని తేలింది. రామయ్య అడ్వాన్స్‌డ్ టెస్టింగ్ ల్యాబ్స్‌లోని చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న జుబిన్ జార్జ్ జోసెఫ్ ఇథిలీన్ ఆక్సైడ్ ఉప ఉత్పత్తుల వల్ల కలిగే ప్రమాదాల గురించి తెలిపారు. ఇథిలీన్ ఆక్సైడ్ ఉపఉత్పత్తి అయిన ఇథిలీన్ గ్లైకాల్ చాలా ప్రమాదమని చెప్పారు. దీన్ని గతంలో దగ్గు సిరప్‌ల్లో వాడడం వల్ల ఆఫ్రికాలో మరణాలు చోటుచేసుకున్నాయని గుర్తు చేశారు. ఇప్పటికే ఇథిలీన్ ఆక్సైడ్ కలిగిన ఆహార పదార్థాలను తీసుకున్న వారికి గామా కిరణాలతో చికిత్స అందించాలన్నారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వంటి ప్రభుత్వ సంస్థలు అధ్యయనాలు నిర్వహించాలని కోరారు.

మద్యం స్కామ్‌లో ప్రధాన లబ్ధిదారు ఆప్

సుప్రీంకు తెలిపిన ఈడీ

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణంలో సృష్టించిన నేరాల ఆదాయానికి ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) 'ప్రధాన లబ్ధిదారు' అని, ఆ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ద్వారా మనీ లాండరింగ్ నేరానికి పాల్పడినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గురువారం సుప్రీం కోర్టుకు తెలిపింది. ఇప్పటివరకు జరిగిన దర్యాప్తులో నేరాలకు సంబంధించి కొంత భాగం బయటపడిందని ఈడీ పేర్కొంటూ, నగదు మొత్తం రూ.45 కోట్లు ఆప్ 2022 గోవా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఉపయోగించినట్లు తెలిపింది. ఇదిలాఉండగా, అత్యున్నత న్యాయస్థానంలో ఈడీ దాఖలు చేసిన అఫిడవిట్‌పై ఆప్ స్పందిస్తూ, దర్యాప్తు సంస్థ 'అబద్ధాలు చెప్పే యంత్రంగా' మారిందని ఆరోపించింది. ఆరోపించిన మద్యం పాలసీ కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టులో దాఖలు చేసిన ప్రత్యుత్తర అఫిడవిట్‌లో గోవాలో ఆప్ ప్రచారానికి సంబంధించిన కార్యకలాపాలలో నిమగ్నమైన వివిధ వ్యక్తుల ప్రకటనలు సర్వే వర్కర్లుగా, ఏరియా, మేనేజర్లుగా, అసెంబ్లీ మేనేజర్లుగా వారు చేసిన పనికి నగదు చెల్లింపులు చేసినట్లు వివరించింది. 'ఈ విధంగా, ఆప్... అరవింద్ కేజ్రీవాల్ ద్వారా మనీ లాండరింగ్ నేరానికి పాల్పడింది. ఆ నేరాలు సెక్షన్ 70, పీఎంఎల్‌ఏ 2002 పరిధిలోకి వస్తాయి' అని ఈడీ తెలిపింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం, 2002 (పీఎంఎల్ఏ) లోని సెక్షన్ 70 కంపెనీల నేరాలకు సంబంధించినది. ఆప్ అనేది ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 29-ఎ కింద నమోదయిన వ్యక్తుల సంఘంతో కూడిన రాజకీయ పార్టీ అని ఈడీ తెలిపింది. 1951 చట్టంలోని సెక్షన్ 29-ఎ ప్రకారం భారతదేశ పౌరుల సంఘం లేదా సంఘం మాత్రమే రాజకీయ పార్టీగా నమోదు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఆప్ అటువంటి వ్యక్తుల సంఘం అయినందున ఆ చట్టం కింద, మరీ ముఖ్యంగా సెక్షన్ 29-ఎ కింద నమోదయి ఉందని ఈడీ పేర్కొంది. ఆప్ అనేది వ్యక్తుల సంఘం అయినందున 2002లోని సెక్షన్ 70 ప్రకారం ఇది 'కంపెనీ' నిర్వచనం పరిధిలోకి వస్తుంది' అని వివరించింది. ఆప్ జాతీయ కన్వీనర్‌గా, జాతీయ కార్యవర్గ సభ్యునిగా కేజ్రీవాల్ ఎన్నికల్లో ఉపయోగిస్తున్న నిధులకు అంతిమంగా బాధ్యత వహించాలని పేర్కొంది. 'ఆప్ ప్రధాన కార్యకలాపాలను కేజ్రీవాల్ నియంత్రిస్తున్నారు. మద్యం పాలసీని నిర్ణయించడంలో కూడా ఆయన పాలుపంచుకున్నారని సాక్షుల వాంగ్మూలాల ద్వారా తెలుస్తోంది. అతను ముడుపుల డిమాండ్‌లో కూడా నిమగ్నమై ఉన్నాడు. ఇది నేరానికి సంబంధించి తదుపరి ఆదాయాలను సృష్టించే విధంగా ఉంది' అని తెలిపింది. 'అందువల్ల ఆప్ మాత్రమే కాదు, అరవింద్ కేజ్రీవాల్ కూడా పీఎంఎల్‌ఏలోని సెక్షన్ 4 ప్రకారం శిక్షార్హమైన నేరాలకు పాల్పడినట్లుగా పరిగణించడం జరుగుతుంది. పీఎంఎల్‌ఏలోని సెక్షన్ 70 కింద అందించిన విధంగా విచారణ తర్వాత శిక్షించబడతారు' అని పేర్కొంది. పీఎంఎల్‌ఏకు చెందిన ఉల్లంఘన, ముఖ్యంగా చట్టంలోని సెక్షన్ 4 ప్రకారం శిక్షార్హమైన నేరాలు 'అతని ప్రమేయంతోనే జరిగాయని అటువంటి ఉల్లంఘనను నిరోధించడానికి అతను ఏ సమయంలోనూ శ్రద్ధ వహించలేదని' దర్యాప్తు సంస్థ ఆరోపించింది. తాను ఢిల్లీ ముఖ్యమంత్రి కూడా అనే వాస్తవాన్ని సద్వినియోగం చేసుకుని, పీఎంఎల్‌ఏలోని సెక్షన్ 4 కింద 'కంపెనీ' అంటే ఆప్ ద్వారా శిక్షార్హమైన మనీ లాండరింగ్ నేరాన్ని సులభతరం చేయడానికి ఆయన ఆ పదవిని ఉపయోగించారు. పార్టీ, రోజువారీ వ్యవహారాలలో అతని పాత్ర, చురుకైన ప్రమేయం కారణంగా తన అరెస్టును సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను 'అర్హత లేనిదని' ఈడీ పేర్కొంది. కాగా, ఈడీ బలవంతపు చర్య నుంచి రక్షణ కల్పించేందుకు ఢిల్లీ హైకోర్టు నిరాకరించిన కొన్ని గంటల తర్వాత, మార్చి 21న కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేసింది.

ప్రస్తుతం ఆయన జ్యుడీషియల్ కస్టడీ కింద తీహార్ జైలులో ఉన్నారు. ఏప్రిల్ 15న ఈ కేసులో తన అరెస్టును సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై ఏప్రిల్ 24లోగా ఈడీ ప్రతిస్పందనను అత్యున్నత న్యాయస్థానం కోరింది. క్రేజీవాల్ పిటిషన్‌ను సుప్రీం కోర్టు వచ్చే వారం విచారణకు స్వీకరించే అవకాశం ఉంది.

పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోండి

ఈసీకి అధీర్ చౌదరి లేఖ

కోల్‌కతా: సార్వత్రిక ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతున్న తరుణంలో పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ చీఫ్, బహరంపూర్ లోక్‌సభ అభ్యర్థి అధీర్ రంజన్ చౌదరి ప్రధాన ఎన్నికల కమిషన్ రాజీవ్ కుమార్‌కు రెండు పేజీల లేఖ రాశారు. బహరంపూర్ పోలీసు అధికారులు కాంగ్రెస్ కార్యకర్తలను వేధిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. ఉద్దేశ్యపూరితంగానే వారు కార్యకర్తలను ఇబ్బందిపెడుతున్నట్లు వెల్లడించారు. వారిపైన తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు తీసుకుంటున్న చర్యలు పార్టీ కార్యకర్తలను నిరుత్సాహపరుస్తాయని అన్నారు. నా ఎన్నికల ప్రచారానికి ఆటంకం కలిగించడానికి ఇది ప్రణాళిక అని కూడా పేర్కొన్నారు. తన కార్యకర్తలను మాత్రమే కాకుండా సన్నిహితులను కూడా పోలీసు అధికారులు వేధిస్తున్నారని చెప్పారు. అధీర్ రంజన్ చౌదరి కంచుకోట అయిన బహరంపూర్ నియోజకవర్గం నుంచి మళ్లీ బరిలోకి దిగారు. ఆయనకు ప్రత్యర్థిగా టీఎంసీ యూసఫ్ పఠాన్‌ను ఎంపిక చేసింది. దీంతో ఇప్పటికే బహరంపూర్ నుంచి ఐదుసార్లు గెలిచిన చౌదరితో... యూసఫ్ పఠాన్ తలపడనున్నారు.

మరోసారి తెరపైకి ఫోన్ ట్యాపింగ్

గెహ్లోత్‌పై మాజీ ఓఎస్డీ లోకేశ్‌శర్మ సంచలన వ్యాఖ్యలు



జైపూర్: లోక్‌సభ ఎన్నికల వేళ రాజస్థాన్ రాజకీయం రసవత్తరంగా మారింది. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన ఫోన్ ట్యాపింగ్ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ కేసులో మాజీ సీఎం అశోక్ గెహ్లోత్‌పై అతడి మాజీ ఓఎస్డీ లోకేశ్ శర్మ సంచలన వ్యాఖ్యలు చేశారు. దీంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఫోన్ ట్యాపింగ్, రీట్ (రాజస్థాన్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) పరీక్ష పేపర్ లీక్ వ్యవహారాల్లో గెహ్లోత్‌పై లోకేశ్ శర్మ కీలక వ్యాఖ్యలు చేశారు. ఒక రోజు తనకు సీఎం పీఎస్ఓ రాం నివాస్ నుంచి ఫోన్ వచ్చిందని, సీఎం గెహ్లోత్ నివాసానికి రావాలని చెప్పారన్నారు. అక్కడకు వెళ్లగా కొన్ని ఆడియో క్లిప్‌లతో కూడిన పెన్ డ్రైవ్‌ను గెహ్లోత్ తనకు అందజేశారని, ఆ తర్వాత అవి మీడియాకు లీక్ అయ్యాయని చెప్పారు. అవి ఫోన్ సంభాషణలు అని తనకు చెప్పారని, అయితే అవి చట్టబద్ధమైనవో కాదో తనకు తెలియదని పేర్కొన్నారు. తనను ఒక హోటల్‌కు పిలిపించి వీటి గురించి మాట్లాడినట్టు చెప్పుకొచ్చారు. రీట్ పేపర్ లీక్ వ్యవహారంలో తన సన్నిహితులకు అశోక్ గెహ్లోత్ రక్షణ కల్పించారని శర్మ ఆరోపించారు. ఇదిలా ఉండగా, ఆడియో సంభాషణను లోకేశ్‌శర్మ లీక్ చేశారంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసుపై ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు చేస్తోంది. ఇదివరకే లోకేశ్ శర్మను విచారణకు పిలిచి ప్రశ్నించారు. లోకేశ్ శర్మ ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నారు. అయితే, ఈ విషయంపై గెహ్లోత్‌పై లోకేశ్ శర్మ పరువు నష్టం దావా వేశారు. ఈ ఆరోపణలపై అశోక్ గెహ్లోత్ ఇప్పటివరకు స్పందించలేదు. అయితే 2020 జూలైలో కాంగ్రెస్ సీనియర్ నేత సచిన్ పైలట్ మొత్తం 19 మంది ఎమ్మెల్యేలతో అశోక్ గెహ్లోత్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేశారు. ఆ సమయంలో ఎమ్మెల్యేలుగా ఉన్న విశ్వేంద్ర సింగ్, భన్వర్ లాల్ శర్మ వంటి తిరుగుబాటు ఎమ్మెల్యేల ఫోన్ సంభాషణ లీక్ అయింది. తిరుగుబాటు ఎమ్మెల్యే భన్వర్ లాల్, కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ మధ్య జరిగిన సంభాషణ ఆడియో క్లిప్ కూడా వీటిలో ఉంది. ఈ క్రమంలో అశోక్ గెహ్లోత్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ ప్రయత్నించిందంటూ రాజకీయంగా పెను దుమారం రేగింది. కాగా, లోకేశ్ శర్మ ఆరోపణలను కాంగ్రెస్ నేతలు ఖండిస్తున్నారు. తాజాగా శర్మ వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధికార ప్రతినిధి స్వర్ణిమ్ చతుర్వేదీ స్పందిస్తూ... లోకేశ్ శర్మ ప్రభుత్వ అధికారి కాదు. పైగా అతడు బీజేపీ నాయకులతో టచ్‌లో ఉన్నాడు. వారి సూచనలు మేరకు మాత్రమే అతడు ఇలాంటి ఆరోపణలు చేశాడని చెప్పుకొచ్చారు. రాజస్థాన్‌లో లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో శర్మ వ్యాఖ్యలు కాంగ్రెస్‌కు నష్టం కలిగిస్తాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

పాట్నాలో ఆరుగురు సజీవదహనం

పాట్నా: బీహార్ రాజధాని పాట్నాలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. పాట్నా జంక్షన్ రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ హోటల్‌లో గురువారం ఉదయం ఒక్కసారిగా భారీ ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ దుర్ఘటనలో సుమారు ఆరుగురు ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. పాట్నాలోని రైల్వే జంక్షన్ ఎదురుగా ఉన్న పాల్ హోటల్ భవనంలో మంటలు చెలరేగినట్లు ఉదయం 11 గంటలకు తమకు సమాచారం అందినట్లు అగ్నిమాపక శాఖ డీఐజీ మృత్యుంజయ్ కుమార్ తెలిపారు. వెంటనే ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

హోటల్ నుంచి సుమారుగా 20 మందిని కాపాడినట్లు తెలిపారు. సిలిండర్ పేలడంతో ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

మేనిఫెస్టోలో వారసత్వ పన్ను ఊసే లేదు: జైరాం రమేశ్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ మేనిఫెస్టోలో వారసత్వ పన్ను గురించి ఎలాంటి ప్రస్తావన లేదని సీనియర్ కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ స్పష్టం చేశారు. 1985లో అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ వారసత్వ పన్ను రద్దు చేశారని గుర్తుచేశారు. వారసత్వ పన్ను తమ మేనిఫెస్టోలో లేదని, ఇది తమ అజెండాలోనూ లేదని జైరాం రమేశ్ తేల్చిచెప్పారు. తామెన్నడూ వారసత్వ పన్ను గురించి మాటమాత్రం ప్రస్తావించలేదన్నారు. తమ మేనిఫెస్టోలో సంపద పున:పంపిణీ గురించి పొందుపరిచామని ప్రధాని మోదీ అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. 50 పేజీల తమ మేనిఫెస్టోలో సంపద పున:పంపిణీ గురించి ప్రస్తావన ఎక్కడ ఉందో వెల్లడించాలని మోదీకి సవాల్ విసిరారు. మోదీ కాంగ్రెస్ మేనిఫెస్టో గురించి అవాస్తవాలు మాట్లడుతున్నారని మండిపడ్డారు.

జంగాల, జొన్నాకు అపూర్వ ఆదరణ

- కమ్యూనిస్టులను ఆదరించండి... బీజేపీ, దాని తొత్తులను ఓడించండి
- ప్రచారంలో అభ్యర్థుల పిలుపు

విశాలాంధ్ర-తాడేపల్లి: అమరావతి రాజధానిని సాధించాలంటే బీజేపీ, దాని మిత్రపక్షాలైన టీడీపీ, జనసేన, వైసీపీని ఓడించాలని సీపీఎం, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ బలపరిచిన సీపీఐ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లిలో జంగాల అజయ్‌కుమార్, మంగళగిరి అసెంబ్లీ సీపీఎం అభ్యర్థి జొన్నా శివశంకర్ గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా ఉండవల్లి సుందరయ్య చౌక్ నుంచి ఎన్నికల ప్రచారాన్ని సీపీఎం నేత కాట్రగడ్డ శివరామకృష్ణయ్య జెండా ఊపి ప్రారంభించారు. జంగాల అజయ్‌కుమార్‌కి, జొన్న శివశంకర్‌కి ప్రజల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. డప్పులు, డీజేతో ప్రచారం హోరెత్తింది. జంగాలకు, జొన్నాకు మహిళలు హారతులు ఇచ్చి తిలకం దిద్ది స్వాగతం పలికారు. అభ్యర్థులు పాదయాత్రగా ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. దేశంలో మళ్లీ బీజేపీ గెలిస్తే మారణహోమం తప్పదని హెచ్చరించారు. మతాల మధ్య చిచ్చుపెట్టి తిరిగి అధికారంలోకి రావాలని ప్రధాని మోదీ కోరుకుంటున్నారని చెప్పారు. ప్రజాస్వామ్య, లౌకికవాదులంతా ఏకతాటిపైకి వచ్చి మోదీ కుట్రలకు అడ్డుకట్ట వేయాలన్నారు. రాష్ట్రంలో బీజేపీకి వంతపాడుతున్న టీడీపీ, వైసీపీ, జనసేనలను ఓడించాలన్నారు. టీడీపీ, వైసీపీ, బీజేపీ, జనసేన కూటమికి ఒక్క ఓటు కూడా వేయడానికి ప్రజలు సిద్ధంగా లేరని అన్నారు. గుంటూరు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న టీడీపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌కి కనీస రాజకీయ అనుభవం లేదని, రాజకీయాల్లోకి వచ్చి నెల రోజులు కూడా కాలేదని అన్నారు. చంద్రబాబు, జగన్‌మోహన్‌రెడ్డి, పవన్ కల్యాణ్ నిజస్వరూపాలను ప్రజలు తెలుసుకోవాలన్నారు. ఈ ఎన్నికల్లో తనను, జొన్నా శివశంకర్‌ను గెలిపించాలని కోరారు.

జొన్నా శివశంకర్ మాట్లాడుతూ ఉండవల్లి ప్రాంతంలో అనేక సమస్యలు ఉత్పన్నమౌతున్నాయని, ఉండవల్లి పంచాయతీని సీఆర్‌డీఏ పరిధిలోకి తెచ్చిన తర్వాత భూ సమీకరణ కింద భూములు తీసుకున్నారని అన్నారు.దీనివల్ల ప్రజలు ఇంటి నిర్మాణం కూడా చేసుకోలేకపోతున్నారని ఆరోపించారు. పన్నులు పెంచినా మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంటి పన్నుల భారాన్ని తగ్గిస్తామన్నారు. చెత్త పన్ను ఎత్తివేస్తామని అన్నారు. సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేడా హనుమంతరావు, నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, మంగళగిరి మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, తాడేపల్లి పట్టణ సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, సీనియర్ నాయకులు మానికొండ డాంగే, నరసింహారావు, సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, డివిజన్ నాయకులు ఈమని రామారావు, వి.వెంకటేశ్వరరావు, ఎం.భాగ్యరాజు, ఎస్‌కే ఎగ్రఫీరు, ఓలేటి శాంతి, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కె.జగదీశ్వర్‌రెడ్డి, గద్దం కృష్ణ, కుంభ ఆంజనేయులు, కె.శేషయ్య, బి.కోటేశ్వరరావు, దేవరకొండ శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు రెమెడిశెట్టి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఒకటినే ఇంటి వద్ద పెన్షన్లు ఇవ్వండి

రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: మే ఒకటవ తేదీనే పెన్షన్ల పంపిణీకి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సామాజిక పింఛనుదారులను ఇబ్బందులకు గురిచేయవద్దని సూచించారు. రాష్ట్రంలో 66 లక్షల మంది సామాజిక పెన్షన్‌దారులకు మే నెల 1వ తేదీన పెన్షన్ పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ఎండల తీవ్రత నానాటికీ పెరుగోతందని, వడగాడ్పులు వీస్తున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వృద్ధులు, వితంతు, వికలాంగ, చేనేత, మత్స్య, కళాకారులకు అందించే సామాజిక పెన్షన్ల పంపిణీలో వలంటీర్లను వినియోగించరాదని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించిందని తెలిపారు. ఏప్రిల్‌లో రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు చేపట్టకపోవడంతో పెన్షన్‌దారులు రోడ్లపై పడిగాపులు పడాల్సి వచ్చిందని గుర్తు చేశారు.

గత నెలలో సచివాలయాల వద్దకు రప్పించి, పెన్షన్‌ల పంపిణీ చేపట్టడంతో వృద్ధులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కోవడం, నగదు లేదనే సాకుతో సిబ్బంది పదేపదే తిప్పడం, మరణాలు సంభవించడం చూశామని తెలిపారు. ఏపీలో సచివాలయ సిబ్బంది దాదాపు 1,25,000 మంది విధులు నిర్వర్తిస్తున్న నేపథ్యంలో సచివాలయ, రెవెన్యూ సిబ్బందిని పెన్షన్ల పంపిణీ కోసం వినియోగించాలన్నారు. మే 1వ తేదీనే పెన్షన్లను ఇంటి వద్దే పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మే నెలలో అయినా పెన్షన్ల పంపిణీ ఆలస్యం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

పోలీస్ కమిషనర్‌గా రామకృష్ణ బాధ్యతల స్వీకారం

విశాలాంధ్ర-విజయవాడ (క్రైమ్): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగర పోలీస్ కమిషనర్‌గా పీహెచ్‌డీ రామకృష్ణ గురువారం బాధ్యతలు చేపట్టారు. తొలుత ఆయన కనకదుర్గమ్మను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కమిషనరేట్ కార్యాలయంలో సాయుధ బలగాల నుంచి గౌరవం వందనం స్వీకరించారు. 2001లో డీఎస్పీగా ఆయన ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నల్గొండ జిల్లా దేవరకొండ, వరంగల్‌జిల్లా పరకాల, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో డీఎస్పీగా పనిచేశారు. అడిషనల్ ఎస్పీగా తూర్పుగోదావరి, నల్గొండ జిల్లాల్లో విధులు నిర్వహించారు. ఎస్పీగా కౌంటర్ ఇంటిలిజెన్స్, స్పెషల్ ఇంటిలిజెన్స్ తదితర విభాగాలతో పాటు చిత్తూరు, గుంటూరు రూరల్, కడప, నెల్లూరు, గుంటూరు అర్బన్‌లో పనిచేశారు. 2020లో డీఐజీగా పదోన్నతి పొంది ఎస్ఈబీ డైరెక్టర్‌గా కర్తవ్యాన్ని నిర్వర్తించారు. ఏసీబీ అడిషనల్ డైరెక్టర్‌గా పనిచేస్తూ 2024 జనవరిలో ఐజీగా పదోన్నతి పొందారు. విజయవాడ నగర కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. డీసీపీలు కె.శ్రీనివాసరావు, అధిరాజ్ సింగ్ రాణా, ఏ.బి.టి.ఎస్. ఉదయరాణి, టి.హరికృష్ణ, కె.చక్రవర్తి, బి.రామకృష్ణ, ఏడీసీపీలు టి.కనకరాజు, కృష్ణమూర్తి నాయుడు, హరిబాబు, డి.ప్రసాద్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీపీఐ అభ్యర్థి మురళిని గెలిపించండి

కాలనీల్లో కమ్యూనిస్టుల ప్రచారహోరు... ఓట్ల అభ్యర్థన

విశాలాంధ్ర-తిరుపతి: ప్రజాసమస్యలపై ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతున్న కమ్యూనిస్టులకే ఓటు అడిగే హక్కు ఉందని సీపీఎం నేత కె.మురళి పేర్కొన్నారు. కూటమి బలపరిచిన తిరుపతి అసెంబ్లీ సీపీఐ అభ్యర్థి పీ మురళి విజయాన్ని కాంక్షిస్తూ గురువారం ప్రచారం హోరెత్తించారు. రైతుబజార్, రాయల్ నగర్, సీతమ్మనగర్, ఎం.ఆర్.పల్లి కాలనీల్లో ఇంటింటా తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా కే మురళి మాట్లాడుతూ, తిరుపతిలో వీధి రౌడీలు, గూండాలను తరిమికొట్టి ప్రశాంత వాతావరణం కల్పించడంలో కమ్యూనిస్టులు కీలకపాత్ర వహించారన్నారు. వేలాది మంది పేదలకు ఆశ్రయం కల్పించి ఇంటి స్థలాలు కల్పించడం మరువలేనివన్నారు. టీటీడీ నిధులు తిరుపతి అభివృద్ధికే కేటాయించేలా, కాంట్రాక్ట్ కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం చెల్లించేలా పోరాడి విజయం సాధించామన్నారు. కంకి-కొడవలి గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి శాసనసభకు పంపాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ అభ్యర్థి మురళి మాట్లాడుతూ కార్మికులు, పేదల సమస్యల పై అనునిత్యం పోరాడుతూ లాఠీ దెబ్బలకు సైతం లెక్కచేయక వారికి అండగా నిలిచింది కమ్యూనిస్టు పార్టీ మాత్రమే అన్నారు. ఇంటి పన్ను, చెత్త పన్నుపై పలుమార్లు ఉద్యమించిందీ తామేనన్నారు. కేసులకు కూడా వెరవలేదన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీ సభ్యులు ఏనాడు ప్రజాసమస్యలు పట్టించుకున్న దాఖలాలు లేవని కేవలం కాంట్రాక్టర్లు , భూకబ్జాలు సంపాదనకే పరిమితి అయ్యారని ఆరోపించారు. సీపీఐ రాష్ట్రసమితి సభ్యుడు టి.జనార్ధన్, సి.పెంచలయ్య, జె.విశ్వనాథ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రాధాకృష్ణ, చలపతి, యన్.డి. రవి, రామకృష్ణ, రామచంద్రయ్య, గోవిందస్వామి, మంజుల, వినయ్, నవీన్, సీపీఎం నేతలు సుబ్రమణ్యం, వేణు, బుజి. విజయ, ఓంరాజ్ పాల్గొన్నారు.

ఎన్‌డీఏ కూటమిని ఓడించాలి

- కులాల మధ్య చిచ్చుపెడుతున్న సుజనా...
- బీజేపీకి వంతపాడుతున్న వైసీపీ...
- సీపీఐ విజయవాడ పశ్చిమ అభ్యర్థి కోటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ప్రశాంతంగా ఉన్న పశ్చిమ నియోజకవర్గంలో తన స్వార్థ రాజకీయాల కోసం బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి కులాల మధ్య చిచ్చు పెడుతున్నారని 'ఇండియా' కూటమి బలపరిచిన సీపీఐ విజయవాడ పశ్చిమ అభ్యర్థి జి.కోటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థులను ప్రజలు ఓడించాలని పిలుపునిచ్చారు. కోటేశ్వరరావు గురు వారం 49, 50 డివిజన్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రతి వీధిలోనూ సీపీఐ అభ్యర్థికి ప్రజలు ఘన స్వాగతం పలికి గతంలో కమ్యూనిస్టు పార్టీ ప్రజాప్రతినిధులు అందించిన సేవలను గుర్తు చేసుకుని మళ్లీ కమ్యూనిస్టులు రావాలనే ఆకాంక్షను బలంగా వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా జి.కోటేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తర్వాత సీటు పొంది ఇక్కడికి వచ్చి కులాల వారీగా, మతాల వారీగా మీటింగ్‌లు పెట్టి ప్రజలను చీల్చి ఓట్లు పొందాలని కుట్రలు చేస్తున్నారని, ఇబ్బడి ముబ్బడిగా హామీలు ఇస్తున్నారని విమర్శించారు. 'అసలు మీరు గత సంవత్సరం ఎక్కడ ఉన్నారు... అంతకుముందు సంవత్సరం ఎక్కడ ఉన్నారు. రేపు ఎన్నికల తర్వాత ఎక్కడ ఉంటారో సూటిగా సమాధానం చెప్పండి. మీకు విజయవాడ నగరంతో ఏమీ సంబంధం లేదు. నేను ఇక్కడే కొత్తపేట పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉంటున్నా... ఈ పక్కనే ఉన్న కేబీఎన్ కళాశాలలో చదువుకున్నా... నేను ఏ ఒక్క బ్యాంకుకు పైసా ఎగ్గొట్టలేదు... కానీ బ్యాంకులకు రూ.5,700 కోట్లు ఎగ్గొట్టిన సుజనా చౌదరి ఇవాళ ప్రజల మధ్యకు రావడం సిగ్గుచేటు. ఎన్నికలు అంటే కోట్లు ఉండాలని చెబుతున్నారు. ఎన్నికల్లో పోటీ చేయ దానికి కోట్లు అవసరం లేదు... ప్రజల మద్దతు చాలు అని కమ్యూనిస్టులకు అనేక సార్లు ఇక్కడి జనం పట్టం కట్టారు. ప్రస్తుత ఎన్నికల్లో కేంద్రం లోని బీజేపీ ఒకవైపు... బీజేపీకి వంతపాడుతున్న వైసీపీ మరోవైపు ఉన్నాయి. వారిలో ఎవరు గెలిచినా ఒక్కటే... అందరూ మోదీ నీడలో ఉండేవారే... అందువల్ల కోట్లు ఖర్చు పెట్టి ఓట్లు కొనుగోలు చేయాలనుకునే కోటీశ్వరులు ఒకవైపు... ప్రజల సమస్యలపై స్పందించే కమ్యూనిస్టులు మరోవైపు పోటీలో ఉన్నారు. రాష్ట్ర ప్రజలకు పన్నుల భారం లేని, వివక్ష లేని పారదర్శక పాలన కోసం 'ఇండియా' కూటమి బలపరిచిన కమ్యూనిస్టులను గెలిపించాలి' అని ఆయన కోరారు. సీపీఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు, మాజీ కార్పొరేటర్ గాదె ఆదిలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం పేద లను నిలువునా మోసం చేసిందని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే రూపాయికే టిడ్కో ఇళ్ల రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని మభ్య పెట్టి ఓట్లు దండుకుని ఐదేళ్లలో ఒక్కరికి కూడా ఇల్లు ఇవ్వలేదని చెప్పారు. మరోవైపు అవినీతి రహిత పాలన అందిస్తున్నామని చెబుతున్నారని, ఆచరణలో మాత్రం డ్వాక్రా మహిళలకు రుణాల మంజూరు నుంచి ప్రతి పనికీ ఒక రేటు కట్టి వసూలు చేస్తున్నారని విమర్శించారు. నిరంతరం ప్రజల పక్షాన పోరాడే కమ్యూనిస్టు అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గద్దం శ్రీనివాసరావు, సీపీఐ నాయకులు తాడి పైడయ్య, బోరా రామకృష్ణ, గాడి రాము, మోకా దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మోదీతో ప్రజాస్వామ్యానికి ముప్పు

తణుకు సదస్సులో పరకాల ప్రభాకర్



విశాలాంధ్ర-తణుకు: దేశంలో ప్రజా జీవనాన్ని, ప్రజాస్వామ్యాన్ని తీవ్రసంక్షోభంలోకి నెట్టిన మోదీ నిర్వాకాన్ని చూసి వచ్చే ఎన్నికల్లో ప్రజలు అప్రమత్తతో, ఆలోచించి ఓటు వేయాలని ప్రముఖ రాజకీయ, సామాజిక, ఆర్థిక విశ్లేషకులు డా.పరకాల ప్రభాకర్ పిలుపునిచ్చారు. 'సంక్షోభంలో రాజ్యాంగం, ఆర్థిక, రాజకీయ మూలాలు' అనే అంశంపై తణుకు సజ్జాపురం లయన్స్ క్లబ్‌లో జరిగిన సదస్సులో ప్రధానవక్తగా ఆయన మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం ఎన్నడూ లేనంత తీవ్రస్థాయిలో పెరిగిపోయిందని, విద్యావంతుల్లో నిరుద్యోగిత 83 శాతంగా ఉన్న దని, 35 వేల రైల్వే ఉద్యోగాల కోసం కోటీ 30 లక్షల మంది దరఖాస్తు చేసుకోవడం నిరుద్యోగ తీవ్రతను తెలియజేస్తోందని పరకాల అన్నారు. భారతీయులు ప్రాణాలకు తెగించి ఇజ్రాయిల్, ఉక్రెయిన్ దేశాలలో జరుగుతున్న యుద్ధాలలో ఉద్యోగులుగా వెళ్లడానికి సిద్ధపడుతున్నారని, అయినా ప్రభుత్వం ఈ సమస్యను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో పేదరికాన్ని గణనీయంగా తగ్గించామని చెప్పే ప్రభుత్వం మరోపక్క 80 కోట్ల మందికి ఉచిత రేషన్ ఇస్తున్నామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆకలిసూచిలో దేశం 120వ స్థానంలో ఉండడం, పేదరికం విలయతాండవం సూచిస్తున్నదన్నారు. ఇంకోవేపు దేశంలోని ఒక శాతం సంపన్నుల వద్ద 40 శాతం సంపద మూలుగుతొందని, అసమానతలు తగ్గించే చర్యలకు బదులు వారికే పన్ను రాయితీలు, రుణమాఫీలు చేస్తున్నదని ఆయన విమర్శించారు.

పెరిగే ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయని, మూడు నెలలలో కిరాణా సరుకుల బిల్లు చూసుకుంటే మనకే తెలిసిపోతుందని, పెట్రోలు, డీజిలు, గ్యాస్ ధరలు మన నిత్య జీవితంపై వేస్తున్న భారం అందరికీ అనుభవంలో ఉన్నదేనన్నారు. అన్నదాతలకు రెట్టింపు ఆదాయం అంటూనే వారి శాంతియుత ఆందోళనలపై కర్కశంగా వ్యవహరించిందన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో చిన్నమెత్తు పాత్ర లేని వారు దేశభక్తిని బోధిస్తున్నారని, ప్రజాస్వామ్య విలువలైన రాజ్యాంగ నిబద్ధత, ప్రశ్నించే పౌరస్వేచ్ఛ, పత్రికా స్వేచ్ఛలకు తిలోదకాలిచ్చారని, ఓట్లకోసం దేశ ప్రజలను మతపరంగా చీల్చే విద్వేష రాజకీయం నడుపుతున్నారని విమర్శించారు. కీలకమైన ఈ ఎన్నికలలో ప్రజల ఇక్కట్లకు కారణమైన మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపాల్సిన తరుణం ఆసన్నమైందని ఆయన అన్నారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఉభయ గోదావరి జిల్లాల కార్యదర్శి కామన మునుస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో దారి దీపం పత్రిక ప్రధాన సంపాదకులు డీవీవీఎస్ వర్మ, సామాజిక న్యాయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పి.మురళి కుమార్ మాట్లాడారు. వివిధ వర్గాలకు చెందిన ప్రముఖులు, ప్రజాసంఘాల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పంట భూములకు సాగునీరు

సీపీఐ అభ్యర్థి రామచంద్రయ్యకు ప్రజామద్దతు



విశాలాంధ్ర-పత్తికొండ: గత పాలకులు నియోజకవర్గ అభివృద్ధికి ఏమాత్రం కృషి చేయకపోగా, ఎన్నికల సమయంలో మాత్రం తప్పుడు వాగ్దానాలతో ఓట్లు అడిగేందుకు వస్తున్నారని ఇండియా కూటమి బలపరిచిన సీపీఐ పత్తికొండ అసెంబ్లీ అభ్యర్థి పి.రామచంద్రయ్య విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, మండల కార్యదర్శి డి.రాజాసాహెబ్‌లతో కలిసి గురువారం ఆయన పుచ్చకాయలమాడ, హోసూర్, అటికెల గుండు, దేవనబండ, తుగ్గలి మండల పరిధిలోని రాతన గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఓట్లు అభ్యర్థించారు. ప్రజలు పెద్దఎత్తున మద్దతు తెలిపారు. హోసూర్‌లో జరిగిన బహిరంగ సభలో వారు మాట్లాడుతూ ఇండియా కూటమి అభ్యర్థులను చట్టసభలకు పంపినట్లయితే నియోజకవర్గంలో తుగ్గలి, మద్దికేర, వెల్దుర్తి, క్రిష్ణగిరి మండలాలలో మినీ రిజర్వాయర్లు ఏర్పాటుచేసి 60 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. పందికోన రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువల కింద పిల్ల కాలువలను ఏర్పాటుచేసి పూర్తిస్థాయిలో ఆయకట్టు భూములకు సాగునీటికి కొరత లేకుండా చేస్తామన్నారు. పత్తికొండ చెరువును సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌గా మార్చి పత్తికొండకు నిరంతరం తాగునీరు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిని 30 పడకల నుంచి 100 పడక ల స్థాయికి పెంచుతామన్నారు. పత్తికొండ ప్రాంతంలో టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు, బీసీ బాలికల వసతిగృహం, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేస్తామన్నారు. నిరుపేదలకు రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కంకి కొడవలి గుర్తుకు, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రాం పుల్లయ్య యాదవ్ హస్తం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆవుల శేఖర్ మాట్లాడుతూ రామచంద్రయ్య, రాం పుల్లయ్య యాదవ్ లను గెలిపించాలని అన్నారు. పట్టణంలోని ఆరు, ఏడు వార్డుల్లో ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా సమితి సభ్యుడు కృష్ణయ్య, గుండు భాష, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు అల్తాఫ్, సీపీఎం మండల కార్యదర్శి రంగారెడ్డి, దస్తగిరి పాల్గొన్నారు.

రేపే పాలిసెట్-2024

- 442 కేంద్రాలు... 1,59,783 అభ్యర్థులు
- ఏర్పాట్లు పూర్తి: సాంకేతిక విద్యాశాఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా 'పాలిసెట్-2024' నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని నైపుణ్యాభివృద్ధి శాఖ కార్యదర్శి సురేష్ కుమార్ తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్‌లలో పాలిసెట్ నిర్వహణకు సంబంధించి గురువారం సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ కార్యాలయంలో హైబ్రీడ్ విధానంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా శనివారం పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష జరగనుంది. సురేష్ కుమార్ ఆన్‌లైన్ సమీక్షలో పాల్గొని అధికారులకు కీలక సూచనలు చేశారు. వడగాలుల తీవ్రత నేపథ్యంలో ప్రతి కేంద్రం వద్ద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి అత్యవసర మందులు సిద్ధంగా ఉంచాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఆయా శాఖల అధికారులకు ముందస్తు సమాచారం ఇచ్చి సమన్వయం చేసుకోవాలన్నారు. పదవ తరగతి తర్వాత ఉజ్వల భవిష్యత్‌తో కూడిన ఉద్యోగ అవకాశాలు పొందడానికి ఉత్తమమైన మార్గం పాలిటెక్నిక్ విద్య మాత్రమేనని సురేష్ కుమార్ తెలిపారు. పాలిటెక్నిక్ పూర్తి అయిన వెంటనే సత్వర ఉపాధి కల్పించేందుకు వివిధ పరిశ్రమలతో ఒప్పందాలు చేసుకున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ లేబరేటరీలను ఆధునీకరించి, వసతి కల్పనను సైతం మెరుగుపరచామని, ఎన్‌బీఏ గుర్తింపు పొందిన 36 ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో విద్యార్థులకు మరింత మెరుగైన విద్యను అందించనున్నామని ఆయన వివరించారు. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఏప్రిల్ 27న జరిగే ప్రవేశ పరీక్షకు 442 కేంద్రాలలో 1,59,783 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇందులో బాలికలు 64,538 కాగా, బాలురు 95,245 మంది ఉన్నారని తెలిపారు. ఉదయం 8 గంటల తరువాత భద్రతా కేంద్రాల నుంచి పరీక్షా పత్రాలు పరీక్షా కేంద్రాలకు చేరుకుంటాయని, పదకొండు గంటలకు ప్రవేశ పరీక్ష ప్రారంభం అవుతుందని వివరించారు. ఒంటి గంటలోపు విద్యార్థులను బయటకు అనుమతించబోమని నాగరాణి స్పష్టం చేశారు. 26 మంది జిల్లా స్థాయి పరిశీలకులు, 62 మంది సమన్వయ కేంద్రాల పరిశీలకులు, 442 మందిని పరీక్షా కేంద్రాల పరిశీలకులుగా నియమించామన్నారు. ప్రతి 24 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్ ఉంటారని, పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు కోరామని తెలిపారు. ప్రతి కేంద్రంలోనూ మంచి నీరు అందుబాటులో ఉండేలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేసామన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.

దేశంలో కీలక ఐటీ హబ్‌గా ఆర్థికాభివృద్ధిలో దూసుకెళ్తున్న దక్షిణాది రాష్ట్రం కర్నాటక. ఇక్కడ రాజకీయాలు నాటకీయంగా మారుతుంటాయి. ఒకప్పుడు జనతాదళ్ (ఎస్) వంటి ప్రాంతీయ పార్టీల హవా సాగిన ఈ రాష్ట్రాన్ని జాతీయ పార్టీలు పూర్తిగా గుప్పెట పట్టాయి. కొన్నేళ్లుగా రాజకీయాలు కాంగ్రెస్, బీజేపీ కూటముల మధ్యే నడుస్తున్నాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేసిన కాషాయదళానికి కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికలలో గట్టి పోటీ ఇస్తోంది.

కన్నడ నాడి పట్టేదెవరో!

హస్తం, కమలం హోరాహోరీ!

ఉనికి కోసం జేడీఎస్ పోరాటం

కర్నాటకలో లోక్‌సభ ఎన్నికల సమరం హోరాహోరీగా సాగుతోంది. మొత్తం 28 నియోజకవర్గాలకు రెండు విడతలుగా ఈ నెల 26న 14 నియోజకవర్గాలకు, మే 7న మరో 14 నియోజకవర్గాలకు పోలింగ్ జరుగనుంది. కాంగ్రెస్ పార్టీ సొంతంగా అన్ని స్థానాల్లో బరిలో ఉండగా, బీజేపీ-జేడీఎస్ పొత్తుతో ముందుకెళ్తున్నాయి. బీజేపీ 25, జేడీఎస్ 3 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. రాష్ట్రంలో ప్రాబల్యం కల్గిన లింగాయత సామాజికవర్గం నేత యడియూరప్ప ద్వారా బీజేపీ రాజకీయాలు కొనసాగిస్తోంది. జేడీఎస్‌తో పొత్తు వల్ల రెండో బలమైన సామాజికవర్గం ఒక్కలిగల మద్దతు కూటమికి కలిసి వచ్చే అవకాశం ఉందని బీజేపీ ఆశపడుతోంది. కాంగ్రెస్‌లో సీఎం సిద్దరామయ్య బీసీ నేతగా గుర్తింపు కలిగి ఉన్నారు. కేపీసీసీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఒక్కలిగ సామాజికవర్గానికి చెందినవారు. బీజేపీకి లింగాయత, ఒక్కలిగల మద్దతు ఉండగా కాంగ్రెస్‌కు బీసీ, ఒక్కలిగలతోపాటు మైనారిటీలు అండగా ఉన్నారు. రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలు రెండు పార్టీలకూ ప్రతిష్టాత్మకమే. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో కర్నాటక ఓటర్ల ధోరణి భిన్నంగా ఉంటుంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సొంతంగా 300 సీట్ల మైలురాయిని అధిగమించడంలో దన్నుగా నిలిచిన రాష్ట్రాల్లో కర్నాటక ఒకటి. మొత్తం 28 స్థానాల్లో బీజేపీ ఒంటరిగా పోటీ చేసి ఏకంగా 25 సీట్లతో విజయం సాధించింది. యూపీఏ కూటమిగా పోటీ చేసిన కాంగ్రెస్, జేడీఎస్ చెరో స్థానంతో సరిపెట్టుకున్నాయి. రామకృష్ణ హెగ్డే నేతృత్వంలోని జనతా పార్టీ కాలం నుంచి కర్నాటకలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే ధోరణి కొనసాగుతోంది. 1984 లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాభవం చవిచూసిన జనతా పార్టీ కొన్ని నెలలకే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో స్పష్టమైన మెజారిటీ సాధించింది. గడిచిన నాలుగు దఫాల్లో కూడా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఫలితాలు భిన్నంగానే వచ్చాయి. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించింది.

తమ గత మిత్రపక్షం జేడీ(ఎస్) కాషాయదళం పంచన చేరడంతో కాంగ్రెస్ పార్టీ ఈసారి ఒంటరి పోరు చేస్తోంది. ఎన్నికల ప్రచారంలో స్థానిక అంశాలకే ప్రాధాన్యమిస్తోంది. రాష్ట్రంపై కేంద్రం వివక్ష చూపుతోందని సీఎం సిద్ధరామయ్య ప్రధానంగా విమర్శిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల విజయంలో కీలకపాత్ర పోషించిన ఐదు గ్యారంటీలను కూడా కాంగ్రెస్ ప్రచారాస్త్రంగా మలచుకుంటోంది. కుల గణన, రైతులకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత, 6 న్యాయాలు, 25 గ్యారంటీలతో కూడిన జాతీయ మేనిఫెస్టోను కూడా ప్రజల్లోకి తీసుకెళ్తోంది. మోదీ పాలనలో నిరుద్యోగం, కార్పొరేట్లకు అనుచిత లబ్ధి వంటివాటిని కాంగ్రెస్ ప్రచారంలో ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. ఐదు గ్యారంటీలను సమర్థవంతంగా అమలు చేయడంతో లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మెరుగైన స్థానాలు వస్తాయని అనేక సర్వేలు అంచనా వేస్తున్నాయి. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 'పే సీఎం', 40% కమీషన్ వంటి అంశాలను విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా బీజేపీని దెబ్బకొట్టింది. ఇప్పుడు.. కేంద్రం కర్ణాటకకు అన్నింటా ఖాళీ చెంబు చూపుతోందని వ్యంగాస్త్రాలు సంధిస్తూ ప్రకటనలిస్తోంది.కాంగ్రెస్ ప్రచారంలో దీన్నే కీలకంగా చేసుకుంటోంది. మోదీ సర్కారు రాష్ట్రానికి చేసిందేమీ లేదంటూ ఖాళీ 'చెంబు'లతో ప్రకటనలు కుమ్మరిస్తోంది.

కుల రాజకీయాలు

కన్నడనాట రాజకీయాలు కులాలతో పెనవేసుకున్నాయి. అభ్యర్థుల బలాబలాలు, పార్టీ సామర్థ్యాలతో పాటు కులాలు కూడా గెలుపోటముల్లో కీలక పాత్ర పోషిస్తాయి. ఇందులో శివారాధకులైన లింగాయత్‌లను ప్రధానంగా చెప్పుకోవాలి. ఓబీసీ జాబితాలో ఉన్న లింగాయత్‌లకు 17% ఓటు బ్యాంకుంది. దక్షిణాదిన తొలిసారి బీజేపీకి అధికారం సాధించిపెట్టిన బీఎస్ యడ్యూరప్పది లింగాయత్ సామాజికవర్గమే. దాంతో వారి మద్దతు బీజేపీకి పుష్కలంగానే ఉంటుంది. రాష్ట్ర బీజేపీలో మరో కీలక నాయకుడు బసవరాజ్ బొమ్మై కూడా లింగాయత్ కులానికి చెందిన వ్యక్తే. అందుకే కాంగ్రెస్‌ను లింగాయత్ వ్యతిరేక పార్టీగా బీజేపీ చిత్రీకరిస్తుంటుంది. ముస్లింల 4శాతం ఓబీసీ రిజర్వేషన్ కోటాను గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు బసవరాజ్ బొమ్మై సర్కారు రద్దు చేసి వాటిని లింగాయత్, వొక్కలిగలకు చెరో 2శాతం చొప్పున పంచింది. వొక్కలిగ సామాజిక వర్గానికి రాష్ట్రంలో 14 శాతం ఓటు బ్యాంకుంది. ఇదే సామాజిక వర్గానికి చెందిన మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ పార్టీ జనతాదళ్(ఎస్) ఈ ఓటు బ్యాంకును ఇప్పటికీ నియంత్రిస్తోంది. ఓల్డ్-మైసూరు ప్రాంతంలో ప్రాబల్యము ఉన్న వొక్కలిగల ఓట్లపై దృష్టి సారించిన బీజేపీ ఈసారి జేడీ(ఎస్)తో పొత్తు పెట్టుకుంది. కర్నాటక కాంగ్రెస్ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్‌దీ ఇదే సామాజికవర్గం. గత ఎన్నికల డేటాను పరిశీలిస్తే వొక్కలిగ ఓటు బ్యాంకును జేడీ (ఎస్), కాంగ్రెసే పంచుకుంటున్నాయి.

తాము అధికారంలోకి వస్తే ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ పునరుద్ధరిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. దీంతో వాళ్ల ఓటు బ్యాంకు తమవైపేనని ఆ పార్టీ భావిస్తోంది. ఇక ఓబీసీ కమ్యూనిటీకి చెందిన కురబలు రాష్ట్రంలో 9 శాతం దాకా ఉన్నారు. వీరు చాలా నియోజకవర్గాల్లో ప్రభావం చూపగలరు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యది ఇదే కులం కావడం ఈసారి తమకు కలిసొస్తుందని కాంగ్రెస్ భావిస్తోంది. 1977లో కోల్పోయిన తమ గిరిజన గుర్తింపును పునరుద్ధరించాలనేది కురబల ప్రధాన డిమాండ్. జనాభాలో 24 శాతం వాటా ఉన్న దళిత, గిరిజన ఓట్లను ఆకట్టుకునేందుకు అన్ని పార్టీలూ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి.

బీజేపీ పట్టు నిలుపుకుంటుందా?

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూసిన బీజేపీ లోక్‌సభ పోరులో మాత్రం పైచేయి సాధించాలని పట్టుదలగా ఉంది. ఇందులో భాగంగా హెచ్‌డీ కుమారస్వామి నేతృత్వంలోని జేడీ(ఎస్)తో ముందుగానే పొత్తు పెట్టుకుంది. మోదీ ప్రభావం, కాంగ్రెస్ సర్కారు అవినీతి, అభివృద్ధి అజెండా, అయోధ్య రామమందిరం ఈ నాలుగింటిని ప్రచారాస్త్రాలుగా మలచుకుంది. జేడీ(ఎస్)కు మూడు సీట్లతో సరిపెట్టి బీజేపీ 25 చోట్ల పోటీ చేస్తోంది. జేడీ(ఎస్) మూడు స్థానాల్లో రెండింట దేవెగౌడ కుటుంబమే పోటీ చేస్తోంది. మాండ్యలో కుమారస్వామి, హసన్ నుంచి దేవెగౌడ మనవడు ప్రజ్వల్ రేవణ్ణ బరిలో ఉన్నారు. జగదీశ్ షెట్టర్ మళ్లీ కమలం గూటికి తిరిగొచ్చి బెళగావి నుంచి పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో మాండ్య నుంచి ఇండిపెండెంట్‌గా గెలిచిన ప్రముఖ నటి సుమలతా అంబరీశ్ బీజేపీలో చేరినా ఈసారి పోటీ నుంచి వైదొలగి కుమారస్వామికి మద్దతిస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో రెబెల్స్ తీవ్ర ప్రభావం చూపుతున్నారు. బీజేపీ సీనియర్ నేత ఈశ్వరప్ప శివమొగ్గలో స్వతంత్రంగా పోటీ చేయడం, కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి పోటీ చేస్తున్న ధారవాడలో ఆరు లక్షలకుపైగా ఓటర్లు కల్గిన లింగాయత సామాజికవర్గానికి చెందిన మఠాధిపతి దింగాలేశ్వరస్వామి పోటీ చేయడం బీజేపీకి ఇబ్బందిగా మారింది.

కొన్ని దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి కర్నాటక కంచుకోట అనే పేరుంది. ఒకప్పుడు దేశమంతటా కాంగ్రెస్ పార్టీకి గడ్డుకాలం ఉన్నా, మాజీ ప్రధాని ఇందిరాగాంధీని చిక్‌మంగళూరు నుంచి గెలిపించడం ఇందుకు నిదర్శనం. రాష్ట్రం నుంచి మరో కీలక ఎన్నికల్లో బళ్లారి నుంచి బీజేపీ నేత సుష్మాస్వరాజ్‌పై సోనియాగాంధీ విజయం సాధించారు. ప్రస్తుతం కాంగ్రెస్‌లో నెలకొన్న అంతర్గత కలహాలను తమకు అనుకూలంగా మార్చుకుని సత్తాచాటేందుకు బీజేపీ ఎత్తుగడలు వేస్తోంది. బీజేపీకి దక్షిణాదిలో ఆధిపత్యం ఉన్న ఏకైక రాష్ట్రం ఇదే.

అసోం ఎన్నికలపై

సీఏఏ ప్రభావం

- నేడు ఐదు స్థానాలలో పోలింగ్
- పునర్విభజన తర్వాత ఇదే తొలి ఎన్నిక

అసోంలోని ఐదు స్థానాల్లో ఈనెల 26న ఎన్నికలు జరగబోతున్నాయి. గతేడాది జరిగిన నియోజకవర్గాల పునర్విభజన తర్వాత రాష్ట్రంలో నిర్వహించే తొలి ఎన్నిక కావడంతో దీనికి ప్రాధాన్యత ఏర్పడింది. కరీంగంజ్, సిల్చర్, దర్రంగ్-ఉదల్‌గురి (మంగల్‌దోయి), నాగావ్, కాలియాబోర్ లోక్‌సభ స్థానాల్లో పోరు రసవత్తరంగా సాగబోతోంది.

బెంగాలీ హిందువులు-ముస్లింలు ఎక్కువగా ఉండే ఈ ప్రాంతాల్లో ఇప్పటివరకు బీజేపీ గెలుస్తూ వచ్చింది. ఒక్క నాగావ్‌లో కాంగ్రెస్ గెలిచింది. పునర్విభనతో పాటు పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) అంశాలు తాజా ఎన్నికలపై ప్రభావం చూపుతున్నాయి. దీంతో బీజేపీకి గెలుపు నల్లేరుపై నడక కాబోదన్న అంచనా ఉంది. నిరుద్యోగం, కేంద్ర పాలిత ప్రాంత హోదా డిమాండ్ అపరిష్కృతంగా ఉండటం కూడా ఓటింగ్‌ను ప్రభావితం చేయొచ్చు. అయితే ప్రధాన పార్టీలు హేమాహేమీలను బరిలోకి దించడంతో పోరు రసవత్తరంగా మారింది.

దక్షిణ అసోంలోని కరీంగంజ్, సిల్చర్‌తో పాటు సెంట్రల్ అసోంలోని నాగావ్ స్థానాల్లో బెంగాలీ హిందువులు, ముస్లింలతో పాటు వలసదారులు ఎక్కువ. సెంట్రల్ అసోంలోని దర్రంగ్-ఉదల్‌గిరి స్థానంలో గెలుపోటములను వీరు ప్రభావితం చేయగలరు. తేయాకు పండించే వర్కర్లు కూడా ఫలితాలను తారు మారు చేయగలరు. ఎస్టీల కోసం రిజర్వు చేసిన రెండు స్థానాల్లో దీఫు ఒకటి. గతంలో ఎస్సీలకు కేటాయించిన కరీంగంజ్ ఇప్పుడు జనరల్ స్థానం కాగా ముస్లింలకు పోటీ అవకాశాలు పెరిగాయి. ఈ ప్రాంతంలో ముస్లిం జనాభా 60శాతం మేర ఉంటుంది. అదే విధంగా సిల్చర్... ఎస్సీ రిజర్వుడ్ స్థానమైంది. కాచర్, హైలాకండి, కరీంగంజ్‌తో కూడుకున్న బరాక్ వ్యాలీలో బెంగాలీ హిందువులు, ముస్లింల జనాభా అధికం. ఎన్నికలకు ముందు రూపొందిన సీఏఏ నిబంధనలు...బరాక్ వ్యాలీలో చర్చనీయాంశంగా మారాయి. పూర్వం మంగల్‌దోయిగా వ్యవహరించే దర్రంగ్-ఉదల్‌గిరి నియోజకవర్గంలోనూ 45శాతానికిపైగా బెంగాలీ ఓటర్లు ఉన్నారు. వీరిలో ముస్లింలదే ఆధిపత్యం. అసోం రాజకీయ చరిత్రలో మంగల్‌దోయికి ప్రత్యేక స్థానం ఉంది. 1979 మార్చిలో జనతాదళ్ ఎంపీ హీరాలాల్ పటౌరి మరణానంతరం ఓటర్ల జాబితా పున:సమీక్షలో 36వేల మంది ఓటర్లు అసలు పౌరులే కాదని తేలడం వివాదాస్పదమైంది. దీంతో అసోం ఉద్యమం (1979-85) హింసాత్మకంగా జరిగింది.

నాగావ్ నియోజకవర్గంలో పునర్విభజన ప్రభావం స్పష్టంగా ఉంది. నియోజకవర్గాల పునర్విభజన కారణంగా నాగావ్‌లో బెంగాలీ ముస్లిం ఓటర్లు 53శాతం నుంచి 58శాతానికి పెరిగారు. పాత గణాంకాలతో లెక్క కచ్చితంగా లేకపోయినాగానీ ఇక్కడ బెంగాలీ మాట్లాడే ఓటర్లు 63శాతానికిపైగానే ఉంటారని తెలుస్తోంది.

ఇదిలావుంటే, కరీంగంజ్ నుంచి పోటీ చేస్తున్న 24 మంది నుంచి 18 మంది స్వతంత్ర అభ్యర్థులు కాగా వీరిలో 14 మంది ముస్లింలు ఉన్నారు. ఇక సిల్చర్‌లో కాంగ్రెస్ అభ్యర్థిగా సూర్యకాంత సర్కార్ పోటీ చేస్తున్నారు. తృణమూల్ తరపున రాధేశ్యామ్ బిశ్వాస్ బరిలో నిలిచారు. అసోంలో మొత్తం 14 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. 2019 ఎన్నికల్లో బీజేపీ తొమ్మిది స్థానాల్లో గెలిచింది. ఈసారి 12 సీట్లు గెలుచుకోవాలని ఆశిస్తోంది. తాజాగా పోలింగ్ జరగబోయే ఐదు స్థానాల్లో నుంచి నాలుగింటిని 2019లో బీజేపీ గెలుచుకుంది. నాగావ్‌లో కాంగ్రెస్ తరపున పోటీ చేసిన ప్రద్యుత్ బోర్డోలోయి గెలిచారు. అందుకోసమే ఆయన మరోమారు పోటీలో నిలిచారు. తిరిగి గెలవాలని ఆశిస్తున్నారు.

బెంగాల్ పోరు

వ్యూహాత్మకం

- హేమాహేమీల పోటీతో ఎన్నిక రసవత్తరం
- నేడు డార్జిలింగ్, రాయ్‌గంజ్, బలూర్‌ఘాట్‌లో పోలింగ్

సార్వత్రిక ఎన్నికల రెండవ దశలో భాగంగా పశ్చిమ బెంగాల్‌లోని మూడు స్థానాల్లో ఈనెల 26న పోలింగ్ జరగబోతోంది. 2019 ఎన్నికల్లో ఇవి బీజేపీ వశమయ్యాయి కానీ ఈసారి హేమాహేమీలు బరిలో ఉండటంతో పోటీ రసవత్తరంగా మారింది. డార్జిలింగ్, రాయ్‌గంజ్, బలూర్‌ఘాట్‌లో పోరు వ్యూహాత్మకంగా సాగబోతోంది. 2009 నుంచి డార్జిలింగ్ నుంచి బీజేపీ వారే లోక్‌సభకు ఎన్నికవ్వగా కాషాయ పార్టీకి ఇది సురక్షిత స్థానంగా మారిపోయింది. అయితే ఇక్కడ త్రిముఖ పోరు నెలకొంది. కాంగ్రెస్ తరపున విద్యావేత్త మునిష్ తమాంగ్, తృణమూల్ కాంగ్రెస్ నుంచి మాజీ బ్యూరోక్రాట్ గోపాల్ లామా, బీజేపీ తరపున రాజు బిస్తా పోటీ పడుతున్నారు. స్థానిక హమ్రో పార్టీ మద్దతు కాంగ్రెస్ అభ్యర్థికి ఉంది. కుర్సియాంగ్ నుంచి బీజేపీ తరపున ఎమ్మెల్యేగా ఎన్నికైన విష్ణు పదా శర్మ ఈసారి స్వతంత్ర అభ్యర్థిగా డార్జిలింగ్ బరిలో నిలిచారు. బిస్తా 'భూమిపుత్రుడు' కాదని ఆయన వాదించారు. బిస్తాకు బీజేపీ అభ్యర్థిత్వం దక్కడానికి నిరసనగా ఈ నిర్ణయాన్ని శర్మ తీసుకున్నారు. 2019 ఎన్నికల్లో నాలుగు లక్షల ఓట్ల మెజారిటీతో బిస్తా డార్జిలింగ్ నుంచి ఎన్నికయ్యారు. నక్సల్‌బరీ పురుటిగడ్డగా పరిగణించే ఈ స్థానం నుంచి సీపీఎం నేతృత్వ వామపక్ష కూటమి తమ అభ్యర్థిని నిలబెట్టకపోవడం ఇదే మొదటిసారి. కాగా బలూర్‌ఘాట్‌లో టీఎంసీ నేత, మంత్రి విప్లమ్ మిత్రాపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సుకాంతా మజుందార్ పోటీ చేస్తున్నారు.

గూర్ఖాలాండ్ వివాదం

గూర్ఖాలాండ్ వివాదం నాలుగు దశకాలుగా నానుతోంది. డార్జిలింగ్ రాజకీయాలను ప్రభావితం చేస్తోంది. ప్రత్యేక రాష్ట్రంగా గూర్ఖాలాండ్ ఉండాలన్న డిమాండ్ నేటికీ అపరిష్కృతంగా ఉండటం తెలిసిందే. గూర్ఖా ప్రజల డిమాండ్లకు రాజకీయపరమైన శాశ్వత పరిష్కారం చూపుతామని బీజేపీ గతంలో హామీనిచ్చింది. ఈసారి పార్టీ మేనిఫెస్టోలో దీనిపై మౌనం వహించింది. ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తిస్తున్న ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా నోటిమాటగా త్వరలోనే పరిష్కారం చూపుతామని చెబుతున్నారు. బీజేపీ నేతలవి ఒట్టి మాటలని, ఆచరణకు నోచుకోబోవని ఘాటుగా ప్రతిపక్ష పార్టీలు విమర్శిస్తున్నారు. ఇన్నేళ్లుగా బీజేపీని ఎన్నుకుంటున్న డార్జిలింగ్ ప్రజల కోసం ఇప్పటివరకు చేసినదేమీ లేదని దుయ్యబట్టారు.

డార్జిలింగ్‌లో చాలా కాలంగా గుర్తింపు రాజకీయాలు, తేయాకు పరిశ్రమ సమస్యలు, వాతావరణ మార్పు నేపథ్య సమస్యలు వెంటాడుతున్నాయి. డార్జిలింగ్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో డార్జిలింగ్, కాలింపోంగ్, కుర్సేంగ్, మటిగారా-నక్సల్‌బరి, సిలిగురి, ఫాన్సిదేవా, ఛోప్రా స్థానాలు ఉన్నాయి. నేపాల్, బంగ్లాదేశ్ సరిహద్దుల్లో .... భూటాన్, చైనాకు దగ్గరగా ఉండే కీలకమైన సిలిగురి కారిడార్ ఈ నియోజకవర్గం పరిధిలోనే ఉంది.

ఇక దక్షిణ దీనాజ్‌పూర్‌లోని బలూర్‌ఘాట్, ఉత్తర దీనాజ్‌పూర్‌లోని రాయ్‌గంజ్ నియోజకవర్గాలు సిలిగురి కారిడార్‌కు దిగువన ఉంటాయి. ఈశాన్య ప్రాంతాన్ని దేశంలోని మిగతా ప్రాంతాలతో అనుసంధానం చేసేందుకు కీలకంగా ఉంటాయి. బలూర్‌ఘాట్ ఒకప్పుడు వామపక్ష కూటమి భాగస్వామి ఆర్ఎస్పీకి కుంచుకోట. 1984 నుంచి 2009 వరకు ఈ నియోజకవర్గంలో ఆర్ఎస్పీకి తిరుగులేదు. 2014 ఎన్నికల్లో టీఎంసీ ఆ స్థానం దక్కించుకుంది. 2019 ఎన్నికల్లో టీఎంసీ నుంచి బీజేపీ దీనిని కైవసం చేసుకుంది.

బలూర్‌ఘాట్, రాయ్‌గంజ్‌లో కనెక్టివిటీ, ఆరోగ్య సంరక్షణే ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. బంగ్లాదేశ్ సరిహద్దులోని ఈ ప్రాంతాల్లో రైల్వే నెట్‌వర్క్‌ను మెరుగు పరిచామంటూ బలూర్‌ఘాట్ సిట్టింగ్ ఎంపీ (బీజేపీ) మజుందార్ చెప్పుకుంటున్నారు. మరోవైపు రాయ్‌గంజ్‌కు ఎయిమ్స్ కోసం డిమాండ్ దీర్ఘకాలంగా ఉంది. రాయ్‌గంజ్‌లో స్థలం లేదని చెప్పి ఎయిమ్స్‌ను దక్షిణ బెంగాల్‌కు తృణమూల్ ప్రభుత్వం తరలించింది. ఒకవైపు బీహార్ మరోవైపు బంగాదేశ్ ఉన్న రాయ్‌గంజ్‌లో త్రిముఖ పోటీ జరగబోతోంది. తృణమూల్ నేత కృష్ణ కల్యాణి, బీజేపీ తరపున కార్తిక్ పాల్, కాంగ్రెస్ తరపున అలీ ఇమ్రాన్ రమ్జ్ మధ్య హోరాహోరీ సాగుతోంది. కల్యాణి 2021లో బీజేపీ తరపున రాయ్‌గంజ్ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఆ తర్వాత తృణమూల్‌లో చేరారు. రాయ్‌గంజ్ సిట్టింగ్ ఎంపీ దేవశ్రీ చౌదరి స్థానంలో పాల్‌కు బీజేపీ టికెట్ ఇచ్చింది. ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ టికెట్‌పై చొకులియా నుంచి అసెంబ్లీకి ఎన్నికైన రమ్జ్ ప్రస్తుతం కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్నారు.

ఇదిలావుంటే రెండవ దశ ఎన్నికల కోసం మరిన్ని కేంద్ర బలగాలను మోహరించాలని ఎన్నికల సంఘం యోచిస్తోంది. తొలి దశ కంటే అదనంగా అంటే 299 కంపెనీలను రంగంలోకి దించాలని భావిస్తోంది. పోలింగ్ జరగబోయే మూడు లోక్‌సభ నియోజకవర్గాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తోంది.

విజయవాడ పశ్చిమంలో

కదలిస్తూ... కలిసి ముచ్చటిస్తూ...

సీపీఐ విజయానికి మహిళా దళం ప్రచారం

కోటేశ్వరరావుకు పెరుగుతున్న ఆదరణ

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న ప్రజా గొంతుక విజయవాడ పశ్చిమ నియోజకవర్గం సీపీఐ అభ్యర్థి జి.కోటేశ్వరరావు విజయం కోసం నియోజకవర్గంలో ఇండియా కూటమి కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీపార్టీ శ్రేణులు నియోజకవర్గంలో ఇంటింటికి తిరిగి కంకి–కొడవలి గుర్తుకు ఓటువేసి కోటేశ్వరరావును గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రత్యేకంగా మహిళా సమాఖ్య దళాలు మండుటెండను, వడగాడ్పులను సైతం లెక్కచేయకుండా ప్రచారం నిర్వహిస్తున్నారు. మహిళా సమాఖ్య నగర నాయకులు పంచదార్ల దుర్గాంబ, పి.రాణి, తమ్మిన దుర్గ, డి. సీతారామమ్మ, డి రమణమ్మ, మూలి ఇందిర, ఎన్. భాగ్యలక్ష్మి, చింతాడ పార్వతి, అండిమాని నాగమణి, కొట్టు విజయ లక్ష్మి, ఏ. తవుడమ్మ, వెలంగాని రాణి, అనసూయ, సావిత్రి, భువన సుందరి తదితరులతో కూడిన మహిళా సమాఖ్య బృందం అందరిని కదలిస్తూ... కలిసి ముచ్చటిస్తూ కంకి–కొడవలి గుర్తుపై ఓటువేసి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే కోటేశ్వరరావును శాసనసభకు పంపించాలని కోరుతున్నారు. విజయవాడ పాతబస్తి ప్రాంతం అభివృద్ధి సాధించాలన్నా, జనవాణి అసెంబ్లీలో వినిపించాలన్న కోటేశ్వరరావును గెలిపించి తీరాలని ఓటర్లను చైతన్యపరుస్తున్నారు. కమ్యూనిస్టులు చట్టసభల్లో ఉంటే ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలను నిలదీస్తారనీ, అందుకే ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే వారిని గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. బీజేపీ, వైసీపీ, టీడీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తున్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కోటేశ్వరరావు చేస్తున్న కృషిని కళ్లకు కట్టినట్టు వివరిస్తున్నారు. అభ్యర్థి కోటేశ్వరరావు ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వివిధ డివిజన్లలో పర్యటిస్తున్నారు. ఆయన పర్యటనలో ఇండియా కూటమి భాగస్వామ్య

పార్టీల నగర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని సగభాగంపైగా ఆయన ప్రచారం పూర్తిచేశారు. ఇంటింటికి వెళ్లి ప్రతి ఓటరును కలిసి కంకి–కొడవలి గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కరానికి కృషి చేస్తానని హామీ ఇస్తున్నారు. ప్రతి వీధిలోనూ ఆయన ప్రచారానికి ఓటర్ల నుంచి విశేష స్పందన వస్తోంది. స్థానికులు ఎదురేగి ఆయనకు స్వాగతం పలికి ప్రచారంలో పాలుపంచుకుంటున్నారు గతంలో కమ్యూనిస్టు పార్టీ ప్రజాప్రతినిధులు అందించిన సేవలను గుర్తుచేసుకుని మళ్లీ కమ్యూనిస్టులు రావాలనే ఆకాంక్షను బలంగా వ్యక్తంచేస్తున్నారు. ఓటువేసి తప్పకుండా గెలిపిస్తామని హామీ ఇస్తున్నారు. శాంతియుతంగా ఉండే విజయవాడ నగరంలో మతాల మధ్య చిచ్చుపెట్టే మతోన్మాద బీజేపీకి ప్రజలు అవకాశం ఇవ్వొదని, ప్రజా సమస్యలను చట్టసభల్లో వినిపించే కమ్యూనిస్టులను గెలిపించాలని కోటేశ్వరరావు విజ్ఞప్తి చేస్తున్నారు. తన స్వార్థ రాజకీయాల కోసం బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి పశ్చిమ నియోజకవర్గంలో కులాల మధ్య చిచ్చు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కులాల మధ్య చిచ్చు పెట్టి ఓట్లు పొందాలని ప్రయత్నిస్తున్న బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థులను ప్రజలు ఓడించాలని ఆయన పిలుపునిస్తున్నారు. 'బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తర్వాత సీటు పొంది ఇక్కడికి వచ్చి కులాలవారీగా మీటింగ్‌లు పెట్టి మీకు ఆకాశమంత పందిరి వేస్తాం... భూదేవంత పీఠం వేస్తా... అని మభ్యపెడుతున్నారు. ఈ కుట్రలను చైతన్యవంతులైన నియోజకవర్గ ప్రజలు ఎండగడతారని కోటేశ్వరరావు అన్నారు. స్థానికుడినైన తనకు ప్రజల సమస్యలపై పూర్తి అవగాహన ఉందని తనని గెలిపిస్తే వాటిని ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తానని హామీ ఇస్తున్నారు. ఎన్నికలు అంటే కోట్లు ఉండాలని చెబుతున్నారు. ఎన్నికల్లో పోటీ చేయడానికి కోట్లు అవసరం లేదు... ప్రజల మద్దతు చాలు అని కమ్యూనిస్టులకు అనేకమార్లు ఇక్కడి జనం పట్టం కట్టిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. విజయవాడ కార్పొరేషన్, పశ్చిమ నియోజకవర్గంలో కమ్యూనిస్టులు ఎన్నికైనప్పుడు, ఇతరులు ఎన్నికైనప్పుడు అభివృద్ధిలో ఎంతో తేడావుందనీ, ఈ తేడాను బేరీజు వేసుకుని తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. కొండలు, మైదాన ప్రాంతాలతో ఉన్న విజయవాడ నగరాన్ని గతంలో సమతుల్యంగా అభివృద్ధి చేసిన ఘనత కమ్యూనిస్టులకు ఉందన్నారు. అదే స్ఫూర్తితో పని చేస్తున్న తనను గెలిపిస్తే నగరం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. ప్రజలకు పన్నుల భారం లేని, వివక్ష లేని పారదర్శక పాలన కోసం ఇండియా కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోటేశ్వరరావు కోరుతున్నారు. ఈ ప్రచారంలో సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, కార్యదర్శివర్గ సభ్యులు తాడి పైడియ్య, నాయకులు కొట్టు రమణారావు, డివిజన్ కార్యదర్శులు పగిడికత్తుల రాము, మురుగేశన్ రాము, సీపీఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు, సీపీఎం మాజీ కార్పొరేట్ గాద్దె ఆదిలక్ష్మీ, కాంగ్రెస్ నాయకులు గడ్డం శ్రీనివాసరావు తదితరులు పాల్గొంటున్నారు.

చెరువు ఎగిరిపోయింది

చెరువును ప్రేమించే వల
చిన్న విరామమేమీ కోరలేదు
చేపలు సెలవేమీ అడగలేదు.
ఎన్నికల నగారా మోగిందంతే!

పదవులు ఎండమావిలో
పరిగెట్టే నాగజెముడికి
కాస్త తడి కావాలి
ముళ్ళవాడి మరింత పెంచుకోడానికి
కొంచెం కొంచెం
ఆవిరయ్యే ఆశల్లో నుంచే
ఒయాసిస్సు లాంటి మేనిఫెస్టో పుడుతుంది.
దాహం ఇంకా పెంచడానికి
స్ట్రాలాంటి జెండాలు
మత్తును ఒంపి మరీ
కడివెడు స్వేదాన్ని
బిర్యానీ పొట్లు మిచ్చి పీల్చేస్తుంది.
వేదిక మబ్బుల నుండి
ఉచిత వడగండ్లు రాలుతాయి
ఆకలి నెర్రెలు బారిన
చెరువు గొంతులు జై కొడతాయి
అభివృద్ధి ఆకాశాన్ని

అధికారంలో నంజుకుంటూ
విమర్శల ఇసుక తుపానులతో
ఎడారు లెక్కడికో విస్తరిస్తాయి.
ఖాళీ పొయ్యిమీద సట్టి
పత్తాలేని చేపకోసం గుబులు పడుతుంది.
కళ్ళు లేని కబోదిలా
గుడిసె వలకోసం గుడ్డిగా ఎదురుచూస్తుంది.
బొట్లు బొట్లుగా ఓట్లు కొన్ని
చీరలు పీల్చుకుంటాయి
నవ్వుతున్న గాంధీ కళ్ళలో
మరికొన్ని ఇంకిపోతుంటాయి
చినుకుల కోసం
మీటల యుద్ధం మొదలవుతుంది
ప్రలోభాల డ్యాముల్లో
ప్రవహించని దేశం మిగిలిపోతుంది.
చీకిన వల స్థానంలో
మరో కొత్త వల పుట్టదు
నాలుగు చేపలు నిలుపుకోవడానికి
చెమట చుక్క కూడా మిగలదు
ఎడారుల కోసం
ఎగిరిపోయే చెరువులారా
నిన్ను తడిపే నింగికోసం
చూపుడు వేళ్ళ సిరాగా ప్రవహించండి చాలు!

- నల్లు రమేష్, పోతిరెడ్డిపాలెం

అరసం, విశాలాంధ్ర దినపత్రిక సంయుక్తంగా నిర్వహించిన కవితల పోటీలో ద్వితీయ బహుమతి రూ.2000 గెలుపొందిన కవిత

వినుకొండ తీర్పు విలక్షణం

సార్వత్రిక ఎన్నికలలో విలక్షణ తీర్పు నివ్వడంలో వినుకొండ ప్రజలు పేరెన్నికగన్నారు. శాసనసభ నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు పది మందిని అసెంబ్లీకి పంపించారు. వీరిలో సగం మంది రెండు దఫాలుగాను... మిగిలిన వారు ఒక్కసారి చొప్పున శాసనసభకు ఎన్నికయ్యారు. ఎన్నిక తీరును క్రమానుగతంగా పరిశీలిస్తే విచిత్రంగానే ఉంటుంది. రాజకీయ పరిశీలకుల దృష్టిలో వినుకొండ ప్రజలకు ఒక ప్రత్యేకమైన సెంటిమెంటు ఉందని ప్రచారం జరుగుతోంది. కమ్యూనిస్టు యోధుడు, తత్వవేత్త పులుపుల వెంకట శివయ్య సీపీఐ అభ్యర్థిగా 1957 నాటి ఎన్నికలలో విజయబావుటా ఎగురవేసి శాసనసభలో అడుగుపెట్టారు. తదుపరి 1955లో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి నలబోలు

పులుపుల వెంకట శివయ్య (సీపీఐ)

మక్కెన మల్లిఖార్జునరావు (కాంగ్రెస్)

జి.వి.ఆంజనేయులు (టీడీపీ)

బొల్లా బ్రహ్మానాయుడు (వైసీపీ)

గోవింద రాజులు ఎన్నికయ్యారు. 1962లో జరిగిన ఎన్నికలలో సీపీఐ అభ్యర్థిగా పులుపుల వెంకట శివయ్య విజయం సాధించి... రెండవ సారి ఎమ్మెల్యే అయ్యారు. శివయ్య అనంతరం భవనం జయప్రద కాంగ్రెస్ అభ్యర్థిగా 1967, 1972లో రెండు పర్యా యములు వినుకొండ నుంచి గెలిచారు. 1978లో జరిగిన ఎన్నికలలో ఆవుదారి వెంకటేశ్వర్లు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. 1983 ఎన్ని కల్లో సీపీఐ బలపరిచిన స్వతంత్ర అభ్యర్థిగా అభ్యుదయ కవి గంగినేని వెంకటేశ్వరరావు గెలిచారు. ఆయన గెలుపొందిన రెండేళ్లకే రాష్ట్ర రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు సంభవించి అసెంబ్లీ రద్దయింది. తిరిగి 1985లో ఎన్నికలు జరిగాయి. సీపీఐ అభ్యర్థిగా గంగినేని వెంకటేశ్వర రావు రెండవసారి పోటీ చేసి గెలుపొందారు. 1989లో కాంగ్రెస్ అభ్యర్థి నన్నపనేని రాజకుమారి వినుకొండలో పోటీ చేసి గెలుపొందారు. 1994, 1999 ఎన్నికలలో డాక్టర్ వీరపనేని ఎలమందరావు ఒకసారి స్వతంత్రంగా, మరోసారి టీడీపీ అభ్యర్థిగాను వరుస విజయాలు నమోదు చేశారు. 2004లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన మక్కెన మల్లికార్జునరావు గెలిచారు. 2009, 2014 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి జీవీ ఆంజనేయులు విజయం సాధించారు. 2019 ఎన్నికలలో బొల్లా బ్రహ్మానాయుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున గెలిచారు. పై క్రమానుగతాన్ని పరిశీలిస్తే ఒక అభ్యర్థి వరుసగా రెండుసార్లు గెలవడం... ఆ తదుపరి మరో అభ్యర్థి గెలవడం... ఇంకొక అభ్యర్థి వరుసగా రెండుసార్లు గెలవడం... వచ్చిన అభ్యర్థి ఒకసారికి పరిమితం కావడం కనిపిస్తుంది. పులుపుల శివయ్య, భవనం జయప్రద, గంగినేని వెంకటేశ్వరరావు, డాక్టర్ వీరపనేని ఎలమందరావు, జీవీ ఆంజనేయులు వరుసగా రెండుసార్లు గెలవడం, వీరి మధ్యలో పోటీ చేసిన నలబోలు గోవిందరాజులు, ఆవుదారి వెంకటేశ్వర్లు, నన్నపనేని రాజకుమారి, మక్కెన మల్లికార్జునరావు ఒక్కొక్కసారి మాత్రమే గెలుస్తూ సరిపుచుకోవడం పరిపాటిగా మారింది. ప్రస్తుత ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు సింగిల్ టైం ఎమ్మెల్యేగా పదవీకాలాన్ని పూర్తి చేసుకున్నారు. ప్రస్తుతం జీవీ ఆంజనేయులు, బొల్లా బ్రహ్మానాయుడుల మధ్య ప్రధానంగా పోటీ ఉంది.

- విశాలాంధ్ర–బొల్లాపల్లి